అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 21-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 29 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

గాజాపై భూతల దాడులు

ఇదే చివరి హెచ్చరిక : ఇజ్రాయిల్

గురువారం నాటి దాడుల్లో 85మంది మృతి

మూడు రోజుల్లో 200మంది చిన్నారులు కన్నుమూత



వివరాలు 11లో..

ఉభయ సభలకు తమిళ ఎంపీల టీషర్టుల సెగ

డీలిమిటేషన్ అంశంపై నినాదాలు

కొనసాగిన వాయిదాల పర్వం

తగ్గేదే లేదంటున్న డీఎంకే ఎంపీలు



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తమిళనాడు ఎంపీలు ధరించిన టీ షర్టులే పార్లమెంటు నిర్వహణకు అడ్డంకిగా మారాయి. వారు ధరించిన టీ షర్టులపై "న్యాయమైన డీలిమిటేషన్.. తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది" అనే నినాదం ఉంది. ఆ నినాదాలున్న టీషర్టులతో వారు సభల్లో ఉంటే కార్యకలాపాలు కొనసాగవని, వాటిని తొలగిస్తేనే సభ నిర్వహిస్తామని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మెన్ సభలు వాయిదా వేశారు.

గురువారం ఉభయ సభలకు చెందిన డీఎంకే ఎంపీలు డీలిమిటేషన్ అంశంపై నినాదం రాసి ఉన్న టీ-షర్టులు ధరించి పార్లమెంటుకు హాజరై, నిరసన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం తెలిపారు. కొంతమంది సభ్యులు సభా మర్యాదలు, నియమాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. సభా సభ్యుల ప్రవర్తనకు సంబంధించి 349వ నియమాన్ని ఎత్తిచూపారు. టీ-షర్టులు మార్చిన తర్వాతే కార్యకలాపాలు ప్రారంభిస్తానని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేస్తూ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైనప్పుడూ వారు టీ-షర్టులతోనే సభకు వచ్చారు. మధ్యాహ్నం 2 గంటల వరకు మళ్లీ వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలోనూ డీఎంకే ఎంపీలు టీషర్టులతోనే హాజరయ్యారు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. మూడు, నాలుగు నిమిషాల్లోనే సభ నేటికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు, తమిళనాడును అవమానించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు రాసిన దుస్తులనూ కొంతమంది ఎంపీలు ధరించి వచ్చారు. వారిని గమనించిన రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్కర్ సభా కార్యకలాపాలను గంటసేపు వాయిదా వేస్తున్నట్టు ...11లో



దండకారణ్యం రక్తసిక్తం

125కు పైగా గ్రామాల్లో హిడ్మా కోసం సెర్చ్ ఆపరేషన్



ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి

- డీఆర్‌జీ జవాన్ కూడా
- మూడు నెలల్లో 77 మంది హతం

నవతెలంగాణ- చర్ల

పచ్చటి అడవులు రక్తసిక్తమయ్యాయి. తాజాగా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. కాల్పుల్లో ఓ డీఆర్ జీ జవాన్ ప్రాణాలు కోల్పోయారు. 2026 నాటికి మావోయిస్టుల్లేకుండా చేయాలని కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాలతో.. దండకారణ్యంలోని ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఇదిలా ఉండగా మావోయిస్టుల ఏరివేత పేరిట కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లపై ప్రజాసంఘాలు, పౌరసమాజం నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి.

ఏం జరిగింది..?

బీజాపూర్, దంతెవాడ సరిహద్దు గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కోసం ఓ ఉమ్మడి బృందం బయలుదేరింది. సమీపంలోని అటవీ ప్రాంతంలో నుంచి కాల్పుల మోత వినిపించగా.. భద్రతా దళాల ఎదురు కాల్పులతో ఆ పరిసర ప్రాంతం దద్దరిల్లింది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. కాంకేర్ జిల్లా అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతదేహాలను సైనికులు ...10లో

ఉత్తరాదిలో ఉపాధి ఉంటే దక్షిణాదికి వలసలెందుకు?

నిరుద్యోగం 6.1 శాతానికి తగ్గుదల



సీఎం పదవి చేపట్టినప్పటికంటే

జెడ్పీటీసీ అయినప్పుడే ఎక్కువగా ఆనందించా

పదేండ్లలో చేయలేదు కాబట్టే మాకు అవకాశం

పదవి పోగానే కూతురుకు ఎమ్మెల్సీ, బంధువుకు ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్

అప్పు పుట్టని విధంగా తెలంగాణను మార్చిపోయిండు

పెండింగ్‌లో రూ.8 వేల కోట్ల రిటైర్డ్ బెనిఫిట్స్

మేం ధర్నాలు, నిరసనలు తెలుపుకునే స్వేచ్ఛనిచ్చాం

బీఆర్ఎస్ పాలనలో ఇసుకపై రూ.7 వేల కోట్ల దోపిడీ

రోజా సచివాలయానికి వచ్చే మాకు పాలనపై పట్టులేదనడం సరిగాదు

నల్లధనాన్ని ఇం'ధనం'గా మార్చి సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు :

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల్లో 922 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేతలో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 10లో..

ఇండ్లు లేని నిరుపేదలు 30 లక్షల మంది

రూ.8వేల కోట్లు ఏ మూలకూ సరిపోవు



ఇతర రంగాలు, పథకాలకు తగిన బడ్జెట్ ఏదీ..?

మ్యానిఫెస్టో హామీలు ఎక్కడ! : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవ తెలంగాణ -వనపర్తి

రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు 30 లక్షల మంది ఉన్నారని, ఈ బడ్జెట్లో వారికి రూ.8000 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ నిధులు ఏ మూలకూ సరిపోవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో గురువారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.బాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ విలేకరులతో మాట్లాడుతూ.. గత బడ్జెట్‌కు, ఈ బడ్జెట్‌కి ఏమీ తేడా లేదన్నారు. పెరుగుతున్న పెన్షన్లకు నిధులు కేటాయించలేదని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షలకు సంబంధించి ...11లో

మస్క్ గుప్పెట్లోకి టెలికాం?

స్టార్‌లింక్ కోసం భారత్‌లో మారుతున్న సమీకరణాలు

- ఇప్పటికీ అనేక ప్రశ్నలు, సందేహాలు
- కేంద్ర ప్రభుత్వంపై ఎలన్ 'ఎక్స్' దావా

న్యూఢిల్లీ: రెండు ప్రముఖ భారతీయ కంపెనీలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లతో స్టార్‌లింక్ ఒప్పంద ప్రకటనలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్‌మస్క్ టెలికాం రంగంలో గుత్తాధిపత్యం సాధించనున్నారా? వేలం లేకుండా స్టార్‌లింక్‌కు శాటిలైట్ స్పెక్ట్రమ్ దక్కుతుందా? దేశంలో కీలకమైన వనరు అయినటువంటి శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను భారత ప్రభుత్వం ఈ విధంగా వాణిజ్య కార్యకలాపాల కోసం ఇవ్వనుందా? అనే సందేహాలు తీవ్రమవుతున్నాయి. జియో, ఎయిర్‌టెల్‌లతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత స్టార్‌లింక్‌కు స్పెక్ట్రమ్ కేటాయింపు జరగనున్నట్టు తెలుస్తున్నది. మోడీ సర్కారు ఇప్పటికీ అటువైపుగా చర్యలు తీసుకుంటున్నదనే వాదనలూ ఉన్నాయి. దేశంలోని టెలికాం రంగంలో ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్‌ల ఆధిపత్యం నడుస్తున్నది. ఆ తర్వాతి స్థానంలో వొడాఫోన్ ఐడియా, ప్రభుత్వ యాజమాన్యంలోని బీఎస్ఎన్ఎల్‌లు ఉన్నాయి. అయితే, వీటి మధ్య ఉన్న తేడా చాలా ఎక్కువే. వేలం లేకుండా ప్రభుత్వం ద్వారా నేరుగా శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరిగితే.. మస్క్ ఆధిపత్యం పెరుగుతుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కీలకమైన కమ్యూనికేషన్ సేవల కోసం రెండు ప్రముఖ టెలికాం కంపెనీలు ఒక యూఎస్ కంపెనీపై ఆధారపడాల్సి ఉంటుందని అంటున్నారు. ఇది భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి విరుద్ధమని చెప్తున్నారు. ఒక స్వతంత్ర పాత్ర పోషించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. దాని వ్యూహాత్మక టెలికాం వనరులను విదేశీ సంస్థ నియంత్రణలోకి వెళ్లేలా చేయటం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. భారతదేశ ప్రధాన టెలికాం సంస్థలు, స్టార్‌లింక్ మధ్య అలాంటి భాగస్వామ్యాన్ని అనుమతిస్తే.. భారత టెలికాం సేవలను (ఉపగ్రహ ఫీడ్‌ను) మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ నియంత్రించే అవకాశాలే ఎక్కువని చెప్తున్నారు. జియో, ఎయిర్‌టెల్‌లు రెండూ గతంలో స్పేస్‌ఎక్స్ స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ సేవల్లోకి ప్రవేశించటాన్ని వ్యతిరేకించాయి. అయితే, భారత ప్రధాని మోడీ యూఎస్ పర్యటన తర్వాత.. జియో, ఎయిర్‌టెల్‌లు పూర్తిగా తమ వైఖరిని మార్చుకున్నాయి. స్పేస్‌ఎక్స్ స్టార్‌లింక్‌తో ...2లో



టాప్ ఫోర్ కంపెనీల మార్కెట్ షేర్

కంపెనీ	శాతం	వినియోగదారులు(మిలియన్లలో)
రిలయన్స్	40.4	465.1
భారతీ ఎయిర్‌టెల్	33.5	385.3
వోడాఫోన్, ఐడియా(వీఓ)	18.0	207.3
బీఎస్ఎన్ఎల్	8.0	91.7

13 నెలలు..ఏడు హామీలకోసం ఉద్యమం



కేంద్రమంత్రితో చర్చలకు పిలిచి..మరోవైపు అన్నదాతపై అరాచకం

శంభు, ఖనౌరీ సరిహద్దుల్లో రైతు శిబిరాల తొలగింపు

రోడ్లపై చెల్లాచెదురుగా వస్తువులు

పోలీసుల అదుపులో వందమంది రైతులు, రైతు నేతలు

సమర్థించుకున్న పంజాబ్ మంత్రి

వివరాలు 10లో.

భారత్ సుంకాలు తగ్గిస్తుందనుకుంటున్నా



డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా వస్తువులపై భారత్ విధించే సుంకాల పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. గతంలో ఓ సందర్భంలో ట్రంప్ మాట్లాడుతూ భారత్ పన్నులు తగ్గించేందుకు అంగీకరించిందని.. అదంతా తన ఘనతే అని చెప్పిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు మాత్రం తమ వస్తువులపై విధించే ...11లో

బీఆర్ఎస్ ఓటమికి అసూయ, ద్వేషమే కారణం..



రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ సీఎం

బడ్జెట్ అంతా బోగస్.. ఆరు గ్యారంటీలు గోవిందా..

కాంగ్రెస్‌తో కరువు వచ్చింది

రాష్ట్రం డబ్బుల మూటలు ఢిల్లీకి....

ఏప్రిల్ 27న వరంగల్ సభను విజయవంతం చేయాలి : సూర్యాపేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

11లో..

మూతపడుతున్న ఎంఎస్ఎంఈలు

ఈ ఆర్థిక సంవత్సరంలోనే 35 వేలకుపైగా పరిశ్రమలకు తాళాలు

మహారాష్ట్రలో 8,472 కంపెనీలు మూసివేత

ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, కర్నాటక




న్యూఢిల్లీ : దేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరు నాటికి 35,567 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) మూతబడ్డాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైనవే. ఎంఎస్ఎంఈల శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలియజేశారు. అయితే ఎంఎస్ఎంఈలు ఇంత పెద్ద సంఖ్యలో మూతపడడానికి కారణమేమిటో ఆమె వివరించలేదు. 2020 జులై 1వ తేదీన పోర్టల్ ప్రారంభం కాగా అప్పటి నుంచి 75,082 ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయని మాత్రం ఆమె తెలిపారు. ఇప్పటి వరకూ మూతబడిన మొత్తం ఎంఎస్ఎంఈలలో 47.4 శాతం ఒక్క ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మూతపడడం గమనార్హం. 2023-24తో పోలిస్తే ఈ ఏడాది దాదాపు రెట్టింపు పరిశ్రమలకు తాళం పడింది. గత సంవత్సరం 19,828 పరిశ్రమలు మూతబడ్డాయి. ఈ ఏడాది ఎంఎస్ఎంఈలు ఎక్కువ సంఖ్యలో మూతబడిన రాష్ట్రం మహారాష్ట్ర. ఆ రాష్ట్రంలో 8,472 పరిశ్రమలను మూసేశారు. తమిళనాడు (4,412), గుజరాత్ (3,148), రాజస్థాన్ (2,989), కర్నాటక (2,010) తర్వాతి స్థానాలలో నిలిచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్చి నెలకు సంబంధించిన సమాచారం రావాల్సి ఉన్నందున మూతపడిన పరిశ్రమల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యాపారాన్ని సరళతరం చేసేందుకు ఉద్యమ్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ఇటీవలి కాలంలో సులభతర వ్యాపారాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగానికి బడ్జెట్‌లో అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించారు. పెట్టుబడులు, టర్నోవర్ పరిమితులను పెంచారు. రుణ గ్యారంటీలను కూడా పెంచడం జరిగింది. అయినప్పటికీ వాటికి తాళాలు పడుతూనే ఉన్నాయి. ఫిబ్రవరి 28వ తేదీ వరకూ వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్ట్రరైన ఎంఎస్ఎంఈలు 6.05 కోట్లు. కోవిడ్-19 తర్వాత ఎంఎస్ఎంఈలు అధిక సంఖ్యలో తమ కార్యకలాపాలు నిలిపివేశాయి. అయితే ఈ మూసివేతల కారణంగా ఎంత మంది ఉపాధి కోల్పోయారన్న దానిపై ఎలాంటి గణాంకాలు అందుబాటులో లేవు. ఎంఎస్ఎంఈ శాఖ ...11లో

బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్..

మియాపూర్ పీఎస్‌లో 25 మందిపై కేసు నమోదు

వారిలో సినీ ప్రముఖులు కూడా..



నవతెలంగాణ-మియాపూర్

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన సినీ ప్రముఖులపై రంగారెడ్డి జిల్లా మియాపూర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ విషయంలో సెలబ్రిటీల పాత్ర సంచలనంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికై చాలా మంది సెలబ్రిటీలపై కేసులు నమోదు కాగా.. విచారణను సైతం ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రమోద్‌శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు 25 మంది సినీ సెలబ్రిటీలపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చేస్తున్న సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవాలని ప్రమోద్ ...10లో

కబ్జాకు పాల్పడితే చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

- పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే గాంధీ ఆరోపణల నేపథ్యంలో గంగారం చెరువు పరిశీలన



నవతెలంగాణ-చందానగర్

గంగారం పెద్ద చెరువు కబ్జాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పావని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధిలోని గంగారం పెద్ద చెరువును జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, హైడ్రా సిబ్బందితో కలిసి రంగనాథ్ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. చెరువు చుట్టూ ఎక్కడెక్కడ కబ్జాలు జరుగుతున్నాయి.. ఎంతమేర మట్టి పోశారు.. చెరువులో మట్టి నింపింది ఎవరు.. అనే దానిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు కబ్జాలకు గురవుతుంటే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిబ్బంది తీరుపై రంగనాథ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. గంగారం పెద్ద చెరువు ఆక్రమణకు గురవుతున్నదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ ఆరేకపూడి గాంధీ ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చామని తెలిపారు. చెరువును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు సంబంధించి గత మూడు నెలల్లో చెరువులో మట్టి పోస్తూ పూడుస్తున్న పలువురిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో హైడ్రా సిబ్బంది ఫిర్యాదు చేశారని, కేసులు కూడా నమోదైనట్టు వివరించారు. కబ్జాలకు పాల్పడేందుకు ముందుగా చెరువులో మట్టిని పోస్తారని, అనంతరం అక్కడ నిర్మాణాలు మొదలవుతాయని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డెక్కిన పాడి రైతులు

మద్దతు ధర కల్పించాలని డిమాండ్

- సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రహదారిపై పాలు పారబోసి నిరసన, ఆర్డీవోకు వినతి

నవతెలంగాణ-జహీరాబాద్

పాలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో పాడి రైతులు రోడ్డెక్కారు. రహదారిపైనే పాలు పారబోసి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు స్థానిక అతిథి గృహం నుంచి జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులు మహిపాల్‌రెడ్డి, రవి తదితరులు మాట్లాడుతూ.. ప్యాకెట్ పాలకున్న ధర స్వచ్ఛమైన పాలకు ఉండదా అని ప్రశ్నించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఉన్న హట్సన్ కంపెనీకి సంబంధించిన పాల పరిశ్రమ యజమాన్యంతో పాటు వివిధ కంపెనీలకు చెందిన డైరీ నిర్వాహకులు తమ వద్ద కొనుగోలు చేస్తున్న పాలకు కేవలం లీటర్ రూ.60 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. తమ వద్ద కొనుగోలు చేసిన పాలను డొనేట్ చేసి లీటర్ రూ.90కి విక్రయిస్తున్నారన్నారు. కలుషితమైన ప్యాకెట్ పాల కంటే తమ స్వచ్ఛమైన పాలకు మద్దతు ధర ఎక్కువగా ఉండాలన్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఉన్నతాధికారులు ఆలోచించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు రాజు, నర్సింలు, మైనోద్దీన్ గుడి సాబ్, చంద్రకాంత్, నరసింహారెడ్డి, రాజు రెడ్డి, చందనం తదితరులు పాల్గొన్నారు.

మస్క్ గుప్పెట్లోకి టెలికాం?

(మొదటిపేజీ తరువాయి)

జతకట్టటానికి అంగీకరించాయి. అలాగే, జియో లక్సెంబర్గ్ ఎస్ఈఎస్‌తో, ఎయిర్‌టెల్ యూటెల్‌సాట్ వన్‌వెబ్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అంతరిక్ష శాఖ కింద ఉన్న ఇన్-స్పేస్ఎక్స్ ఈ రెండు సందర్భాలలో అనుమతిచ్చింది. ఇక స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలు, వీటిని ఎలా సెట్ చేస్తారనే దానిపైనా స్పష్టత లేదని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ఉపగ్రహ సమాచార మార్పిడికి ఇతర సమస్యలూ ఉన్నాయి. ప్రస్తుతమున్న అంతరిక్ష ఆధారిత ఇంటర్నెట్ (శాట్‌కామ్)ను జియోస్టేషనరీ ఉపగ్రహాలు అందిస్తున్నాయి. స్టార్‌లింక్ ఏడువేల కంటే ఎక్కువ ఉపగ్రహాలను కక్ష్యలో కలిగి ఉన్నదని నిపుణులు గుర్తు చేస్తున్నారు. అయితే, కక్ష్యలో ఎవరు ఎంత స్థలాన్ని ఆక్రమించవచ్చనేదానిపై ఎలాంటి నియంత్రణ కానీ, అంతర్జాతీయ ఒప్పందం కానీ లేదని చెప్తున్నారు. ఇది స్టార్‌లింక్‌కు, అమెరికాకు బాగా కలిసి వచ్చే అంశమని అంటున్నారు.

కేంద్ర ప్రభుత్వంపై ఎలన్ 'ఎక్స్' దావా

ఎలన్ మస్క్ నేతత్వంలోని సోషల్ మీడియా 'ఎక్స్' కేంద్ర ప్రభుత్వంపై దావా వేసింది. ఈ మేరకు కర్నాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చట్టవిరుద్ధంగా కంటెంట్‌ను నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని కేంద్రంపై ఆరోపణలు చేసింది.

ఐటీ చట్టం, సహెయ్యాగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధమైన రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందికే వస్తుందని ఎక్స్ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(ఎ)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. ఐటీ చట్టం ప్రకారం.. బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించకపోతే, ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ చేసే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని ఎక్స్ వాదిస్తోంది. సెక్షన్ 69(ఎ)ని పక్కదారి పట్టించడానికి అధికారులు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది.

దేశంలో అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే పోస్టులు, పూర్తి వివరాలు లేకుండా సష్టించిన ఖాతాలపై నియంత్రణ విధించేందుకు సెక్షన్ 69-ఎ ప్రకారం కేంద్రానికి అధికారం ఉంటుంది. అదేసమయంలో సెక్షన్ 79(3)(ఎ) స్పష్టమైన నియమాలు, తనిఖీలు లేకుండా సమాచారాన్ని బ్లాక్ చేయడానికి అధికారులు అనుమతి ఇస్తున్నారని తన పిటిషన్‌లో ప్రస్తావించిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది విస్తతమైన సెన్సార్‌షిప్‌నకు దారితీస్తోందని విమర్శలు చేసింది. ఈ దావాపై కేంద్ర ప్రభుత్వవర్గాల నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వం చట్టాన్ని అనుసరించి ముందుకెళ్తుందని, సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందేనని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

రైతులపై అనాగరిక దాడి : కిసాన్ సభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం రైతులపై అనాగరిక దాడికి పాల్పడిందనీ, జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ, కిసాన్ సభ తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు ఆ సంఘాల నేతలు కిచ్చెల రంగారెడ్డి, వి ప్రభాకర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిన అనంతరం తిరిగి వస్తున్న రైతు నాయకుడు డాలే వాల్ సహా తమ అనుచర బృందాన్ని అరెస్టు చేయటం అమానుషమని తెలిపారు. శంభు, ఖానౌరి శిబిరాలను పోలీసులు ధ్వంసం చేశారని తెలిపారు. ప్రభుత్వ దమన నీతిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

13 నెలలు.. ఏడు హామీల కోసం ఉద్యమం

- కేంద్రమంత్రితో చర్చలకు పిలిచి.. మరోవైపు అన్నదాతపై అరాచకం
- పోలీసుల అదుపులో వంద మంది రైతులు, రైతు నేతలు
- సమర్థించుకున్న పంజాబ్ మంత్రి



న్యూఢిల్లీ : 13 నెలల తర్వాత.. శంభు సరిహద్దు ప్రయాణికుల కోసం తెరిచారు. దాదాపు 404 రోజుల తర్వాత పంజాబ్, అంబాలా మార్గంలో వాహనాలు నడుస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఏడు హామీల కోసం రోడ్డెక్కిన అన్నదాతల్ని.. ఎలాగైనా దెబ్బకొట్టాలన్న కేంద్రం వ్యూహం ఫలించింది. ఓ వైపు రైతు నేతలతో చర్చలకు రమ్మని పిలిచి.. సరిగ్గా వారు లేని సమయం చూసుకుని జేసీబీలతో పోలీసులు రెచ్చిపోయారు. శంభు ,ఖనౌరి సరిహద్దుల నుంచి రైతులను తొలగించి, బుల్డోజర్ల సహాయంతో అక్కడి తాత్కాలిక నైట్ షెల్టర్లను కూల్చివేసారు. ఈ మార్గంలో రైతులు దాదాపు 13 నెలలుగా నిరసనలు చేస్తున్నారు.

గతేడాది నవంబరు 26 నుంచి నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు డాక్టర్ల బృందం పర్యవేక్షిస్తోంది. కాగా రైతు ఆందోళనల నేపథ్యంలో రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్‌ను జలంధర్ లోని పిమ్స్ (పంజాబ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కి పంజాబ్ పోలీసులు తరలించారు. గురువారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఆయనను ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఆసుపత్రి వెలుపల భారీగా పోలీసు బలగాలు మోహరించాయి.

కాగా, బుధవారం రైతులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన బాట పట్టారు. శంభు, ఖనౌరీ సరిహద్దుల్లో నిరసనలు చేపట్టిన రైతులను పోలీసులు బలవంతంగా తరలించడాన్ని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) రైతు సంఘం నేత రాకేశ్ తికాయత్ ఖండించారు. ఒకవైపు రైతు డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం రైతు సంఘాలతో చర్చలు జరుపుతోంది. మరోవైపు నిరసన చేస్తున్న రైతుల్ని అరెస్టు చేస్తోంది. ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను అని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

మరోపక్క వందమందికి పైగా రైతులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని రైతు సంఘాలు తెలిపాయి. ఇదిలావుండగా శంభు, ఖానౌరి ఏరియాల్లో మకాం వేసి ఏడాది కాలంగా ఆందోళనలు చేస్తున్న రైతులను పంజాబ్ పోలీసులు బలవంతంగా తరలించి, నిరసన ప్రాంతాల్లో రోడ్లను క్లియర్ చేస్తున్నారు. సరిహద్దులను తిరిగి తెరవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పంజాబ్ మంత్రి హర్పాల్ సింగ్ చీమా సమర్థించుకున్నారు. కాగా కాంగ్రెస్, అకాలీదళ్ నేతలు మాత్రం ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వంతో రైతు నేతల తదుపరి దఫా చర్చలు మే 4న జరగనున్నాయి.

పోలీసుల అరాచకం, అణచివేత

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలు, వేదికలను తొలగించిన వెంటనే రెండు హైవేలపైనా రాకపోకలకు మార్గం సుగమం చేస్తామని పోలీసులు చెప్పారు. రైతులు పెట్టుకున్న ట్రాలీలను, ఇతర వాహనాలను అక్కడ నుంచి తీసివేస్తున్నారు. పోలీసుల అణచివేత చర్యలతో శంభు సరిహద్దు ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. బుధవారం వరకు ఈ తాత్కాలిక నిర్మాణాలు, ట్రాలీలే రైతులకు ఆశ్రయం కల్పించాయి. కానీ గురువారం నాటికి ఒక్కసారిగా అవన్నీ నేలమట్టమయ్యాయి. ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు వీలుగా జెసిబి యంత్రాలతో వాటన్నింటినీ శిథిలాల గుట్టగా మార్చేశారు. వంటకు ఉపయోగించే పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, టీ కెటిళ్ళు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, కుర్చీలు, టేబుళ్ళు, పరుపులు, బట్టలు ఇలా గతేడాది ఫిబ్రవరి నుండి రైతులు ఉపయోగించిన ప్రతీ వస్తువూ రోడ్లపై చెల్లాచెదురుగా పడి వున్నాయి. తమకు ముందుగా ఎలాంటి సమాచారం అందించలేదని, అకస్మాత్తుగా పోలీసులు వచ్చి విధ్వంసానికి దిగారని రైతు నేత ఒకరు చెప్పారు. పోలీసులు ఈ చర్యలకు దిగడానికి ముందుగా భారీ ఎత్తున భద్రతా బలగాలను మోహరించారు. అందులో అంబులెన్సులు, బస్సులు, అగ్నిమాపక యంత్రాలు, అల్లర్ల నిరోధక బృందాలు వున్నాయి. దాదాపు 3వేల మంది పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. అక్కడ నుండి ఖాళీ చేయడానికి రైతులకు కేవలం పది నిముషాలు సమయమిచ్చారు. లేనిపక్షంలో వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలిస్తామని హెచ్చరించారు.

పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ నిరసన

కాగా పోలీసుల అణచివేత చర్యలపై పార్లమెంట్ ఆవరణలో పంజాబ్ కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలియచేశారు. వారిని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కలిసి మాట్లాడారు. రైతు వ్యతిరేక పార్టీలు రెండూ చేతులు కలిపాయని కాంగ్రెస్ విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తొలుత పంజాబ్ ప్రభుత్వం చర్చల కోసం రైతులను పిలిచి తర్వాత వారిని నిరసన శిబిరాల నుంచి బలవంతంగా వెళ్ళగొట్టారని విమర్శించారు. కాగా, రైతులపై దాడులకు దిగారంటూ ఆప్, బిజెపి ప్రభుత్వాలపై తీవ్రంగా ధ్వజమెత్తింది. ఈ వెన్నుపోటు చర్యలకు పంజాబ్ ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటారని కాంగ్రెస్ నేత సుప్రియ శ్రినెట్ హెచ్చరించారు.

పంజాబ్, హర్యానాల మధ్య శంభు (శంభు-అంబాలా), ఖానౌరి (సంగ్రూర్- జింద్) సరిహద్దు పాయింట్ల వద్ద రైతులు గత ఏడాది శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఢిల్లీకి వారు చేపట్టిన ప్రదర్శనను భద్రతా బలగాలు భగ్నం చేయడంతో గతేడాది ఫిబ్రవరి 13న ఈ నిరసన ప్రారంభమైంది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీని కల్పించడంతో సహా పలు డిమాండ్లు నెరవేర్చాలని రైతులు కోరుతున్నారు.

ధర్నాలకు పిలుపు

పోలీసుల అణచివేత చర్యలను కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంఎస్‌సీ) నాయకుడు సత్నాం సింగ్ పన్నూ తీవ్రంగా ఖండించారు. కేంద్రంతో కుమ్మక్కైన పంజాబ్ ప్రభుత్వం రైతులపై అణచివేతకు పాల్పడుతోందని విమర్శించారు. వెంటనే సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల నేతృత్వంలో రైతులు ధర్నాలకు పిలుపిచ్చారు. పంజాబ్, ఇతర రాష్ట్రాల్లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల వెలుపల ధర్నాలు చేపట్టాలని రైతు సంఘాలు పిలుపిచ్చాయి. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని కర్నాల్ నివాసం వెలుపల రైతులు ధర్నా చేశారు. ఫిరోజ్‌పూర్‌లో డిసి కార్యాలయం వెలుపల కూడా రైతులు నిరసనలు చేపట్టారు. అయితే రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం మాత్రమే పరిష్కరించగలదని ఆప్ నేత సందీప్ పాథక్ వ్యాఖ్యానించారు.

ఏప్రిల్ 25 నుంచి ఖమ్మంలో

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- ఇచ్చిన హామీలు సైతం కాంగ్రెస్ అమలు చేయడం లేదు
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి
- పోరాడుతున్న వారి అక్రమ అరెస్టులు దుర్మార్గపు చర్య : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు



నవతెలంగాణ-ఖమ్మం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు ఏప్రిల్ 25, 26, 27 తేదీల్లో ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సుధాకర్, తుడుం ప్రవీణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడారు. 20 ఏండ్ల తర్వాత ఖమ్మం నగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జరుపుతున్నామని, ఈ సభల్లో రాష్ట్ర విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలు, 10 యూనివర్సిటీల నుంచి ఎంపిక చేసిన 1000 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్టు చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, రూ.23,108 కోట్ల కేటాయింపు విద్యారంగ అభివృద్ధికి ఏ మాత్రం సరిపోవని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతం కంటే 0.2 శాతం మాత్రమే పెంచారని, ఉస్మానియా, కాకతీయ, జెఎన్టీయూహెచ్ లాంటి యూనివర్సిటీలకు నిధులు లేవని తెలిపారు. రాష్ట్రంలో ఆరేండ్ల నుంచి పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్ రూ.8,258 కోట్లు పెండింగ్ ఉన్నాయని వాటిని విడుదల చేయకుండా, కనీసం ప్రస్తావించకుండా బడ్జెట్ పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో సర్క్యూలర్ పేరుతో నియంతృత్వ విధానాలు, అప్రజాస్వామిక చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాడుతున్న విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ శక్తులను అప్పజెప్పే చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు వినోద్, పూజిత, మనోజ్, త్రినాథ్, లోకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల విద్యకు నిధులేవి ?

మదర్సాలు, వక్ఫ్ పథకాలకు కేటాయింపులు నాస్తి

అక్షరాస్యతలో వెనుకబడినా ప్రభుత్వ ఆదరణకు నోచని మైనారిటీలు

కక్ష సాధింపు చర్యలకు దిగుతున్న బీజేపీ పాలిత రాష్ట్రాలు



న్యూఢిల్లీ : ముస్లిం విద్యార్థుల కోసం ఉద్దేశించిన పథకాలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా తగ్గించి వేస్తోంది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ కాదు. మదర్సాలు, వక్ఫ్ పథకాలకు బడ్జెటరీ కేటాయింపులు, వ్యయంపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓ బ్రియాన్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం పార్లమెంటులో ఇచ్చిన సమాధానాన్ని పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. మదర్సాలు/మైనారిటీ సంస్థల్లో విద్యను అందించేందుకు ఉద్దేశించిన పథకానికి (ఎస్‌పీఈఎంఎం) 2021-22లో రూ.174 కోట్లు కేటాయించగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం నామమాత్రంగా 0.01 కోట్లకు తగ్గిపోయింది. 2021-22లో మినహా మిగిలిన బడ్జెట్లలో కేటాయించిన అరకొర నిధులను సైతం ఖర్చు చేయలేదు.

తగ్గుతున్న కేటాయింపులు

మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ (సీడబ్ల్యూసీ) ద్వారా రెండు వక్ఫ్ పథకాలు...ఖ్వామీ వక్ఫ్ బోర్డ్ తరఖ్ఖియాతీ పథకం (క్యూడబ్ల్యూబీటీఎస్), షహరీ వక్ఫ్ సంపత్తి వికాస్ యోజన (ఎస్‌డబ్ల్యూఎస్‌ఎస్‌వై)...అమలు చేస్తోంది. సీడబ్ల్యూసీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయనందున వ్యయం తక్కువగా ఉంది' అని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తన లిఖితపూర్వక సమాధానంలో పార్లమెం టుకు తెలియజేశారు. ఎస్‌పీఈఎంఎంను 2021లో విద్యా శాఖ నుండి మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు బదిలీ చేశారు. ఈ పథకానికి 2021-22 వరకూ మాత్రమే ఆమోదం ఉన్నందున దానిని అప్పటి వరకే అమలు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. 2021-22లో ఎస్‌పీఈఎంఎంకు రూ.174 కోట్లు కేటాయించగా అందులో రూ.161.53 కోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాతి సంవత్సరాలలో కేటాయింపులు గణ నీయంగా తగ్గిపోయాయి. 2022-23లో రూ.30 కోట్లు, 2023-24లో రూ.5 కోట్లు, 2024-25లో రూ.0.01 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నామమాత్రపు కేటాయింపుల్లో కూడా 2022-23లో 0.08 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక్క రూపాయిని కూడా ఖర్చు చేయలేదు.

అక్షరాస్యతలో వెనుకంజ

ముస్లింలలో అక్షరాస్యత జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సమయంలో వారి విద్యా పథకాలకు కేటాయింపులు తగ్గించడం విచారకరం. ఏడు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న ముస్లింలలో అక్షరాస్యత రేటు 79.5 శాతం ఉండగా అదే వయసులో ఉన్న అన్ని మతాల వారి అక్షరాస్యత రేటు 80.9 శాతం. 2019-24 మధ్య కాలానికి సంబంధించి పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికలు చెబుతున్న దాని ప్రకారం ముస్లింలలో అక్షరాస్యత రేటు 75.9 శాతం నుండి 79.5 శాతానికి పెరిగింది. అయితే ఈ కాలంలో నమోదైన జాతీయ సగటు కంటే ఇది తక్కువే. గత రెండు దశాబ్దాలుగా ఇదే ధోరణి కొనసాగుతోంది. 2001 జనగణన ప్రకారం ఏడు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న ముస్లింలలో అక్షరాస్యత రేటు 59.1 శాతం (జాతీయ రేటు 64.8 శాతం) కాగా 2011 జనగణనలో అది 68.5 శాతానికి (జాతీయ రేటు 73 శాతం) పెరిగింది.

2019-20తో పోలిస్తే ఉన్నత విద్యలో ముస్లింల ప్రవేశం 8 శాతం మేర తగ్గిందని 2020-21 సర్వే తెలిపింది. ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కంటే కూడా ముస్లింలు వెనుకబడి ఉన్నారు. ఉన్నత విద్యలో ముస్లిం మహిళల ప్రవేశం 2016-17, 2019-20 మధ్య పెరిగినప్పటికీ 2020-21లో పడిపోయింది. విద్యార్థుల్లో ముస్లింల శాతం ఆరవ తరగతి నుండే తగ్గుతూ వస్తోంది. 11, 12 తరగతులకు వచ్చే సరికి అది మరింతగా తగ్గుతోంది. బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ముస్లిం విద్యార్థుల సంఖ్య బాగా తక్కువగా ఉండగా అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో డ్రాపవుట్లు అధికంగా ఉంటున్నాయి. పాఠశాల సెకండరీ స్థాయిలోనే 18.64 శాతం మంది ముస్లిం విద్యార్థులు చదువులకు స్వస్తి చెబుతున్నారు.

ఎస్‌పీఈఈఎంఎం అంటే...

ముస్లింలకు ఉద్దేశించిన విద్యా పథకాలలో మరింత మంది మైనారిటీలను లబ్దిదారులుగా చేర్చేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014-15లో ఎస్‌పీఈఎంఎంను ప్రారంభించింది. మదర్సాలు కేవలం మతపరమైన విద్యను మాత్రమే అందిస్తున్నాయని భావించిన మోడీ ప్రభుత్వం ఎస్‌పీఈఎంఎం ద్వారా ముస్లిం విద్యార్థులకు ఆధునిక సబ్జెక్టులు కూడా బోధించాలని, వారికి ఉపాధ్యాయ శిక్షణ అందించాలని, మదర్సా బోర్డులను పటిష్టవంతం చేయాలని, మైనారిటీ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని, విద్యా కార్యక్రమాల పట్ల ముస్లింలలో అవగాహన పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇతర కేంద్ర పథకాలకు నిధులు ఎలా అందజేస్తున్నారో ఎస్‌పీఈఎంఎంకు కూడా అలాగే ఇస్తున్నారు. గుర్తింపు పొందిన పాఠశాల విద్యా బోర్డుకు అనుబంధంగా ఉండే మదర్సాలకు ఆర్థిక సాయం లభిస్తోంది. ఆధునిక సబ్జెక్టులు బోధించే గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు నెలకు రూ.6,000, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు రూ.12,000 జీతం ఇస్తారు. ఎస్‌పీఈఎంఎంకు 2014-15 నుండే కేటాయింపులు మొదలయ్యాయి. ఆ ఏడాది రూ.194 కోట్లు కేటాయించారు. 2016-17, 2017-18లో రూ.120 కోట్ల చొప్పున కేటాయింపులు జరిగాయి. 2019-20లో కూడా అవే కేటాయింపులు. 2021-22లో బడ్జెటరీ కేటాయింపులు పెంచినప్పటికీ ఆ తర్వాత దారుణంగా తగ్గిపోయాయి.

మదర్సాలే లక్ష్యంగా...

ముస్లింలలో విద్య పరిస్థితి ఇంత దారుణంగా ఉంటుంటే బీజేపీ పాలిత రాష్ట్రాలు మదర్సాలను లక్ష్యంగా చేసుకొంటున్నాయి. 2021లో హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని అస్సాం ప్రభుత్వం మదర్సా విద్యకు సంబంధించిన రెండు చట్టాలను రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ నిధులతో నడిచే మదర్సాలు మూతపడ్డాయి. వీటిని జనరల్ పాఠశాలలుగా మార్చేశారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మదర్సా విద్యా బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని చూస్తోంది. చట్టం రాజ్యాంగబద్ధంగానే ఉన్నదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన కొద్ది రోజులకే ప్రభుత్వం దానిని రద్దు చేయాలని ప్రతిపాదించింది. మదర్సాలలో చిన్నారులు సరైన విద్యను పొందలేరని బాలల హక్కుల రక్షణకు సంబంధించిన జాతీయ కమిషన్ సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ సంస్థల్లో బోధించే పాఠ్యపుస్తకాలు ఇస్లాంను కీర్తిస్తాయని చెప్పింది. బీహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలోని మదర్సాలలో చదువుకుంటున్న ఇతర మతాల విద్యార్థులు వాటిపై ఆరోపణలు చేస్తున్నారని వివరించింది. ఇవన్నీ ఇలా ఉంటే వక్ఫ్ (సవరణ) బిల్లును ఆమోదించేందుకు ఇప్పుడు పార్లమెంట్ సిద్ధపడుతోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే వక్ఫ్ ఆస్తులపై సెంట్రల్ రెగ్యులేటరీ అథారిటీకి మరిన్ని అధికారాలు లభిస్తాయి. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు సభ్యులుగా చేరతారు. ప్రస్తుతం మత, ధార్మిక ట్రస్టుల ఆర్థిక సహకారంతో ఈ బోర్డులు నడుస్తున్నాయి. ఇవి దేశంలో మెజారిటీ మదర్సాలను నడుపుతున్నాయి. వక్ఫ్ బోర్డుల అధీనంలో మదర్సాలు సహా అనేక ఆస్తులు ఉన్నాయి. ఇప్పుడవి ఇస్లాం ట్రస్టులకు బదులు కేంద్ర నియంత్రణలోకి వెళ్లిపోతాయి.

విదేశాలకు వెళ్లొద్దు

అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారుల సూచన



వాషింగ్టన్ : హెచ్-1బీ వీసాలు ఉన్న వారు, వారి పిల్లలు, అంతర్జాతీయ విద్యార్థులు, చివరికి గ్రీన్‌కార్డులు ఉన్న వారు సైతం విదేశాలకు వెళ్లవద్దని అమెరికా ఇమ్మిగ్రేషన్ అటార్నీలు సలహా ఇచ్చారు. అమెరికా ప్ర0భుత్వం పర్యాటక నిషేధం విధించిన దేశాల జాబితాలో భారత్ లేనప్పటికీ భయాందోళనలు మాత్రం కొనసాగుతున్నాయి. గ్రీన్‌కార్డులు ఉన్న వారికి అటార్నీలు ఇప్పటికే సూచనలు చేయడం జరిగింది. స్వదేశంలోని అమెరికా కాన్సులేట్‌లో స్టాంపింగ్ ఆలస్యం కావడం, కఠినమైన పరిశీలనలు, సెకండరీ తనిఖీలు, స్వదేశం నుండి తిరిగి వచ్చే వారిని విమానాశ్రయాలలో నిర్బంధించడం వంటి పరిణామాలను ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. హెచ్-1బీ వీసాలు లేదా ఎఫ్-1 వీసాలను రెన్యువల్ చేయించుకోవాల్సిన అవసరం ఉన్న వారు అమెరికాను వదిలి వెళ్లే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని సియాటెల్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ కృపా ఉపాధ్యాయ్ కోరారు. వ్యక్తిగత ఇంటర్వ్యూకు హాజరు కాకుండా సంబంధిత అప్లికేషన్ కేంద్రంలో అవసరమైన పత్రాలు సమర్పించి వీసాలు రెన్యువల్ చేయించుకోవాలని అనుకునే వారి కోసం (దీనినే డ్రాప్‌బాక్స్ అప్పాయింట్‌మెంట్ అంటారు) అమెరికా విదేశాంగ శాఖ నిబంధనలను కఠినతరం చేసింది. ఇదిలావుండగా హెచ్-1బీ వీసాల కోసం గతంలో సమర్పించిన దరఖాస్తులను ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్‌వే (ఫ్లాగ్) వ్యవస్థ నుండి తొలగించే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. అర్హత కలిగిన ఉద్యోగులను అన్వేషించే అమెరికా కంపెనీలకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతోంది. ఇందులో తాత్కాలిక లేబర్ కండిషన్ దరఖాస్తులే కాకుండా శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులు కూడా ఉంటాయి. ఇప్పుడు వీటన్నింటినీ ఫ్లాగ్ వ్యవస్థ నుండి తొలగిస్తున్నారు.

గాంధీ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కోసం

అదనంగా 30 పడకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెరుగుతున్న రోగులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో అదనంగా 30 పడకలను ఏర్పాటు చేశారు. అత్యవసర విభాగంలో ఏర్పాటు చేసిన బెడ్లను సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలందించేందుకు వీలుగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి గురువారం మెడికల్, పారామెడికల్ విభాగాలతో సమావేశం నిర్వహించారు. రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని ఆమె పలు సూచనలు చేశారు. అదనంగా ఏర్పాటు చేసిన 30 పడకల్లో 15 బెడ్లను శస్త్ర విభాగం కోసం, మరో 15 బెడ్లను వైద్య చికిత్స విభాగం కోసం కేటాయించినట్టు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సునీల్, విభాగాధిపతులు డాక్టర్ ఎల్.సునీల్ కుమార్, డాక్టర్ రాజారామ్, డాక్టర్ వాల్యాతో పాటు పలువురు వైద్య అధికారులు, నర్సింగ్, సాంకేతి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికాలో

భారత స్కాలర్ నిర్బంధం

- పాలస్తీనాకు మద్దతు ఇచ్చారని ట్రంప్ ప్రభుత్వ ఆరోపణ
- భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారు : విమర్శకులు



వాషింగ్టన్ : వాషింగ్టన్‌లోని జార్జ్ టౌన్ యూనివర్సిటీకి చెందిన భారతీయ స్కాలర్ బాదర్ ఖాన్ సూరిని ట్రంప్ ప్రభుత్వం నిర్బంధించింది. పాలస్తీనా లోని హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారంటూ ఆయనపై ఆరోపణలు మోపింది. సూరిని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం అదుపులోకి తీసుకున్నదని, ప్రభుత్వం ఆయన వీసాను రద్దు చేసిందని యూనివర్సిటీ తాత్కాలిక అధ్యక్షుడు రాబర్ట్ గ్రోవ్స్ వర్సిటీ డైరెక్టర్ల బోర్డుకు తెలియజేశారు. సూరి చట్టవిరుద్ధ కార్యకలాపానికి పాల్పడినట్లు వర్సిటీకి తెలియదని, ఆయన నిర్బంధానికి కారణమేమిటో వివరించలేదని గ్రోవ్స్ తెలిపారు.

ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి స్థాపనపై సూరి డాక్టరేట్ పరిశోధనలు చేస్తున్నారు. దక్షిణాసియాలో మెజారిటీ వాదం, మైనారిటీ హక్కులపై ఆయన విశ్వవిద్యాలయంలో తరగతులు బోధిస్తున్నారు. ప్రస్తుతం సూరి లూసినియాలో ఉన్నారని, ఇమ్మిగ్రేషన్ కోర్టులో విచారణ కోసం ఎదురు చూస్తున్నారని ఆయన న్యాయవాది హస్సన్ అహ్మద్ తెలిపారు. వర్జీనియాలోని అర్లింగ్టన్ సమీపంలో ఉన్న రోస్లిన్‌లో ఇంటి వెలుపల ఉన్న సూరిని ముసుగులు ధరించిన ఏజెంట్లు 17వ తేదీ రాత్రి అరెస్ట్ చేశారు. ధిక్కార స్వరం వినిపిస్తున్న మరో అమాయకుడిని ట్రంప్ ప్రభుత్వం అపహరించి, జైలులో పెట్టిందని అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ప్రభుత్వంలోనే ఉంది తప్ప స్కాలర్‌లో కాదని ఆయన వ్యాఖ్యానించారు.

సూరి హమాస్‌కు అనుకూలంగా ప్రచారం చేయడమే కాకుండా సామాజిక మాధ్యమాలలో యూదుల పట్ల ద్వేషాన్ని కనబరుస్తున్నారని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) ప్రతినిధి ట్రిసియా మెక్లాలిన్ తెలిపారు. హమాస్‌కు సీనియర్ సలహాదారుగా వ్యవహరిస్తున్న అనుమానిత ఉగ్రవాది ఒకరితో సూరికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. సూరి భార్య అమెరికా పౌరురాలే. అయితే ఆమెకు పాలస్తీనా వారసత్వం ఉన్నదన్న కారణంతో సూరిని శిక్షిస్తున్నారని న్యాయవాది తన పిటిషన్‌లో తెలియజేశారు. సూరి దంపతులకు అరాఫత్ అనే కుమారుడు ఉన్నాడు. అమెరికా ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని సూరి అరెస్ట్ నిరూపిస్తోందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనకు మద్దతు ఇచ్చిన కొలింబియా యూనివర్సిటీ విద్యార్థి మహమూద్ ఖలీల్‌ను కూడా ట్రంప్ ప్రభుత్వం కటకటాల వెనక్కి నెట్టింది. నిర్బంధ చర్యను ఎదుర్కొన్న భారతీయుల్లో సూరి రెండో వారు. ఈ నెల ప్రారంభంలో కొలంబియా యూనివర్సిటీ స్కాలర్ రంజని శ్రీనివాసన్ వీసాను అమెరికా విదేశాంగ శాఖ రద్దు చేయడంతో ఆమె ఆ దేశాన్ని వదిలేయాల్సి వచ్చింది. ట్రంప్ ప్రభుత్వం ఆమెపై 'ఉగ్రవాద సానుభూతిపరురాలు' అనే ముద్ర వేసింది. అయితే తన పాలస్తీనా అనుకూలత కేవలం సోషల్ మీడియాకే పరిమితమని ఆమె వివరించారు. నిరసనలకు పెట్టింది పేరైనా కొలంబియా వర్సిటీపై ట్రంప్ ఇప్పటికే అనేక ఆంక్షలు విధించారు. వర్సిటీకి 400 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని పునరుద్ధరించాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలి

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టును ఖండిస్తున్నాం

- వీసీ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ఉన్న ఆంక్షలను ఎత్తేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్సిటీలో నిరసన కార్యక్రమాలను నిషేధిస్తూ వీసీ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఓయూలో ఉన్న వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి సంపూర్ణమైన మద్దతును ప్రకటించారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికి పూర్తిగా బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓయూ వీసీతో ఇలాంటి సర్క్యులర్ ఇప్పించింది ప్రభుత్వమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఒక వర్సిటీ వీసీ ఇంతటి అప్రజాస్వామికమైన ఆదేశాలను జారీచేయడమనేది సాధ్యమయ్యే పని కాదని తెలిపారు. కచ్చితంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ పోకడల కిది నిదర్శనమే అవుతుందని విమర్శించారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణస్వీకారం చేసే సమయంలో ప్రజాభవన్‌గా తాను మార్చిన ప్రగతిభవన్ ముందు ఉన్న ముండ్ల కంచెలను ధ్వంసం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించా మన్నారని గుర్తు చేశారు. వారు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ అన్నారని తెలిపారు. ఓయూలో ఇప్పుడు జరుగుతున్నదేమిటని ప్రశ్నించారు. జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలను కాంగ్రెస్ నాయకత్వం మరచిపోయిందా?అని అడిగారు. వర్సిటీ కేంద్రాలు భావ సంఘర్షణ కేంద్రాలుగా విరసిల్లాలంటూ నెహ్రూ చెప్పారని గుర్తు చేశారు.రాజకీయలు, ప్రజాస్వామ్య విలువలుంటాయని తెలిపారు. ఇవన్నీ పక్కనపెట్టి ఓయూలో కనీస ప్రజాస్వామ్య విలువలకు అవకాశం లేకుండా ధర్నాలు చేయొద్దు, ప్రదర్శనలు చేయొద్దు, వినతిపత్రాలు ఇవ్వొద్దు, నిరసనలు తెలపొద్దని సర్క్యులర్ ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా? ఆటవిక రాజ్యంలో ఉన్నామా? సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉన్నదని తెలిపారు. ఇది వీసీకి సంబంధించిన విషయం, తమకు సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పించుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సర్క్యులర్‌ను తక్షణమే విరమించుకోవాలని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం మరింత విస్తరిస్తుందనీ, ఉధృతమవుతుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ వ్యవహారంలో రెండు వారాల్లో

కౌంటర్ దాఖలు చేయండి

- గవర్నర్ ఆఫీస్, రాష్ట్ర ప్రభుత్వం, ప్రతివాదులకు సుప్రీం ఆదేశం
- ఎమ్మెల్సీల కేసులో ఏప్రిల్ 24న తుది వాదనలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఎన్నిక వ్యవహారంలో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని గవర్నర్ ఆఫీస్, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర ప్రతివాదులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేయగా... ఆ ఇద్దరి పేర్లను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. దీంతో వారిద్దరూ వేర్వేరుగా హైకోర్టులో సవాల్ చేశారు. ఇదిలా ఉండగానే రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్... గతేడాది జనవరి 13న కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సిఫారసు చేయడం, గవర్నర్ ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. అయితే, హైకోర్టులో కేసు విచారణ దశలో ఉండగా తమ కోటాలో మరో ఇద్దరిని ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని దాసోజు, సత్యనారాయణ మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం... దాసోజు, సత్యనారాయణల నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు గతేడాది మార్చి 17న తీర్పులో స్పష్టం చేసింది. అలాగే, కాంగ్రెస్ సర్కార్ గెజిట్ నోటిఫికేషన్‌నూ రద్దు చేసింది.

ఆ తర్వాత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ల పేర్లను మరోసారి ప్రభుత్వం సిఫారసు చేయగా గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో గతేడాది ఆగస్టు 4న తమకు న్యాయం చేయాలని కోరుతూ దాసోజు, సత్యనారాయణ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ దాసోజు శ్రవణ్ ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారని తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ అడ్వొకేట్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఆయన ఇంకా ఎమ్మెల్సీగా ప్రమాణం చేయలేదని శ్రవణ్ తరపు అడ్వకేట్ బదులిచ్చారు. అయినా.. ఇది గవర్నర్ అధికారాలకు సంబంధించిన కేసు అని వాదనలు వినిపించారు. ఇందులో మరో పిటిషనర్ కుర్రా సత్యనారాయణ కూడా ఉన్నారని గుర్తు చేశారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం... గవర్నర్ ఆఫీసు, తెలంగాణ ప్రభుత్వం, ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలిఖాన్‌లు రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్ దాఖలుకు గడువును పొడిగించేది లేదని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 24న చేపడతామని పేర్కొంది.

'సీతారామ'కు నిధులేవి..?

ఎత్తిపోతల పథకంపై చిన్నచూపేలా..

ఇలా అయితే ఎప్పటిలోగా పూర్తి చేస్తారు..

బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, నున్నా



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క రూ.3.04 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా వాటిలో ఎంత మొత్తం ఖర్చు చేస్తారనేది సందేహాస్పదంగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు. గతంలో రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా దానిలో ఖర్చు చేసింది రూ.2.38 లక్షల కోట్లు మాత్రమేనని తెలిపారు. ప్రస్తుత తరుణంలో ఆదాయం వచ్చే పరిస్థితులు కూడా తగ్గాయన్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకొని బడ్జెట్ ప్రవేశపెట్టారా? లేదా? అనే స్పష్టత లేకున్నా.. ఖమ్మం జిల్లా మంత్రి ఆర్థికశాఖ మంత్రిగా ఉండి కూడా బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ.643 కోట్లు కేటాయించటం అంటే.. ముగ్గురు మంత్రులు ఏమి ఆలోచిస్తున్నట్టు అని ప్రశ్నించారు. ఇలా బడ్జెట్ కేటాయించి ఎన్నేండ్లపాటు ఈ ఎత్తిపోతల పథకాన్ని కడతారని అన్నారు.

సీపీఐ(ఎం) పోరాటాలతోనే 'సీతారామ'

సీతారామ ప్రాజెక్టు దయాదాక్షిణ్యాలతో కాదు.. పోరాటాలతో సాధించుకున్న ప్రాజెక్టు అని పోతినేని సుదర్శన్ అన్నారు. 2002లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పాదయాత్ర నిర్వహించామన్నారు. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వద్ద సీపీఐ(ఎం) తరఫున గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు పట్టుబడితే దుమ్ముగూడెం పేరుతో 2005 డిసెంబర్ 31న శంకుస్థాపన చేశారన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రోద్బలంతో దుమ్ముగూడెన్ని రాజీవ్, ఇందిరాసాగర్ పేరుతో రెండు భాగాలు చేశారని చెప్పారు. బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయకపోవడంతో ఖమ్మం నుంచి హైదరాబాద్ పాదయాత్ర మొదలు పెట్టామని, నకిరేకల్ వెళ్లేటప్పటికీ రూ.2వేల కోట్ల అంచనాతో కూడిన ప్రాజెక్టుకు వెంటనే రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్టు నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి కబురు చేయడంతో పాదయాత్ర నిలిపివేశామన్నారు. ఆ నాటి పాదయాత్రలో నాడు టీడీపీ జిల్లా అధ్యక్షునిగా ఉన్న నేటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పాల్గొన్నారని గుర్తుచేశారు. అయితే 2007 నుంచి 2012 దాకా తగిన నిధులు కేటాయించలేదన్నారు. 2012లో తన నాయకత్వంలో మళ్లీ పాదయాత్ర చేపట్టామన్నారు. విభజన అనంతరం 2016 ఫిబ్రవరిలో రూ.7,900 కోట్ల అంచనాతో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారని, 2018 నాటికి రూ.13వేల కోట్లకు అంచనా వ్యయం పెరిగిందన్నారు. అయినా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి విషయంలో నిర్లక్ష్యం వహించారని అన్నారు. 2023కు వచ్చేనాటికి రూ.18వేల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు రూ.19,800 కోట్లకు పెంచుకుంటూ వచ్చారన్నారు. గతేడాది మోటార్ల ద్వారా నీళ్లిచ్చి ప్రాజెక్టు ప్రారంభించినట్టు ప్రచారం చేసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం రూ.443 కోట్లు ఎత్తిపోతలకు, రూ.53 కోట్లు డిస్ట్రిబ్యూటరీలకు కేటాయించారని అన్నారు. 72 పేజీల బడ్జెట్‌లో నీటిపారుదలకు కేటాయించిన నాలుగు పేజీల్లో సీతారామ ప్రాజెక్టు ఊసే లేదన్నారు. ఎండిపోయే భూములు భట్టి విక్రమార్క నియోజకవర్గంలోనే ఉన్నాయన్నారు.

రూ.19వేల కోట్ల అంచనా వ్యయంలో కేవలం రూ.8వేలు కోట్లు ఖర్చు పెడితే ఇంకా రూ.11,800 కోట్లు ఎప్పుడు వెచ్చిస్తారని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుకు తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం చేపట్టక తప్పని చర్యలను ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. ఈ బడ్జెట్ చర్చల్లో వచ్చే అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయదారులకు అన్యాయం చేసేలా ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

జమ్మి ఆకులతో విస్తర...



బడ్జెట్.. పద్దు.. కేటాయింపులు.. నిధులు.. గ్రాంట్లు... గత కొద్ది రోజుల నుంచి పత్రికల్లో నానిన పదాలివి. ఆ రోజు రానే వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న విత్తమంత్రి బుధవారం శాసనసభలో పద్దును ప్రవేశపెట్టారు. దీనిపై ఓ ఆర్థిక నిపుణుడిని అభిప్రాయం అడగ్గా... 'నాకు రొట్టే లేదు గానీ, ఉంటే నెయ్యిలో అద్దుకు తినేవాణ్ని...' అన్నట్టుగా ఉందని సెటైరు వేశారు. నిజమే మరి... సంక్షేమానికి రికార్డు స్థాయిలో రూ.1.04 లక్షల కోట్లు కేటాయించాం, ఆరు గ్యారెంటీల అమలుకు రూ.56 వేల కోట్లను ప్రతిపాదించామంటూ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. కానీ ఆ రూకలు ఎక్కడి నుంచి వస్తాయనే దానికి మాత్రం బడ్జెట్ పత్రాల్లో సమాధానమే లేదు. వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సాయం కింద రూ.12 వేలు, ప్రతీ మహిళకు ఆర్థిక చేయూత కింద రూ.2,500, డిగ్రీ, ఆ పైన చదువుకునే అమ్మాయిలకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం తదితరాంశాల ఊసే పద్దులో కనబడకపోవటం గమనార్హం. 'ఎవరూ నమ్మట్లేదు.. అప్పులివ్వట్లేదు...' అంటూ గురువారం సీఎం రేవంత్, బహుశా గత ప్రభుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ హామీలు, వాగ్దానాల అమలెలా అని జనం జుట్టు పీక్కుంటున్నారు.

> దళితులను అభివృద్ధి పరుస్తామంటూ చెప్పిన సర్కార్...వారికి సంబంధించిన కేటాయింపులకు మసిపూసి మారేడుకాయ చేసింది. ఆయా తరగతులకు మొత్తం రూ.40 వేల కోట్లు కేటాయించినట్టు బడ్జెట్‌లో చూపారు. వాస్తవానికి ఇందులో గతేడాది ఖర్చు పెట్టకుండా వదిలేసి, ఈసారి క్యారీ ఫార్వర్డ్ చేసినవే రూ.13 వేల కోట్లున్నాయి. అంటే ఎస్సీలకు నికరంగా కేటాయించింది రూ.27 వేలకోట్లే నన్నమాట. గత గులాబీ సర్కార్ కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పేర్లతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసుకుని, దండిగా అప్పులు తెచ్చుకుంది. హస్తం పార్టీ సైతం దానికి మినహాయింపేమీ కాదు.

గతేడాది 2.91 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సర్కారు.. ఈసారి అదనంగా రూ.13 వేల కోట్లు కలిపి రూ.3.04 లక్షల కోట్లతో పద్దును ప్రతిపాదించింది. ఆ మేరకు రాబడి పెరుగుతుందా? లేదా? అనేది శేష ప్రశ్నే. మరోవైపు మానవాభివృద్ధి సూచికల్లో విద్య, వైద్య రంగాలు కీలక పాత్ర పోషిస్తాయనేది అందరూ చెప్పే మాటే. ఈ రెండు రంగాలకు హస్తం పార్టీ ఈసారి రిక్తహస్తాన్నే మిగిల్చింది. గతేడాది విద్యా రంగానికి రూ.21 వేల కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.రెండు వేల కోట్లను అదనంగా పెంచారు. మొత్తంగా చూసినప్పుడు విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కేటాయింపులు 8 శాతం దాటడం లేదు. జాతీయ సగటును పరిశీలించినప్పుడు ఈ రంగానికి 14.5 శాతం నిధులను కేటాయిస్తున్నారు. అంటే తెలంగాణ ఈ విషయంలో ఇంకా ఆరు శాతం వెనుకబడే ఉందన్నమాట. ఇక వైద్య రంగానికి గతేడాది రూ.11 వేల కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.12 వేల కోట్లను ప్రతిపాదించారు. పెంచిన ఈ వెయ్యి కోట్లతో 'ఆరోగ్య తెలంగాణ' సాధ్యమా?

దళితులను అభివృద్ధి పరుస్తామంటూ చెప్పిన సర్కార్... వారికి సంబంధించిన కేటాయింపులకు మసిపూసి మారేడుకాయ చేసింది. ఆయా తరగతులకు మొత్తం రూ.40 వేల కోట్లు కేటాయించినట్టు బడ్జెట్‌లో చూపారు. వాస్తవానికి ఇందులో గతేడాది ఖర్చు పెట్టకుండా వదిలేసి, ఈసారి క్యారీ ఫార్వర్డ్ చేసినవే రూ.13 వేల కోట్లున్నాయి. అంటే ఎస్సీలకు నికరంగా కేటాయించింది రూ.27 వేల కోట్లేనన్నమాట. గత గులాబీ సర్కార్ కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పేర్లతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసుకుని, దండిగా అప్పులు తెచ్చుకుంది. హస్తం పార్టీ సైతం దానికి మినహాయింపేమీ కాదు. ఆయా కార్పొరేషన్లకు పెట్టుబడి పెడుతున్నామంటూ సర్కారు వారు చంకలు గుద్దుకున్నా... వాటిని తిరిగి చెల్లించాల్సింది అదే సర్కారు అనే విషయాన్ని విస్మరించరాదు.

ఏతావాతా చూసినప్పుడు రూ.3.04 లక్షల కోట్లతో పద్దు బ్రహ్మాండంగా ఉన్నా... దానికి కావాల్సిన సూటూ బూటూ ఎక్కడి నుంచి తెస్తారనే ప్రశ్నకు సర్కారు వద్ద సమాధానమే లేదు. అయితే మద్యాన్ని విపరీతంగా తాగించటం, లేదంటే ఇసుక విక్రయాలు, భూముల అమ్మకాల మీద ఆధారపడటమే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ఏకైక మార్గంగా కనబడుతోంది. కొత్త సీసాలో పాత సారాలాగా గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసింది అదే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదీ అదే. అలాంటప్పుడు ప్రజల జీవన ప్రమాణాల్లో, అభివృద్ధిలో మార్పెలా సాధ్యం...? కేంద్రం నుంచి గ్రాంట్లు, ఆర్థిక సాయాలు రావటం లేదు మొర్రో...' అని ఒకవైపు దీనంగా మాట్లాడుతూనే... హస్తిన నుంచి వచ్చే డబ్బుల కోసం ఎదురు చూడటం ఎంతవరకు సమంజసం? సమాఖ్య స్ఫూర్తిని కొనసాగిస్తామని తాటాకు చప్పుళ్లు చేస్తే ఏం ప్రయోజనం? ఆ స్ఫూర్తిని ధ్వంసం చేస్తున్న కేంద్రంపై పోరాడకపోతే ఏం ప్రయోజనం?

ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) చెప్పినట్టు బడ్జెట్‌ను పున:సమీక్ష చేయాల్సిన అవసరముంది. విద్యా, వైద్య రంగాలకు, సంక్షేమానికి అధిక నిధులు కేటాయించటం ద్వారా రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేయాలి. అంతేతప్ప 'జమ్మి ఆకులతో విస్తరాకు'ను తయారు చేస్తే, దాంట్లో ఒక్క మెతుకు కూడా నిలవదనే సత్యాన్ని ప్రభుత్వం గుర్తించాలి. నేల విడిచి సాము చేయటం కాకుండా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, ఆదాయ, వ్యయాలను లెక్కలేసుకుని బడ్జెట్‌ను సవరించాలి.


సూర్యచంద్రుల సాక్షిగా
నా భారతావనిపై
ఇక్కడే ఈక్షణమే
రాజ్యమేలుతున్న
రాక్షసత్వం
మహారాష్ట్ర బీడ్ జిల్లా గ్రామం
సర్పంచ్‌పై ఇనుపరాడ్‌లతో దాడి
చివరిశ్వాస విడిచే జీవశ్ఛవంపై
మూత్రవిసర్జన..
వీడియో కన్నవారికి
విషయం విన్నవారికి
కడుపులో దేవిన ఏవగింపు..
ఇదికదా
మన ప్రజాస్వామ్యాన్ని
శాసించే నేర భారతం?

దిక్కెవరు?

నిందితుడు
రాష్ట్ర మంత్రి కుడిభుజం
మూడ్నెల్లనంతరం
బయల్పడిన వైనం
రౌడీరాక్షసులు
షాడోపాలకులుగా
రాజ్యమేలుతున్నకాలం
అడ్డొస్తే గ్రామసర్పంచ్‌కు
పట్టినగతే ఎవరికైనా...
అప్పులు-కూలి-పేదరికం
విషవలయంలో నలుగుతున్న
నయా బానిసత్వం
అవునన్నా కాదన్నా
అదో కటిక చీకటిలోకం
ఇది యాదృశ్చికం కాదట!
సహజ పరిణామమేనట!
అధికార కులమతనాగులు
చిమ్ముతున్న అహంకార విషం
చట్టం-న్యాయం-ధర్మం ఇక్కడ
చేష్టలూడిన మూడుకోతులు
ఈ అంతంలేని
నేర భారతంలో
రక్తాశ్రువులు చిందించే
ఆ కూలి జీవులకు
ఇప్పుడు దిక్కెవరు?

- కె.శాంతారావు,
9959745723

దుఃఖానికి చికిత్స చేసిన బైషజ్య గురువు


డాక్టర్ దేవరాజు మహారాజు

తృప్తి అనేది తెలియని వాళ్లకు స్వర్గతుల్య రాజభవనంలో ఉన్నప్పటికీ తృప్తి ఉండదు. తృప్తి అనేది తెలియని వాళ్లు, ధనవంతులైనా పేదవాళ్లే! ఆది తెలిసిన వాళ్లు పేదవాళ్లయినప్పటికీ ధనవంతులే అని చెపుతుంది బౌద్ధ ధమ్మం. ఇది వైదిక మతానికీ, బౌద్ధ ధమ్మానికీ ఉన్న తేడాను కూడా చెప్పినట్లుగా ఉంది. బౌద్ధ జైన ధర్మాలను అతి క్రూరంగా నాశనం చేసినప్పటికీ, ఈ దేశంలో బ్రాహ్మణిజానికి ఇంకా తృప్తి లేదు.నాశనమవుతూ వచ్చిన ధర్మాలు మాత్రం ప్రశాంతంగా సంతృప్తిగానే ఉన్నాయి.

భారతదేశంలోని శిల్పకళ, చిత్రలేఖనం బౌద్ధులనుండి అందుకున్న వారసత్వమేనని చరిత్ర పరి శోధకులు నిర్ధారించారు. చిత్రలేఖనం, శిల్పకళలతో పాటు విజ్ఞానశాస్త్రంలోనూ, ఇతర సాంస్కృతిక రంగాల్లో బౌద్ధులు చేసిన కృషికి ఆసియా దేశాలన్నీ రుణపడి ఉంటాయి. ప్రాచీన వైద్యశాస్త్రం అత్యున్నత దశ అంతా బౌద్ధులు సాధించిందే - అశోక చక్రవర్తి, తర్వాత వచ్చిన ఇతర బౌద్ధ చక్రవర్తులు స్థాపించిన వైద్య శాలల్లోనే చికిత్సా విధానాలు అభివృద్ధి చెందాయి. నాటి ప్రముఖ వైద్యశాస్త్ర గ్రంథం- 'చరక సం హిత' రచించిన చరకుడు బౌద్ధుడు. ఆయన బౌద్ధ చక్రవర్తి కనిష్కుడి ఆస్థాన వైద్యుడు. ఆచార్య నాగా ర్జునుడు ఆయుర్వేద వైద్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన వాడు. ఆయనా బౌద్ధుడే కదా? ఆయుర్వేద వైద్య విద్యార్థులకు ఈ నాటికీ అత్యంత విలువైన పాఠ్య గ్రంథం-బౌద్ధ భిక్షువైన వాగ్భాటుడు రాసిందే! బౌద్ధు డైన దిజ్ఞాగుడు- అతని శిష్యుడు ధర్మకీర్తి భారతీయ తర్కశాస్త్రానికి రూపురేఖలు దిద్ది, దాన్ని ఒక కొత్త మలుపు తిప్పిన వారు.

బౌద్ధులైన వరరుచి, జయాదిత్య, వామన, చంద్ర మొదలైన వారంతా వ్యాకరణ శాస్త్రంలో ఉద్దండులు. ఇన్నీ శాస్త్రాలు, కళలూ ఇక్కడ ఈ దేశంలో ఎలా అభివృద్ధి చెందాయీ అంటే, మన భారత దేశంలో ఏడెనిమిది వందల సంవత్సరాల పాటు, బౌద్ధ విశ్వవిద్యాలయాలు ప్రపంచానికి జ్ఞానాన్ని అం దించాయి. ఆ దశలో ఎన్నో కళలు, ఎన్నో శాస్త్రాలు ఇక్కడ వెల్లివిరిశాయి. ఆ రకంగా ఈ దేశం 'విశ్వ గురువు' ఎప్పుడో అయిపోయింది. ఆ స్థాయిని అలా నిలుపుకోలేక, దాన్ని ధ్వంసం చేసుకుంటూ వస్తున్నామన్న సంగతి గుర్తుంచుకోవాలి! ఎలా ధ్వంసమవుతూ వచ్చిందో తెలుసుకుంటూ ఉండాలి. పునరు ద్ధరించుకునే పనిలో నిరంతరం మనం, నిమగ్నమవుతూ ఉండాలి కూడా!

> ఇప్పుడు తక్షణమే చేపట్టాల్సిన కర్తవ్యం ఏమిటంటే- మనిషే కేంద్రంగా ఈ సమా జాన్ని పునర్నిర్మించుకోవాల్సి ఉంది.అందుకు మొట్టమొదట అన్ని మతాలకు చెందిన దైవ సంబంధిత పండుగలు, ఉత్సవాలు, ఆచారాలు, సంప్రదాయాలు రద్దుచేసుకుంటే మార్పు త్వరగా వస్తుంది. కులం, మతం లేకుండా కేవలం మనుషులుగా బతకాలనుకునే వారికి తగిన స్వేచ్ఛనివ్వాలి. అన్ని మతాల్ని, అన్ని మత గ్రంథాల్ని మ్యూజియంలలో భద్రపరచాలి. ఎదగని మానవ మేధస్సుకు ప్రతీకలుగా అవి అక్కడే ఉండాలి. సమకాలీన జీవితంపై వాటి ప్రభావం పడకుండా చూసుకోవాలి.మానవత్వం గురించి, సేవా భావం గురించి, మనిషి సాధించిన, సాధిస్తూ ఉన్న వైజ్ఞానిక ప్రగతి గురించి మాత్రమే వచ్చే తరాలకు చెప్పాలి. ఈ పని ఎంత త్వరగా జరిగితే అంత మంచిది!

ఇక వైద్యశాస్త్రం, చికిత్సా విధానానికి సంబంధించిన విషయాలు చెప్పుకోవాలంటే, మొదట బుద్ధుడి గురించే చెప్పుకోవాలి. ఆయన ప్రకృతి ప్రేమికుడు, పరిశీలకుడు గనక, చెట్ల గురించీ, వన మూలికల గురించీ కొంత అవగాహన పెంచుకున్నాడు. ఆయన కాలానికి అందుబాటులో ఉన్న వైద్యం తోనూ, చికిత్సా విధానాలతోనూ ఆయనకు పరిచయం ఏర్పడింది. బుద్ధుడు అనారోగ్యంతో ఉన్న ఒక వృద్ధ భిక్షువుకు సపర్యలు చేసి, స్నానం చేయించి స్వస్తత చేకూర్చాడని బౌద్ధ సాహిత్యం తెలియజేస్తూ ఉంది. ఆ వృద్ధ భిక్షువు విరేచనాలతో బాధపడుతూ, మల మూత్రాలలో నిస్సహాయంగా పడి ఉన్నప్పుడు బుద్ధుడు స్వయంగా అతనికి సేవలు చేశాడు. ఆ ఒక్కడికే కాదు, ఆ విధంగా ఎందరికో బైషజ్య గురు వుగా మారాడు. బైషజ్య



గురువు అంటే వైద్యుడని అర్థం! ఆయన ఇతరులకు వైద్యసేవలు అందిస్తున్న పుడు, శిష్యులు ఆయన్ను జాగ్రత్తగా గమనించే వారు. బుద్ధుణ్ణి ఆదర్శంగా తీసుకుని, ఆయన శిష్యులు కూడా ప్రజలకు వైద్య సేవలందించడం ప్రారంభించారు. రోగాలతో ఉన్నవారికి సేవలు అందించిన శిష్యులను బుద్ధుడు మెచ్చుకునేవాడు. పైగా, ప్రజలకు చేసిన సేవలన్నీ తనకు చేసినట్లే - భావిస్తానని చెప్పేవాడు. ఆ రకంగా శిష్యులందరూ ఉత్సాహంగా పని చేస్తుండేవారు.

"శరీరానికి మరణం ఒక్కసారే వస్తుంది. మనసుకు మాత్రం తప్పుచేసిన ప్రతిసారీ మరణం సంభవిస్తుంది-" అని చెప్పేవాడు బుద్ధుడు. సాటి మనిషి అనారోగ్యంతో విలవిలలాడుతున్నప్పుడు పట్టించుకోకుండా ఉండడమంటే - తప్పు చేస్తున్నట్టే కదా? తప్పుచేస్తూ నిత్యం మరణించడమెందుకూ? - అన్న భావాన్ని బుద్ధుడు తన శిష్యుల్లో కలిగించగలిగాడు.

బుద్ధుడు శ్రావస్థిలో అనాథపిండకుని జెతవన ఆరామంలో ఉన్నప్పుడు శరత్ అనే భిక్షువు జబ్బు పడితే, బుద్ధుడు స్వయంగా సేవచేశాడు. ఆ భిక్షువు ఏది తిన్నా వాంతి చేసుకునేవాడు. జావ కాచి ఇచ్చినా, అది కూడా వాంతి అయిపోయేది. భిక్షువు నీరసపడి పోయి, సన్నగా, పీలగా తయారైనప్పుడు- బుద్ధుడు తనకు తెలిసిన పరిజ్ఞానంతో మూలికల కషాయం తయారు చేసి మెల్లె మెల్లగా తాగించాడు. అది మంచి ఫలితం ఇచ్చింది. దాంతో వాంతులు తగ్గాయి. క్రమంగా ఆరోగ్యం పుంజుకున్నాడు. బతుకు తాడా లేదా అని అనుకున్నవాడు, బుద్ధుడి చికిత్స సేవలతో బతికి బయటపడ్డాడు. శిష్యగణమంతా అబ్బురపడి ఉత్సాహభరితులయ్యారు. ప్రకృతి పరిశీలనలో లోతైన అవగాహన పెంచుకున్న బుద్ధుడు, స్వీయ అనుభవాలతో మూలికల పరిజ్ఞానం సంపాదించాడు. అదే తన శిష్యులకు అందించాడు. ఆనాటి బౌద్ధ విహారాలకు సామాన్యజనం వచ్చి, వైద్య సేవలు అందుకునే వారు.

బైషజ్య గురువు (వైద్యుడు) అయిన బుద్ధుడి ప్రభావంతో తర్వాత కాలంలో అశోక చక్రవర్తి కూడా వైద్యశాలలు కట్టించాడు. కేవలం మనుషులకే కాకుండా పశువులకు కూడా వేరుగా పశు చికిత్సాలయాలు కట్టించాడు. మనుషులకు, పశువులకు వేరు వేరు వైద్యులు, వేర్వేరు వైద్యశాలలు అప్పటి నుండే దేశంలో ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయాలు, వైద్యశాలలు- చికిత్సాలయాలు బౌద్ధస్ఫూర్తితో ప్రపం చవ్యాప్తంగా ప్రారంభించబడ్డాయి. కాలం గడుస్తున్న కొద్దీ అవసరాన్ని బట్టి, విస్తరించబడ్డాయి కూడా!

ప్రపంచంలో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు లేని కాలంలో ఈ దేశంలో అనేక బౌద్ధ విశ్వ విద్యాలయాలు వెల్లివిరిశాయి. ప్రపంచానికి జ్ఞానాన్నందించాయి. ఆరకంగా ఈదేశం బౌద్ధుల కాలంలోనే 'విశ్వ గురువు అయిపోయింది. ఆ విశ్వవిద్యాలయాల స్థాయి ఎలా ఉండేదన్న దానికి ఆ మధ్య లభ్యమైన ఒక తాళపత్ర గ్రంథం ఆధారాలు చూపింది. 1881లో తక్షశిలకు 70 మైళ్ల దూరంలో ఒక విలువైన తాళపత్ర గ్రంథం దొరికింది. అది 1700 నాటి అతి పురాతన గ్రంథం. దానిలో 70 పత్రాలు (అంటే 70పేజీలు) ఉన్నాయి. అది 'గాత' భాషలో ఉన్న 'బక్షాలి మాన్యుస్క్రిప్ట్'గా గుర్తించారు. గోత భాష అంటే, ఒకప్పటి ప్రాకృత భాషకు మారురూపం. ఈ తాళపత్ర గ్రంథం మూడవ శతాబ్దం నాటిదని చెపు తున్నారు. ఇందులో అంక గణిత, బీజగణిత, రేఖాగణితాలకు సంబంధించి కొన్ని ప్రాథమిక, ప్రామాణిక సూత్రీకరణలు ఉన్నాయి. కూడికలు, తీసివేతలు, గుణితం, భాగహారం మాత్రమే కాదు, సాధారణ ఈక్వే షన్లు- ఇంకా సంక్లిష్టమైన రేషనల్ ఎప్రాక్సిమేషన్, స్క్వేర్ రూట్‌కు సంబంధించిన సమాచారం, సమ్మిషన్ ఆఫ్ కాంప్లెక్స్ సీరిస్, సైమల్ టేనియస్ లీనియర్ ఈక్వేషన్స్-వగైరా ఉన్నాయని గణిత శాస్త్ర నిపుణులు ధృవీకరించారు. మూడవ శతాబ్దంలోనే మన బౌద్ధ విశ్వవిద్యాలయాల్లో ఏస్థాయి విద్య అందుబాటులో ఉండేదో చెప్పడానికి దీన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు-

దేవుడు, భక్తి, ఆధ్యాత్మికత, హిందుత్వ పేర్లతో దేశ గౌరవాన్ని పెంచుతున్నామని ప్రగల్భాలు పలికే మూర్ఖ శిఖామణులకు ఈ దేశ ఔన్నత్యమే తెలియదు. తెలుసుకునే ప్రయత్నమే చేయరు. ఎంత సేపటికి పురాణాల్లోని కట్టు కథలు వల్లె వేయడం తప్ప, ప్రాచీన విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం గురించి గానీ, గ్రంథాల గురించి గానీ తెలియదు. "మార్స్ మీద వినాయకుడి విగ్రహం ఉంది"- లాంటి అబద్ధాల ప్రచారం మాత్రం చేస్తూ ఉంటారు. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ చంద్రుడి మీద కాలుమోపగానే, అక్కడికి హిందూ అర్చకుడు ఎదురుగా వచ్చి, అక్కడ ఉన్న హిందూ దేవాలయం గూర్చి చెప్పాడు- వంటి అభూత కల్పనలు వండి వార్చుతూ ఉంటారు. సమాజంలో నవ్వుల పాలు అవుతున్నామన్న స్పృహ కూడా ఈ భక్తులకు ఉండదు.


> దేవుడు, భక్తి, ఆధ్యాత్మికత, హిందుత్వ పేర్లతో దేశ గౌరవాన్ని పెంచుతున్నామని ప్రగల్భాలు పలికే మూర్ఖ శిఖామణులకు ఈ దేశ ఔన్నత్యమే తెలియదు. తెలుసుకునే ప్రయత్నమే చేయరు. ఎంత సేపటికి పురాణాల్లోని కట్టు కథలు వల్లె వేయడం తప్ప, ప్రాచీన విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం గురించి గానీ, గ్రంథాల గురించి గానీ తెలియదు. "మార్స్ మీద వినాయకుడి విగ్రహం ఉంది"- లాంటి అబద్ధాల ప్రచారం మాత్రం చేస్తూ ఉంటారు. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి మీద కాలుమోపగానే, అక్కడికి హిందూ అర్చకుడు ఎదురుగా వచ్చి, అక్కడ ఉన్న హిందూ దేవాలయం గూర్చి చెప్పాడు- వంటి అభూత కల్పనలు వండి వార్చుతూ ఉంటారు. సమాజంలో నవ్వుల పాలు అవుతున్నామన్న స్పృహ కూడా ఈ భక్తులకు ఉండదు.

ఈ ప్రపంచంలో మొదటిసారి జ్ఞానోదయమైంది ఒక్క బుద్ధుడికే. అదీ సాధారణ శకానికి ముందు - ఇది వాస్తవం! కల్పించిన అభూత కల్పన కాదు. బుద్ధుడు అడవిలో ప్రశాంతంగా కూర్చుని సమాజం గురించి తపనపడ్డాడు. తీవ్రంగా ఆలోచించాడు తప్పితే ఏ దేవాలయానికీ వెళ్లలేదు. అసలు దేవుడున్నాడని, ఆయన అంగీకరించనే లేదు - స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్య రుషులు చేసిన తపస్సు వేరు. వారు సాధించారన్న శక్తులతో మానవ వినాశనమే జరిగింది తప్ప, ప్రపంచ మానవాళికి మేలు జరగలేదు. ఇంతెందుకూ? మనచుట్టూ ఉన్న దైవ విశ్వాసకుల్ని గమనించండి. వారు ప్రకృతి విలువ తెలుసుకోరు. చిరుగాలి, లేత ఎండ, ఆత్మీయత, అనురాగం, కళ్లమెరుపూ వారికి అర్థం కాదు. మనిషైన వాడికి, తన మీద తనకు విశ్వాసం ఉన్నవాడికి మాత్రమే సృజనాత్మకత అంటే ఏమిటో తెలుస్తుంది. కవిత్వం అనుభవించాలన్నా, కళల్ని అనుభూతించాలన్నా, సైన్సును అందుకోవాలన్నావాడు మనిషై ఉండాలి. వాడిలో బుద్ధుడు చెప్పిన జాలి, కరుణ, ప్రేమ, నీతి, నిజాయితీ లాంటి లక్షణాలుండాలి. అప్పుడే వాడు మనిషైతాడు. తను మనిషినని గాఢంగా నమ్మినవాడే నూతన సృష్టిచేయగలడు. శోధించగలడు. సాధించగలడు. ఎక్కడో ఏదో శక్తి ఉందని, అది తనను చూస్తూ ఉందనీ భ్రమిస్తూ కళ్లు తేలేసే వాడికి ఇవన్నీ ఉండవు. ఇవన్నీ అందవు.

బౌద్ధంలో నుంచే శిల్పకళ, చిత్రలేఖనం, వైద్యశాస్త్రం,తర్కశాస్త్రం, వ్యాకరణ శాస్త్రం, భాషా శాస్త్రం ఇంకా ఇతర విజ్ఞాన శాస్త్రాలు ప్రారంభం కావడానికీ, ఉచ్ఛ స్థాయికి చేరుకోవడానికి ముఖ్య కారణం- మనిషి రుజువర్తనం, నైతిక జీవనం, హృదయ వైశాల్యం కారణాలు! ఇవి లోపించడం వల్లనే, మనిషి మనిషిగా ప్రవర్తించలేకపోతున్నాడు. యుద్ధోన్మాదం ఒకవైపు, నైతిక పతనం మరో వైపు ప్రపం చాన్ని కుదిపేస్తున్నాయి.ఇప్పుడు తక్షణమే చేపట్టాల్సిన కర్తవ్యం ఏమిటంటే- మనిషే కేంద్రంగా ఈ సమా జాన్ని పునర్నిర్మించుకోవాల్సి ఉంది.అందుకు మొట్టమొదట అన్ని మతాలకు చెందిన దైవ సంబంధిత పండుగలు, ఉత్సవాలు, ఆచారాలు, సంప్రదాయాలు రద్దుచేసుకుంటే మార్పు త్వరగా వస్తుంది. కులం, మతం లేకుండా కేవలం మనుషులుగా బతకాలనుకునే వారికి తగిన స్వేచ్ఛనివ్వాలి. అన్ని మతాల్ని, అన్ని మత గ్రంథాల్ని మ్యూజియంలలో భద్రపరచాలి. ఎదగని మానవ మేధస్సుకు ప్రతీకలుగా అవి అక్కడే ఉండాలి. సమకాలీన జీవితంపై వాటి ప్రభావం పడకుండా చూసుకోవాలి.మానవత్వం గురించి, సేవా భావం గురించి, మనిషి సాధించిన, సాధిస్తూ ఉన్న వైజ్ఞానిక ప్రగతి గురించి మాత్రమే వచ్చే తరాలకు చెప్పాలి. ఈ పని ఎంత త్వరగా జరిగితే అంత మంచిది!

వ్యాసకర్త: త్రిపురనేని రామస్వామి
జాతీయ పురస్కార తొలి గ్రహీత

భద్రతలేని 'అసంఘటిత' బతుకులు


వంగూరు రాములు
9490098247

దేశం మొత్తం కార్మికుల్లో 93శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. స్థూల జాతీయోత్పత్తిలో అరవై శాతం వాటా వీరిదే అయినా కార్మిక చట్టాల పరిధిలో లేరు. పనిగంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు అంతకన్నా కనబడవు. ఉద్యోగ భద్రత కూడా మృగ్యమే. 1991 నుండి సరళీకరణ ఆర్థిక విధానాలు మొదలైన తర్వాత వ్యవసాయ రంగం సంక్షోభంలో పడటం, చేతివృత్తులు దెబ్బతినటం, ఫలితంగా అసంఘటిత కార్మికుల సంఖ్య వేగంగా పెరిగింది. అదే సమయంలో అన్ని రంగాల్లో రెగ్యులర్, పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గుతున్నది. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు పని గంటలు వంటి సర్వీస్ కండీషన్స్ రూపొందిం చడంతో పాటు అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్ ఉద్యమం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా 2008లో సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించింది. దీనిలో కార్మికుల వాటా ఎంత? యజమాని వాటా ఎంత?ఉండాలనే దాని నిర్ణయించకుండా రూల్స్ రూపొం దించకుండా చట్టం చేయడం మూలంగా అది చివరకు అసంఘటితరంగ కార్మికులను మోసం చేసేదని రుజువైంది. ప్రస్తుతం ఆ చట్టాన్ని రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్‌లో కలిపేసింది.

పథకాలున్నా...ప్రయోజనం సున్నా

అసంఘటిత కార్మికులకు పెన్షన్ పథకం, ప్రధానమంత్రి శ్రమయోగి మాన్ ధన్ పథకం (పిఎం-ఎస్‌వైఎం), ఈశ్రమ్ పోర్టల్, అసంఘటిత కార్మికులకు బీమా పథకాలు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పిఎంఎస్‌బివై) వంటి స్కీమ్‌లు అసంఘటితరంగ కార్మికుల ప్రయోజనాల కోసమే తెస్తున్నామని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఆ స్కీమ్‌ల వలన అసంఘటిత రంగ కార్మికులకు ఎలాంటి మేలు జరగలేదు. వాటిని కాగితాలకే పరిమితం చేసి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయ కుండా మోడీ ప్రభుత్వం మోసానికి పాల్పడింది. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసింది. కార్మికులకు గొడ్డలిపెట్టు వంటి నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికవర్గాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెట్టింది. రేపు లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం-1996, వలస కార్మికుల చట్టం-1979 రద్దవుతాయి. రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులు నిర్వీర్యమై ప్రస్తుతం కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలూ అందకుండా పోతాయి. గ్రూప్‌హౌస్‌ల పేరుతో సెస్సు వసూలు జరగకుండా యజమానుల ఇష్టారాజ్యంగా మారుతుంది. బోర్డు నిధులు దుర్వినియోగమవు తాయి, పని గంటలు పెరుగుతాయి. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్ రద్దయిపోతుంది. హిట్ అండ్ రన్ వంటి చట్టాలు అమల్లోకి వస్తాయి. పని పరిస్థితులు తీవ్రంగా దెబ్బతింటాయి. సామాజిక భద్రత ఉండదు. కార్మిక సంఘాలు ఏర్పాటు కూడా కష్టమవు తుంది. పోరాటం చేయలేని స్థితిని కల్పిస్తారు. బీడీ కార్మికుల వెల్ఫేర్ సెస్సు యాక్ట్ రద్దవడంతో ఉన్న కొద్దిపాటి సంక్షేమ పథకాలు కూడా నిలిపివేయబడ్డాయి. కనీస పెన్షన్, జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, మహిళా కార్మికులకు ప్రసూతి సౌకర్యాలు అందడం లేదు.

వెల్ఫేర్‌బోర్డుపై పాలకుల నిర్లక్ష్యం

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి మంది అసంఘటిత కార్మికులున్నారు. ప్రధానంగా భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, బీడీ, తోపుడుబండ్లు, షాప్ ఎంప్లాయీస్ తదితర రంగాల్లో పనిచేస్తున్నారు.ఉత్పత్తిలో వీరిది కీలక పాత్ర. కానీ, ప్రభుత్వాల నుంచి భద్రతగానీ, సంక్షేమ పథకాలుగానీ కల్పించడంలేదు. కుటుంబ పోషణ భారంగా మారి అనేక ఒడిదుడుకుల మధ్య జీవనం కొన సాగిస్తున్న పరిస్థితి. ఈ రంగంలో పనిచేస్తున్న వారందరికీ వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ వైపు సర్కార్ దృష్టి కొర వడింది. 2009 నుండి 11.5 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కార్డులు అధికారుల నిర్లక్ష్యంతో రెన్యువల్ కాక, వారికి



> రేపు లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం-1996, వలస కార్మికుల చట్టం-1979 రద్దవుతాయి. రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులు నిర్వీర్యమై ప్రస్తుతం కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలూ అందకుండా పోతాయి. గ్రూప్‌హౌస్‌ల పేరుతో సెస్సు వసూలు జరగకుండా యజమానుల ఇష్టారాజ్యంగా మారుతుంది. బోర్డు నిధులు దుర్వినియోగమవుతాయి, పని గంటలు పెరుగుతాయి. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్ రద్దయిపోతుంది. హిట్ అండ్ రన్ వంటి చట్టాలు అమల్లోకి వస్తాయి. పని పరిస్థితులు తీవ్రంగా దెబ్బతింటాయి. సామాజిక భద్రత ఉండదు. కార్మిక సంఘాలు ఏర్పాటు కూడా కష్టమవుతుంది. పోరాటం చేయలేని స్థితిని కల్పిస్తారు.

సంక్షేమ పథకాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి కార్డులను వెల్ఫేర్ బోర్డే స్వయంగా రెన్యువల్ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యల్లేవు. నిలిపివేయబడ్డ (అబయన్స్‌లో పెట్టిన) బీడీ కార్మికుల కనీస వేతనాల జీఓ నెం.41ని అమలు చేయాలి. అసం ఘటిత కార్మికులందరికీ పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ హక్కుల కల్పన కోసం దశాబ్దాలుగా పోరాడుతున్నా వీరి గోడు ప్రభుత్వాలకు పట్టడం లేదు. కార్మికులకు పని భద్రత, కనీస వేతనాలు, పని గంటలు, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి చట్ట బద్ధ హక్కులు కల్పించడంలో పాలకులు ఏండ్లుగా విఫలమ వుతూనే ఉన్నారు.అసంఘటిత కార్మికులకు సామా జిక భద్రత కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి అధికా రంలోకి వచ్చి పదిహేను నెలలు దాటినా నేటికీ అతీగతి లేదు. ఇప్పటికైనా సంక్షేమ పథకాల అమలు, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీని కార్మిక సంఘాల నాయకులతో నియమించాలి. తద్వారా బోర్డు నిధులు దుబారా చేయకుండా కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలి.

మేనిఫెస్టోను మరిచారా?

'ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం, మేమిచ్చిన ప్రతి మాటను అమలు చేస్తాం, మాది ప్రజా ప్రభుత్వం, మేము పాలకులం కాదు, సేవకులమని' చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయడం లేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రతి "ఆటో" డ్రైవర్‌కు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందజేస్తామని, ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సామాజిక భద్రత కలిస్తామని, ప్రతి పట్టణంలో ఆటోనగర్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోవడం లేదు. హమాలీలకు హెల్త్ కారులిస్తామని, ప్రతి మండల కేంద్రంలో హమాలీనగర్‌లను ఏర్పాటు చేసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పి మొండిచేయినే చూపిస్తున్నది. బీడీ కార్మికులకు 2014 పిఎఫ్ కటాఫ్ తేదీని తొలగించి చేయూత పెన్షన్ అందిస్తామని చెప్పినప్పటికీ బీడీ కార్మికులను జీవిత బీమా, ఈఎస్ఐ పరిధిలోకి తెస్తా మని, అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసామి, చిరు వ్యాపారులు ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణ సదుపాయం కల్పిస్తామన్న హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేరలేదు.

వలస కార్మికులకు రక్షణేది?

అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979ను అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర వైఫల్యం చెందాయి. ఈ చట్టం ప్రకారం వలస కార్మికుల పేర్లు నమోదు చేయాలి. సొంత గ్రామం నుండి పనిచేసే ప్రాంతానికి రానూపోను ప్రయాణ ఛార్జీలు ఇవ్వాలి. కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు, సమాన పనికి - సమాన వేతనం, పునరావాసం కల్పించాలి. పిల్లలకు మొబైల్ విద్యా, వైద్య సౌకర్యం కల్పించాలి. పని ప్రదేశంలో రక్షణ కల్పించాలని చట్టం చెబుతున్నా, ఆ చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఫలితంగా వలస కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారి అనేక ప్రమాదాలు జరిగి వారు దిక్కుతోచని స్థితిలో వలస కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం, పెంటవెల్లి గ్రామ సమీపంలో ఎస్-ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది వలస కార్మికులు టన్నెల్‌లో మట్టి దిమ్మలు కూలి, నీరు నిండి సజీవ సమాధయ్యారు. టన్నెల్ పని కాంట్రాక్ట్‌కు తీసుకున్న కంపెనీ రక్షణ చర్యలు తీసుకోకపోవడం, పని ప్రదేశంలోకి కార్మికులను పంపే ముందు జియోలాజికల్ సర్వే చేయకపోవడం వలన ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న పని తెలుసుకోకపోవడం మూలంగా వలస కార్మికుల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వారి మృత దేహాలను కూడా వారి కుటుంబాలకు అందించలేని స్థితి గత ఇరవై ఐదురోజులుగా కొనసాగుతున్నది. వారి కుటుంబాల రోదన వర్ణనాతీతం. వీరంతా అసంఘటితరంగానికి చెందిన వలస కార్మికులే. ఈ నేపథ్యంలో కేంద్రం మతోన్మాద విధానాలు, కార్పొరేట్ శక్తుల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు(21 మార్చి 2025) హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నా తలపెట్టింది. అసంఘటితరంగ కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి.



భగత్ సింగ్ వర్ధంతిని జయప్రదం చేయండి

• సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్

నవతెలంగాణ-ఖమ్మం

భారతదేశం స్వాతంత్ర్యం కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరగబోయే ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ కోరారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవన్ లో పార్టీ టూ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 23 సంవత్సరాల వయసులోనే బ్రిటిష్ ప్రభుత్వం భగత్‌సింగ్‌ను ఉరి తీసిందన్నారు. అతను ధైర్యం, తెగువ ఈనాటి యువతకు ఆదర్శమన్నారు. పూర్తి కమ్యూనిస్టు భావజాలం కలిగిన భగత్ సింగ్ ఆనాడు బ్రిటిష్ అధికారులను గడగడలాడించిన స్ఫూర్తిని నేటి యువతరం ఆచరణలో పెట్టవలసిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బ్రిటీష్ పరిపాలన పోయినా వారి స్థానంలో విదేశాల కార్పొరేట్ సంస్థలు ఈ దేశాన్ని నిలువునా దోచుకుంటున్నాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ ఆదివారం సాయంత్రం చర్చి కాంపౌండ్ నుంచి కమాన్ బజార్ మీదుగా వైరా రోడ్ సత్తెనపల్లి రామకృష్ణ స్తూపం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పెద్ద ఎత్తున యువత భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నర్రా రమేష్, భుక్యా ఉపేంద్ర, శెట్టి రవీంద్ర, ఎస్కే హుస్సేన్, మల్లికార్జున్‌రెడ్డి, నాగరాజు, ఏటా రాజేష్, భీబీ పాల్గొన్నారు.



ఆరు గ్యారెంటీల అమలుకు 29న ధర్నా

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఆరు గ్యారెంటీల అమలుకు ఈనెల 29న తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య అన్నారు. పార్టీ మండల కమిటీ, శాఖా కార్యదర్శుల సమావేశం బీమవరంలోని బోడేపూడి భవనంలో గామాసు జోగయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా వీరయ్య, పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలన్నారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలపై, స్థానిక, రైతాంగ సమస్యలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామిశెట్టి సురేష్, నల్లమోతు హనుమంతరావు, షేక్ లాల్, దూదిగం బసవయ్య, సగ్గుర్తి సంజీవరావు, మేడగాని తిరుపతిరావు, శాఖ కార్యదర్శులు గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, కుడెలి నాగేశ్వరరావు, మందడపు ప్రభాకర్, కిషోర్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో జనన, మరణ ధ్రువపత్రాలు జారీ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఏదులాపురం మున్సిపాలిటిలో గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జనన, మరణ ధ్రువపత్రాలు అన్నింటికి మోక్షం లభించింది. గురువారం పెండింగ్లో ఉన్న ధ్రువపత్రాలన్నింటిని అప్రూవల్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇంకా ఎవరికైనా జనన, మరణ ధవపత్రాలు అవసరమైన వారు వెంటనే పెద్దతండాలోని మున్సిపాలిటి కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా ఇంటి పన్నులు, అస్సెస్మెంట్స్, మ్యూటేషన్స్, ట్రేడ్ లైసెన్స్, హౌస్ పర్మిషన్స్, ఇతర పౌరసేవలు సోమవారం నాటికి పూర్తిగా అందుబాటులోకి వస్తాయని ఏదులాపురం కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించండి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని నూతనంగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో సమస్యలు అనేకం ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సీపీఎం ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. మద్దులపల్లి గ్రామంలో గడ్డల మీద అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గ్రామ కంఠం పరిధిలో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ అనుమతుల కోసం ప్రత్యేక పర్మిషన్ ఇవ్వాలని, రోడ్డు వెడల్పు అయిన కారణంగా గ్రామంలో ప్రమాదాలు నివారించడానికి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు రాకుండా చూడాలని, తెల్దారుపల్లి స్టేజి వద్ద గల కళ్యాణ మండపంలో వంటశాల, మరుగుదొడ్లు నిర్మించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు..ఈ విషయాలపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అన్ని సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిద్దినేని కోటయ్య, పొన్నెకంటి సంగయ్య, జాలారు సంగయ్య, నందిగామ కృష్ణ, వడ్లమూడి నాగేశ్వరరావు, రంజాన్ పాషా, ధనియాకుల రామయ్య, చామకూరి రవీందర్, మొరబోయిన పుల్లయ్య, కర్లపూడి వెంకటేశ్వర్లు, పెంట్యాల నాగేశ్వరరావు, పొన్నం సంగయ్య, దుండిగల వెంకటేశ్వర్లు, గొడ్డుగొర్ల బుచ్చి రాములు, నందిగామ నాగరాజు, వేల్పుల జానయ్య, బండారు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రియదర్శినిలో జిల్లా స్థాయి యువ ఉత్సవం పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని ప్రియదర్శిని మహిళల ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్-2025 పోస్టర్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజ్మీల్ ఖాన్,ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నవీన్ బాబు మాట్లాడుతూ...నెహ్రూ యువ కేంద్ర నిర్వహించే జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో యువత తమ ప్రతిభను ప్రదర్శించడానికి, సృజనాత్మకతను పెంపొందించడానికి, దేశభక్తిని ప్రోత్సహించడానికి ఒక సువర్ణమైన వేదికని, జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తమ కళాశాలను ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నెహ్రూ యువ కేంద్ర కార్యక్రమం అధికారి కె.భానుచంద్ మాట్లాడుతూ గ్రామీణ యువత జాతి నిర్మాణ ప్రక్రియలో పాల్గొనడానికి అవకాశాలను కల్పించడంతో పాటు వారి వ్యక్తిత్వ, నైపుణ్యాల అభివృద్ధికి అవకాశాలను కల్పించే లక్ష్యంతో 1972 సంవత్సరంలో నెహ్రూ యువ కేంద్రాలు స్థాపించబడ్డాయని, దీని యొక్క ప్రధాన లక్ష్యం మంచి పౌరసత్వం, లౌకిక మార్గాల్లో ఆలోచించడం, ప్రవర్తించడం, నైపుణ్యాభివృద్ధి, యువత ఉత్పాదిక, వ్యవస్థీకృత ప్రవర్తనను అవలంబించడంలో సహాయపడటం వంటి విలువలను అభివృద్ధి చేయడంపై ప్రధాన దృష్టి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.గోపాల్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ కాల్వ భూ నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలి

• తహశీల్దార్ కార్యాలయం ఎదుల ఆందోళన

నవతెలంగాణ-కామేపల్లి

సీతారామ ప్రాజెక్ట్ కాలువ భూ నిర్వాసితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కామేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ 2018లో కామేపల్లి మండలం నుండి 216 మంది రైతులు వద్ద నుండి సుమారు 516 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. నాటి నుండి నేటి వరకు బాధిత రైతులకు నష్టపరిహారం అందలేదని ఆరోపించారు.



ప్రభుత్వం తక్షణమే బాధిత రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రంను కామేపల్లి తహసీల్దార్ సిహెచ్ సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతులు అంగోత్ బాలాజీ, రైతు సంఘం మండల కార్యదర్శి సకినాల శ్రీనివాసరావు, రాయల సత్యనారాయణ, సింగం వెంకన్న, రవి, గట్ల వీరయ్య నాగయ్య, శంకర్ పాల్గొన్నారు.

గాజాలో హింసకు పూర్తి బాధ్యత అమెరికాదే

• సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

• గాజాపై ఇజ్రాయిల్ మారణకాండకు సీపీఐ(ఎం) ఖండన

నవతెలంగాణ-ఖమ్మం

గాజాపై ఇజ్రాయిల్ దాడులు మళ్ళీ చేయటంపైన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. గురువారం దాడులకు నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయం సుందరయ్య భవనం నుండి ప్రదర్శన బయలుదేరి ఎన్ఎస్‌పి క్యాంప్‌లోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్ వరకు జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు పాల్గొని మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడుల వలన 413 మంది పాలస్తీనీయులు మరణించారని, అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ మరోమారు గాజాపై మారణకాండకు తెగబడిందని విమర్శించారు. రంజాన్ మాసంలో భీకర వైమానిక దాడులతో విరుచుకుపడి పాలస్తీనీయుల ప్రాణాలు హరించిందని అన్నారు. హమాస్ స్థావరాలే లక్ష్యంగా రాత్రి వేళల్లో విచక్షణారహితంగా భూతల, వైమానిక దాడులకు పాల్పడిందని తెలిపారు. ఈ దాడుల్లో పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో మృతి చెందారని తెలిపారు. మృతి చెందిన వారిలో సామాన్యులే అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. ఇజ్రాయెల్‌కు పూర్తి నైతిక, ఆయుధ శక్తి సామర్థ్యాలను సమకూర్చి వెనుక నుండి ట్రంప్ ప్రభుత్వమే గాజాలో హింసా కాండకు కారణమైందని విమర్శించారు. అమెరికా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆర్థిక, రాజకీయ మద్దతు ఇవ్వడం ద్వారా ఇజ్రాయిల్‌ను ఉసిగొల్పి గాజాను అమెరికా నాశనం



చేసిందని విమర్శించారు. ఇజ్రాయిల్ చర్యల వలన మరో విడత ఉద్రిక్తతలు మొదలయ్యాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉండాలన్నారు. మేధావులు, అభ్యుదయకాముక శక్తులు, ఐక్యరాజ్యసమితి గాజాలో ప్రజలకు రక్షణగా నిలబడాలని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు వర్గాలు పాటించేలా చూడాలని కోరారు.

పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ చేసిన వైమానిక దాడుల ఫలితంగా మహిళలు, పిల్లలతో సహా 400 మందికి పైగా పాలస్తీనీయులు దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 నాటి నుండి పాలస్తీనీయుల మరణాల సంఖ్య 62 వేలు దాటిందని, వీరిలో అత్యధికులు అమాయక పౌరులేనని విచారం వ్యక్తం చేశారు. పాలస్తీనాపై



ఇజ్రాయిల్ మారణకాండను ఆపేలా ఇజ్రాయిల్‌ను కట్టడి చేయాలని, తక్షణమే నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) అంతర్జాతీయ సమాజానికి, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి విజ్ఞప్తి చేస్తుందని అన్నారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడుల పట్ల భారత ప్రభుత్వం మౌనం పాటించడం సరైంది కాదని అన్నారు. భారత ప్రభుత్వం మౌనం వీడాలి, కొనసాగుతున్న హింసను ఖండించాలన్నారు. పాలస్తీనా ప్రజలకు పార్టీ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, ఖమ్మం 1టౌన్ కార్యదర్శి నాగుల్‌మీరా, 2 టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, జిల్లా నాయకులు ఆర్.ప్రకాష్, నర్రా రమేష్, ముదాం శ్రీను, చెరుకుమల్లి కుటుంబరావు, సదానందం, చింతల రమేష్, నామా లక్ష్మినారాయణ, పారుపల్లి కృష్ణారావు, దేవళ్ళ వీరబాబు, పాపారావు, యర్రా రంజిత్, హిమాం, శీలం వీరబాబు, లక్ష్మినారాయణ, నర్సింగరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

డైలీ వేజ్ వర్కర్ల సమ్మె తాత్కాలిక విరమణ

నవతెలంగాణ-ఖమ్మం



తమకు తగ్గించిన వేతనాలను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 నుండి గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు నిర్వహిస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలు అండ్ హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.విక్రమ్, యూనియన్ జిల్లా అధ్యక్షులు భూక్యా శ్రీనివాసు తెలిపారు. గురువారం ఖమ్మంలోని డైలీవేజ్ వర్కర్లందరూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ట్రైబల్ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గ్రీన్ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ తో మిగతా జిల్లాల్లో చెల్లించిన విధంగా మార్చి వరకు పాత పద్ధతిలో జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాల చెల్లింపులకు చర్చించారు. జాయింట్ డైరెక్టర్ ట్రెజరీతో మాట్లాడిన అనంతరం ఖమ్మం జిల్లాలో కూడా మార్చి నెల వేతనాలను జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం చేయడానికి జిల్లా ఖజానా అధికారులు అంగీకరించారు. దీంతో మార్చి నెల వేతనాలు జిల్లా గెజిట్ ప్రకారం చెల్లిస్తామని రాబోయే కాలంలో రాష్ట్రస్థాయి అధికారుల తోటి మాట్లాడి సమస్య శాశ్విత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేటి నుండి పదవ తరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో సమ్మెను విరమించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ డైరెక్టర్ విజ్ఞప్తి మేరకు తాత్కాలికంగా సమ్మె విరమించారు. సమస్య పరిష్కారానికి రాబోయే కాలంలో మరో రూపంలో ఆందోళన కొనసాగిస్తామని యూనియన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఎక్కడైనా సహజంగా జీతాలను పెంచే ఆలోచన చేస్తారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖలో వేతనాలను పెంచకపోగా ఉన్న వేతనాలను తగ్గించే చర్యలు చేపట్టడం దారుణమని అన్నారు. వేతనాలు తగ్గింపు ఫలితంగా ఖమ్మం జిల్లాలో ఒక్కొక్క కార్మికుడు నెలకి 14,430 రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై జనవరి 18 నుండి అధికారులకు, మంత్రులకు వినతి పత్రాలు ఇస్తున్నప్పటికీ పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాలలో కార్మికులకు జీతాలను తగ్గించకుండా జిల్లా గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించగా కేవలం ముగ్గురు మంత్రులు ఉన్న ఖమ్మం జిల్లాలో మాత్రమే వేతనాలను తగ్గించి చెల్లించడం మంత్రులకే అవమానకరం అన్నారు. ఫలితంగా గత ఏడు నెలల కాలంలో ఒక్కొక్క కార్మికుడు లక్ష రూపాయలు నష్టపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెల వేతనంతో పాటు ఏప్రిల్ లో బడ్జెట్ వచ్చిన అనంతరం తక్కువగా చెల్లించిన ఏడు నెలల వేతనాలను కూడా తిరిగి చెల్లించాలని యూనియన్ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గత నాలుగు రోజులుగా ఐక్యంగా సమ్మెను నిర్వహించిన కార్మికులను నాయకులు అభినందించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ డైలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బి.అనంతరం, సూర్య, కళ్యాణి, కమల, వెంకటమ్మ కపూరియా, సుశీల, రంగయ్య నంద్యా, బుచ్చయ్య, కళావతి, వీరు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు గ్రామపంచాయతీ కార్మికుల వినతి

నవతెలంగాణ- తల్లాడ

నెల నెలా వేతనం ఇప్పించాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇప్పించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు ఎంపీడీవో సురేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఇమ్మడి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బొగ్గుల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి లాజరు, వెంకటేశ్వర్లు, కృష్ణ, దాసు తదితరులు పాల్గొన్నారు.

తాళ్ల పుల్లారావుకు నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని గోపాల్పేట గ్రామానికి చెందిన తాళ్ల పుల్లారావు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాస్‌రావు గురువారం పుల్లారావు కుటుంబాన్ని పరామర్శించారు. పుల్లారావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, పేరసాని నరసింహారావు తదితరులు ఉన్నారు .

మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి ఆదర్శం

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి ప్రతి మహిళకు ఆదర్శమని ఐద్వా మండల నాయకురాలు కేసగాని నీలిమ అన్నారు. గురువారం కారేపల్లి మండలం గాంధీనగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సభ ఈసం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.జ్యోతి, ఎస్.నాగమణి, కె.పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వంసిద్ధం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలో నేటి నుండి జరగబోయే పదవ తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం పరీక్ష కేంద్రాలు 6, మొత్తం విద్యార్థులు 779 మంది ఇన్విజిలేటర్స్ 103 మంది, పరీక్ష కేంద్రాలు జలగంనగర్, ఏదులాపురం, తల్లంపాడు, కారుణ్య భవన్, కేజీబీవీ, గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరోగ్య కార్యకర్తలు, తాగునీటి సౌకర్యం, రక్షణ సిబ్బందితో పాటు సీసీ కెమెరా పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నారు.

బడ్జెట్లో విద్యా రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ట బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించడం జరిగిందని పిడిఎస్‌యూ జిల్లా నాయకులు స్టాలిన్ విమర్శించారు. విద్యా రంగానికి కేటాయించిన బడ్జెట్ పట్ల గురువారం కారేపల్లి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు రాము, మహేష్, వంశీకృష్ణ, రాజు, రాకేష్, సురేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యపూర్ మేజర్‌కు గండి

మరమ్మతులు చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-కల్లూరు



నాగార్జునసాగర్ పరిధిలోని మధిర బ్రాంచ్ పరిధిలోని పుణ్యపుర్ మేజర్‌కు బాలాజీ నగర్, విశ్వనాథపురం గ్రామాల సమీపంలో గురువారం ఉదయం కాల్వకు గండి పడింది. ఈ విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్న ఎన్ఎస్‌పి అధికారులు పంట నష్టపోకుండా వెంటనే నీటి సరఫరాను నిలిపివేశారు. గండిపడిన చోట నీటి ప్రవాహానికి ప్రస్తుతం రబీలో వరిసాగు చేసి ఉండటం వల్ల కాల్వను ఆనుకొని ఉన్న పొలాల్లో పంట నష్టపోకుండా వెంటనే చర్యలు చేపట్టడంతో రైతులు ఊపిరి పిలుచుకున్నారు. ఎన్ఎస్‌పి ఈఈ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వెంటనే డిఈలు రత్నాకర్, వెంకటేశ్వరరావు, కాల్వ కట్టకు మరమ్మత్తు పనులు చేపట్టారు. మధ్యాహ్నం కల్లా గండి పూడ్చి వేసి నీటి సరఫరాను పునరుద్ధించారు. పుణ్యపూర్ మేజర్ సుమారు 14 కిలోమీటర్లు దూరంలో విస్తరించి కల్లూరు, తల్లాడ మండలాలకు మండలాలకు చెందిన పొలాలకు నీటి సరఫరా చేస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టడంతో అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణాత్మక సంఘం టీడబ్ల్యూజేఎఫ్

• సమిష్టితత్వంతోనే సమస్యల పరిష్కారం

• జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ లక్ష్యం

• నాయకత్వ లోపాలను ప్రశ్నిస్తే ఆ యూనియన్‌లలో అవమానాలు..

• టీడబ్ల్యూజేఎఫ్ తేనీటి విందు సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండల్‌రావు, శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు ప్రసేన్, ఖదీర్, సాగర్, మాధవరావు, రమేష్, రవికిరణ్

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌ను చిన్నచూపు చూసిన ఆ రెండు సంఘాలకు ఓ గుణపాఠం చెప్పేలా టీడబ్ల్యూజేఎఫ్ ఎదగటాన్ని జర్నలిస్టు లోకం స్వాగతిస్తోందని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ అన్నారు. సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసే ఓ నిర్మాణాత్మక సంఘంగా టీడబ్ల్యూజేఎఫ్ ఆదర్శంగా ఉందన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండల్‌రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత బెల్లంకొండ ప్రసేన్, సీనియర్ జర్నలిస్టులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, వేగినాటి మాధవరావు, తాళ్లూరి రమేశ్, మానుకొండ రవికిరణ్, వ్యవస్థాపక అధ్యక్షులు పారుపల్లి కృష్ణారావు, కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు నేతృత్వంలో స్థానిక మంచికంటి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన తేనీటి విందు సమావేశంలో రాజశేఖర్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక



జర్నలిస్టు సమస్యలను పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్ ఉద్యమాలే కారణమన్నారు. హెల్త్‌కార్డులు, ఏసీ బస్సుల్లో రాయితీ, అక్రిడిటేషన్ సమస్యలు, ఇండ్ల స్థలాల కోసం టీడబ్ల్యూజేఎఫ్ పోరాటాలు నిర్వహించి, విజయం సాధించిందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కన్నా నాయకత్వాలను నిలబెట్టుకోవాలనే ఆ రెండు యూనియన్ల నాయకులు తాపత్రయ పడిన తీరును సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత బి.ప్రసేన్ వివరించారు. తమ నాయకత్వానికి ముప్పు ఏర్పడుతుందన్న ప్రతీసారి ఏదో ఒకరకమైన వంచనకు పాల్పడటం ఓ యూనియన్ నేతకు వెన్నతో పెట్టిన విద్యని పేర్కొన్నారు. వాటికి అతీతంగా టీడబ్ల్యూజేఎఫ్ నిర్మాణం ఎలా ఉండాలో వివరించారు. నిర్మాణాత్మక సంఘంగా టీడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తుందని, ఆ రెండు యూనియన్ల తరహాలో 'ఏకో నారాయణ'ల వ్యవహారం ఫెడరేషన్‌లో ఉండదని జిల్లా అధ్యక్షులు కొండల్‌రావు విమర్శించారు. ఆ రెండు యూనియన్ల మాదిరి టీడబ్ల్యూజేఎఫ్‌లో ఏకపక్ష ధోరణులు ఉండవని..ఇక్కడ లీడర్, క్యాడర్ ఒక్కటేనని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఆయా సంఘాల నేతలు సాగించిన నియంత ధోరణులను సీనియర్ జర్నలిస్టు ఖదీర్ ఏకరువు పెట్టారు. టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధాంత ప్రాతిపదికన పనిచేస్తుందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం టీడబ్ల్యూజేఎఫ్‌తోనే సాధ్యమనే విశ్వాసంతోనే ఫెడరేషన్‌తో కలిసి నడిచేందుకు జిల్లా జర్నలిస్టులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇదీ ఆరంభం మాత్రమేనని నియంత పోకడలను ధిక్కరించేందుకు జర్నలిస్టులు సిద్ధంగా ఉన్నారని సీనియర్ జర్నలిస్టు సాగర్ పేర్కొన్నారు. బెదిరింపు, అవమానకర ధోరణులకు గుణపాఠం చెప్పాలనే దృక్పథం ప్రతీ జర్నలిస్టులో కనిపనిస్తోందని సీనియర్ జర్నలిస్టు మాధవరావు అన్నారు. జర్నలిస్టుల ఐక్యత చాటే సంఘంగా టీడబ్ల్యూజేఎఫ్‌కు ఓ మంచి పేరుందని మరో సీనియర్ జర్నలిస్టులు తాళ్లూరి రమేశ్, మానుకొండ రవికిరణ్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, విష్ణు, అంజయ్య, శివారెడ్డి, వీసారపు అంజయ్య, నేతలు సంజీవరావు, సుభాన్, వీరేష్, డీఎన్‌బీ మాధవరావు, రామచంద్రమూర్తి, రిషి, అర్షద్, పలువురు టౌన్ రిపోర్టర్లు, కెమెరామెన్‌లు, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

గుణపాఠం చెప్పేలా ఎదుగుదల





మహిళా జర్నలిస్టు మధుశ్రీకి సన్మానం

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'మహిళా జర్నలిస్టులు- సవాళ్లు' సదస్సుకు హాజరైన సీనియర్ జర్నలిస్టు మధుశ్రీని యూనియన్ నేతలు సన్మానించారు. మెమెంటో అందజేశారు. మహిళా జర్నలిస్టులను ఆదరించటంలో టీడబ్ల్యూజేఎఫ్‌ను మించిన సంఘం లేదని మధుశ్రీ వ్యాఖ్యానించారు. ఇక్కడ మహిళలకు ఉన్న గౌరవం మరే సంఘంలో లేదని సదస్సు ద్వారా తనకు అర్థమైందన్నారు.

అస్వస్థతకు గురైన జర్నలిస్టు రవికి పరామర్శ

ఆకస్మికంగా అస్వస్థతకు గురైన జీన్యూస్ టౌన్ రిపోర్టర్ రవికుమార్‌ను టీడబ్ల్యూజేఎఫ్ నేతలు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా పర్యవేక్షించారు. ఆస్పత్రికి వెళ్లి రవి ఆరోగ్య పరిస్థితిని ఆయన భార్య ద్వారా యూనియన్ నేతలు తెలుసుకున్నారు. రవి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ నేతలు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ఖదీర్, సాగర్, యాకేష్, మాధవరావు, సుభాన్, జానీ, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

వాహనాలు సమకూర్చుటకు ప్రైవేటు ట్రావెల్స్ నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానం

• జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో గల వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి ల్యాబ్ శాంపిల్‌లను కలెక్ట్ చేస్తూ వాటిని తెలంగాణ డైగ్నోస్టిక్ హబ్, ప్రభుత్వ ఆసుపత్రి ఖమ్మంనకు చేర్చుటకు 5 వాహనాలు సమకూర్చేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ నుండి సీల్డ్ టెండర్ దరఖాస్తులను కోరు చున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతి బాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనం నెలకు 2 వేల 500 కిలోమీటర్లు తిరగాలని, ఒక్కొక్క వాహనంనకు నెలకు 33 వేల రూపాయలు అద్దె చెల్లించబడుతుందని, వాహనాల రిజిస్ట్రేషన్ 5 సంవత్సరాలలోపు ఉండాలని, ఎల్లో ప్లేట్ వెహికల్స్ మాత్రమే అనుమతించబడతాయని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీ వారు ఈ అవకాశం ఉపయోగించుకొని తమ సీల్డ్ టెండర్ దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో ఈనెల 29 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని తెలిపారు.



పరీక్షా కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండలంలో ఉన్న మూడు పరీక్ష కేంద్రాలను ఎంఈఓ మురళీమోహన్ గురువారం పరిశీలించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, మంచినీటి సదుపాయం విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులకి కొన్ని విజ్ఞప్తిలు చేశారు. మార్చి 21నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించాలన్నారు. మండలంలో 3 పరీక్ష కేంద్రాల్లో 465మంది, ఎరుపాలెం ఎర్రుపాలెం హైస్కూలు నందు 170 మంది, గురుకుల నందు151, బనిగండ్లపాడు పరీక్షా కేంద్రంలో 144 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం నుంచి మొదటిసారిగా 24 పేజీల బుక్లెట్ (రూల్స్ పేజీలు) ఇవ్వడం జరుగుతుందన్నారు. పేజీకి 25 లైన్స్ వరకు ఉంటాయన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. మొదటి రోజు గంట ముందుగా, మిగిలిన రోజుల్లో పరీక్షలకు 30 నిమిషాల ముందుగా పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఇస్తారని అన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని పాత పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసి వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, లైన్ మిత్రులు తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకలు అంతరించి పోతే పంటలపై ప్రభావం

- జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఏ.రాంబాబు

నవతెలంగాణ-వేంసూరు



పిచ్చుకలు అంతరించి పోతే కీటకాలు పెరిగిపోయి ఆ ప్రభావం పంటలపై చూపుతాయని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఏ. రాంబాబు అన్నారు. దీనివలన పంటలు చేతికి అందకుండా పోయి రైతులకు నష్టం వాటికతోందని కాలుష్యం రేడియేషన్ ల వలన నేడు పిచుకలు గ్రామీణ ప్రాంతాలలో సైతం అంతరించిపోతున్నాయని తెలిపారు. అంతర్జాతీయ పిచ్చుకలు దినోత్సవం సందర్భంగా గురువారం వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి పిచుకల వలన కలుగు లాభాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సుధాకర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఖమ్మం

రఘునాథపాలెం మండలంలోని కోయచలకకు చెందిన నిరుపేద విద్యార్థిని పెనుగొండ సిరి చందన ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతుంది. వారి ఆర్థిక, కుటుంబ పరిస్థితి పరిశీలించి వారి అభ్యర్థన మేరకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక చేయూత అందించాలని నిర్ణయించి గురువారం రూ.20 వేల చెక్కును కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ పిన్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయులు పరిశ పుల్లయ్య చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలు తెలుసుకొని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ట్రెజరర్ కనపర్తి వెంకటేశ్వర్లు, విద్యార్థిని తల్లి కవిత పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలో న్యూలక్ష్మీపురంలో ఎంఎ న్ఆర్ఈజీఎస్ పథకంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన రూ.18 లక్షల వ్యయంతో నిర్మించునున్న సిసి రోడ్లకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్ లాంచనీయంగా గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లకు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లెపొంగు రమేష్, గ్రామ మాజీ సర్పంచ్ వాగదాని కన్నయ్య, నాయకులు పోతురాజు పురుషోత్తం, ఊరుకొండ రాజు, కొట్టే శ్రీనివాసరావు, వాకదాని చెన్నారావు, పంచాయతీ కార్యదర్శి దేగల సురేష్, పంచాయతీ మాజీ వార్డు సభ్యులు మారుతి వీరయ్య, సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.32 లక్షలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.32,86,315ల ఆదా యం వచ్చింది. గురువారం హుండీలను విప్పి లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య సభ్యులు ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమారి, ఆలయ అర్చకులు, సత్య సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు లక్ష్యం కోసం చదవాలి

- రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణ మూర్తి
- ముగిసిన 3 రోజుల టాలీ శిక్షణ కోర్సు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థులు లక్ష్యం కోసం చదవాలని రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణ మూర్తి అన్నారు. గురువారం ఖమ్మంలోని టాస్క్ ఆధ్వర్యంలో మూడు రోజుల టాలీ కోర్స్ ముగింపు సమావేశం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పరంజ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాధా కృష్ణ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఆయా రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ట్రైనర్ రామకృష్ణ మాట్లాడుతూ ఈ 3 రోజుల పాటు టాలీ కోర్స్‌లో విద్యార్థులకు విలువైన సమాచారంతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను అందించామన్నారు. అదేవిదంగా ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ ఇలాంటి కోర్సుల వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు ఈ కోర్సులో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బివి.రెడ్డి, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్. ఎస్.రమేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.నారాయణ స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి ఇందు ప్రియ

నవతెలంగాణ-వేంసూరు



వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఇందు ప్రియ అన్నారు. గురువారం మండల పరిధిలోని దుద్దేపూడిలో వైద్య శిబిరం నిర్వహించి చక్కెర రక్తపోటు తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించడం తదితర అంశాలపై వివరించారు. మొత్తం 55 మందికి పూజ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో సిహెచ్ఓ వెంకట్ నారాయణ, రామకృష్ణ, ఈఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉగాది నుండి సన్న బియ్యం పంపిణీ

- రాబోయే నాలుగేండ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-పెనుబల్లి/కల్లూరు



ఉగాది నుండి రేషన్‌కార్డు దారులందరికి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్టు, రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 4 లక్షల 50 వేల ఇండ్ల నిర్మాణం చేపట్టి, రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను కట్టే దిశగా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి పెనుబల్లి, కల్లూరు మండలాల్లో పర్యటించి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఇందిరమ్మ గృహ నిర్మాణానికి, సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే అభివృద్ధి పనులు కూడా చేస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను సరి చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే 57 వేల 626 ఉద్యోగాల భర్తీ చేస్తూ నిరుద్యోగులకు నియామక పత్రాలను అందజేశామని తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల 450 కోట్లు ఖర్చు చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, ఉగాది నుంచి సన్న బియ్యం సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ఏ రాష్ట్రం చేయని విధంగా 20 వేల 676 కోట్ల రైతుల రుణాలను మాఫీ చేశామని, సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందించామని, పండించే ప్రతి ఎకరానికి 12 వేల రైతు భరోసా క్రింద, మొదటి విడత 6 వేల రూపాయలు నెలాఖరులోగా అందరికి అందజేస్తామని అన్నారు. యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో అద్భుతమైన పథకాన్ని రూపొందించారని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 50 వేల నుంచి 4 లక్షల వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 5 వేల మందికి తగ్గకుండా ఇచ్చేందుకు చర్యలు తీసుకొని, దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు కాల్వల క్రింద తూము నిర్మించి రామచంద్రాపురం, ఎరుగట్ల గ్రామాల చెరువు నింపేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాలతో ప్రత్యేకంగా స్త్రీ టీ క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో 4 వేల వరకు వివిధ వ్యాపార యూనిట్లను మహిళలచే ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 2 పెట్రోల్ పంప్ లను మహిళా సంఘాలు నిర్వహించేలా ఏర్పాటుకు చర్యలు చేపట్టామని అన్నారు. సబ్ సెంటర్ నుంచి జిల్లా ఆసుపత్రి వరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రైవేట్ వైద్యం అవసరం రాకుండా ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఒక ఎకరం కూడా ఎండిపోకుండా సాగునీరు సరఫరా చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మెన్ మువ్వా విజయ్‌బాబు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఎఫ్ఆర్వో పి.స్నేహలత, తహశీల్దార్లు జి.ప్రతాప్, సాంబశివుడు, ఎంపిడివోలు అన్నపూర్ణ, చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి చలమాల గంగాధర్

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి

నవతెలంగాణ-పెనుబల్లి



మండలంలో సీపీఐ(ఎం)ను విస్తరింపజేసిన మార్క్సిస్టు పార్టీ ముద్దుబిడ్డ అమరజీవి చలమాల గంగాధర్‌రావు అని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. గురువారం మండల పరిధిలోని విఎం.బంజర పట్టణంలో గల గంగాధర్‌రావు స్థూపం వద్ద మండల నేత తాండ్ర రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన చలమాల 14 వ వర్ధంతి సభలో భారతి పాల్గొని మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కడవరకు ఎర్రజెండాతో చెలిమి చేసిన గొప్ప వ్యక్తి గంగాధరరావు అని ఆయన సేవలను కొనియాడారు. ప్రజలను మతాల పేరుతో మోడీ సర్కారు విడదీస్తూ కొట్టుకున్నేలా చేస్తుందన్నారు. లౌకిక దేశంగా వున్న ఇండియాను హిందూత్వ దేశంగా మార్చే కుట్ర చేస్తుందన్నారు. ముందుగా స్థూపం వద్ద సీపీఐ(ఎం) జెండా ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం చిత్ర పటానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. మాదినేని మాట్లాడుతూ నేడు దేశంలో సంపద సృష్టిస్తున్న శ్రామికుల, కష్టజీవుల, కూలీల, కర్షకుల కష్టాన్ని కర్కశంగా జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్న కేంద్ర మోడీ సర్కారు పై పోరాటమే గంగాధరరావుకు ఇచ్చే ఘన నివాళి అవుతుందని తెలిపారు. పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ఇస్తామని నమ్మబలికించి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా అమలు చేయడం లేదని విమర్శించారు. సభకు నేతలను సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) తల్లాడ, కల్లూరు మండలాల కార్యదర్శులు అయినాల రామలింగేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్, సీపీఐ(ఎం) డివిజన్ కమిటి సభ్యులు మిట్టపల్లి నాగమణి, నల్లమల అరుణ్ ప్రతాప్, కండే సత్యం, చలమాల నరసింహారావు, తడికమళ్ళ చిరంజీవి, కలకోట అప్పారావు, కాంగ్రెస్ నేత అన్నపురెడ్డి శ్రీనివాసరావు, మేకల బాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నేత బెజవాడ సాయి, ప్రజా పంథా నేత కాటినేని శ్రీను, యాదవ సంఘం నేత కర్రి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం నేత గోపిశెట్టి వెంకటేశ్వరరావు, టాక్సీ డ్రైవర్ యూనియన్ నేత రవి, ట్రైలర్‌ల నేత బాషా, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

భయంతో కాదు బాధ్యతతో పరీక్షలు రాయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాచబంటి రాము

నవతెలంగాణ-చింతకాని




మండల కేంద్రంలో నేడు జరగబోయే 10వ తరగతి పరీక్షలను బాలబాలికలు భయంతో కాకుండా బాధ్యతతో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాచబంటి రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలం అంతా కష్టపడి చదివి పరీక్షలు రాసే సమయంలో కంగారు పడకుండా ఉండాలన్నారు. అంతే కాకుండా భయపడకుండా ధైర్యంగా ఉండాలని పరీక్ష రాసే సమయంలో భయభ్రాంతులకు గురి కాకుండా ఉండాలని తెలిపారు. పరీక్ష కేంద్రం దగ్గరికి వెళ్లే విద్యార్థులు అందరూ కూడా అర్ధగంట సమయం ముందే పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలని తెలిపారు. పరీక్ష రాయడానికి వెళ్లే విద్యార్థులకు ఆటోలు గాని బైకులు గాని లిఫ్ట్ అడిగితే తక్షణమే ఆలోచించకుండా సహాయం చేయాలని అన్నారు. వారి సురక్షితంగా పరీక్షా కేంద్రాల వద్ద చేర్చాలన్నారు. క్వచన్ పేపర్ ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా చదివి ఆలోచించి రాయాలని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-బోనకల్

జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద గురువారం చలివేంద్రాన్ని తహసిల్దార్ అని శెట్టి పున్నం చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్-1 మఠం నవీన్ కుమార్, లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ కిలారు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, బిజెపి నాయకులు జంపాల రవి, కాలసాని పరశురాం, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పది పరీక్ష కేంద్రాలను సందర్శించిన తహశీల్దార్

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని శుక్రవారం నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ కొక్కుల సునీత ఎలిజిబెత్ గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. పది పరీక్ష కేంద్రాలలో పరీక్షలు రాసే విద్యార్థులకు మౌలిక వసతులు గురించి విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మేడేపల్లి, బాణాపురం, వల్లభి, ముత్తారం, ముదిగొండ హైస్కూల్‌లలో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు ప్రశాంతంగా ఒత్తిడి లేకుండా రాయాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పి.ప్రసన్న కుమార్, జూనియర్ అసిస్టెంట్స్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-ముదిగొండ

మండలకేంద్రమైన ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల ఐదు నుండి 20 వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమమే 'టీడబ్ల్యూజెఎఫ్' లక్ష్యం

- రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్
- జర్నలిస్టుల కోసం అనేక పోరాటాలు నిర్వహించాం : కె.శ్రీనివాస్‌రెడ్డి
- ఉత్సహంగా జర్నలిస్ట్‌ల సభ్యత్వ నమోదు కార్యక్రమం

నవతెలంగాణ-కూసుమంచి



జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టీడబ్ల్యూజెఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) పనిచేస్తుందని, రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహించి, ఎన్నో విజయాలను సాధించడం టీడబ్ల్యూజెఎఫ్‌తోనే సాధ్యమైందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ బ్రదర్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన టిడబ్ల్యూజెఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమం సీనియర్ జర్నలిస్ట్‌లు పెండ్ర అంజయ్య, ఉల్లోజు కర్ణబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ నాయకులు, జర్నలిస్ట్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టులందరు ఐక్యతతో ఉంటే ఏదైనా సాధించడం ఖాయమని, జర్నలిస్టులు అందరూ ఐక్యంగా ఉండాలని, ఒకే గొడుగు కిందకు రావాలని సంఘం నాయకులు ఖదీర్ పిలుపునిచ్చారు. ఈ సంఘం ఎల్లప్పుడూ మీకు తోడ్పాటు అందిస్తుందని, మండలంలోని నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారికి టిడబ్ల్యూజెఎఫ్ ఎల్లప్పుడూ మీకు అండదడలుగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు. కొత్తగా యూనియన్లో చేరిన వారిపై కొందరు జర్నలిస్టులు తప్పుడు ప్రచారం చేస్తే కచ్చితంగా ఊరుకునేది లేదని, తరువాత జరిగే పరిణామాలకు వారే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. టీడబ్ల్యూజెఎఫ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణ స్థాయి జర్నలిస్టుల తో పాటు గ్రామీణ స్థాయి జర్నలిస్టుల కోసం పోరాటం చేస్తున్నామని, ఈ పోరాట ఫలితంగా సక్సెస్ కూడా చూస్తూనే ఉన్నామని అన్నారు. గతంలో ఏ సంఘం కూడా గ్రామీణస్థాయి జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేయలేదన్నారు. మా పోరాటానికి మండల స్థాయిలో జర్నలిస్టుల సపోర్టు మాకు ఉంటే, మీ పోరాటం తోడు ఉంటే జయించలేనిదేమి ఉండేదన్నారు. మీ అందరికి తోడుగా ఉంటామని సాగర్ హామి నిచ్చారు.

ఉత్సాహంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం

కూసుమంచి మండలంలో టీడబ్ల్యూజెఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. మండలంలో వివిధ పత్రికల్లో పని చేస్తున్న 18 మంది జర్నలిస్టులకు టీడబ్ల్యూజెఎఫ్ నూతన సభ్యత్వలను రాష్ట్ర, జిల్లా నాయకత్వం అందజేశారు. టిడబ్ల్యుజేఎఫ్ సీనియర్ సభ్యులు కర్ణబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నాయకులు వేగినాటి మాధవరావు, జానీ, సుభానీ, మండల సభ్యులు పెండ్ర అంజయ్య, ఎస్.గోవిందరెడ్డి, పందిరి వెంకట్ రెడ్డి,గరిణి నాగేశ్వరరావు, వడ్డెబోయిన వెంకయ్య, కొండా శ్రీనివాస్, భూక్య రాజేష్, మెడవరపు రామబ్రహ్మం, కొలికపొంగు సతీష్, వి.జనార్ధన్, వెంకటేశ్వర్లు, కొమ్ము వెంకటేష్, పోశం నాగార్జున, రాయబారపు రమేష్, ఎస్‌కె.జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు సర్వం సన్నద్ధం

నవతెలంగాణ-తల్లాడ

పదవ తరగతి పరీక్షలకు సర్వం సన్నద్ధమైనట్లు మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్ గురువారం తెలిపారు. పదో తరగతి పరీక్షలు ఈనెల 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. ఇప్పటికే ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మంచినీరు, ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరీక్ష హాల్లో విద్యార్థులకు కూర్చునేందుకు వీలుగా ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. తల్లాడ మండలంలో నారాయణపురం లూర్తు మాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షలకు 269 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. తల్లాడ పరీక్షా కేంద్రానికి 150 మంది విద్యార్థులు, లూర్తు మాత పాఠశాలలో 119 విద్యార్థులు, పరీక్షలు రాయనున్నారు. ఇందులో 132 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, 137 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అడిషనల్ షీట్స్ లేకుండా బుక్ లెట్ ఇవ్వనున్నారు. అందులోనే సమాధానాలు వ్రాయాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీట్, తమవో కాదోనని పరిశీలించుకొని పూర్తిచేయాలని ఎంఈఓ సూచిస్తున్నారు. పరీక్ష సమయం ఉదయం 9:30 నుండి 12:30 గంటల వరకు ఉంటుంది, 9 గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలి, ఎలక్ట్రానిక్ డివైసెస్, చేతి గడియారాలు హాల్లోకి అనుమతించబడవని, షఉస్, బూట్లు చెక్ చేసిన తర్వాతనే హాల్లోకి పంపించడం జరుగుతుందన్నారు. ఆందోళన చెందకుండా తెలిసిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాసి సమయం వృథా కాకుండా చేసుకోవాలని సూచించారు.

వైరా : వైరా మండలంలో మొత్తం నాలుగు పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1.ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 151 మంది విద్యార్థులు. 2. జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ కేంద్రం లో 167 మంది విద్యార్థులు. 3 తెలంగాణ గురుకుల పాఠశాల (బాలికలు) లో 190 మంది విద్యార్థులు. 4. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు) వైరాలో 200 మంది విద్యార్థులు. మొత్తం 708 మంది విద్యార్థులు పై నాలుగు సెంటర్లలో పరీక్షలు వ్రాయుటకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సెంటర్‌కి ఒక చీఫ్ సూపరిండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్, విద్యార్థులకు అనుగుణంగా ఇన్విజిలేటర్‌లను ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణపై తగుచూచనలు ఇచ్చామని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల ప్రకారం ఎటువంటి అవకతవకలకు అనుమానాలకు తావు లేకుండా పూర్తి ఏర్పాట్లను చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

ముదిగొండ : మండలంలోని పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయని మండల విద్యాశాఖ అధికారి డి .రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల రాసేందుకు ఐదు హైస్కూల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. 450 మంది విద్యార్థులు ఈపరీక్షలు రాయనున్నట్లు ఆయన చెప్పారు. మేడేపల్లి, వల్లభి బాణాపురం, ముత్తారం, ముదిగొండ జిల్లా పరిషత్ పాఠశాల యందు పది పరీక్షలు హాజరయ్య విద్యార్థులకు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం12:30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకోవాలని ఎంఈఓ డి.రమణయ్య సూచించారు. ఏప్రిల్ 2 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.



కేజీబీవీలో క్షయ వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ

ఈనెల 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్సి వైద్యాధికారి అంకం అరుణాదేవి మాట్లాడుతూ క్షయ వ్యాధి గురించి విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు, సిహెచ్ఓ సిహెచ్ మధుసూదన్ రావు, సూపర్వైజర్ లత, ఫార్మసిస్ట్ సత్యవతి, స్టాఫ్ నర్స్ కుమారి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

హాజరుకానున్న 12,282 మంది విద్యార్థులు



- జిల్లాలో 73 పరీక్ష కేంద్రాలు
- విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ

నేటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాధాన్యతను గల పదవ తరగతి పరీక్షలు రేపటి నుండి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. పది పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయి అని, ఈ మైలురాయిని అధిగమించడానికి మీరు ఎంత దృఢంగా నిలబడతారో తదుపరి మీ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధించగలరని ఆయన తెలిపారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు మంచిగా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు.

జిల్లాలో 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు. 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టా ఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మాల్ ప్రాక్టీస్‌ను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్ సర్వీస్‌లు నడిపేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని తద్వారా నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

మనో ధైర్యంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఐటీడీఏ పీవో బి.రాహుల్



భద్రాచలం రూరల్ : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు మనసులో ఎటువంటి భయాందోళనలు పెట్టుకోకుండా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా ఏకాగ్రతతో మనసు పెట్టి ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలు బాగా రాసి ఏ గ్రేడ్‌లో పాస్ కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు మంచిగా రాస్తే మీకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మనస్ఫూర్తిగా బెస్ట్ విషెస్ తెలియజేస్తున్నానని ఆయన తెలిపారు. శుక్రవారం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు విషెస్ తెలియజేస్తూ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే ఈ పరీక్షలు మీరు ప్రశాంతంగా రాసేందుకు సంబంధిత హెచ్ఎం ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు 55, వసతిగృహాలు 21, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు 03, మొత్తం 79 ఇన్స్టిట్యూషన్లలో 2665 మంది 10వ తరగతి గిరిజన విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఇందులో బాలురు 1423, బాలికలు 1242 కలిపి 2665 మంది పిల్లలు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. అందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు విద్యార్థినీ, విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరవేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు బాగా రాసి నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోని ఐటీడీఏల కంటే భద్రాచలం ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలోని నూరు శాతం ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలపాలని ఆయన తెలుపుతూ పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు మనస్ఫూర్తిగా దీవిస్తున్నానని తెలిపారు.

కోటి దాటిన రామయ్య ఆదాయం

- కట్టుదిట్టమైన భద్రత నడుమ రామయ్య హుండీ లెక్కింపు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి హుండీ 42 రోజుల తర్వాత గురువారం కట్టుదిట్టమైన భద్రతా నడుమ సీసీ కెమెరాల పరిరక్షణలో ఆలయ అధికారులు లెక్కించారు. గత నెల ఆరో తారీఖున ఆలయ ఉండి లెక్కించిన విషయం తెలిసిందే. అనంతరం గురువారం రామయ్య ఉండి లెక్కింపు చేపట్టగా రూ.1,14,60,041 నగదు స్వామివారికి భక్తులు చెల్లించుకున్నారు. అంతేకాకుండా 133 గ్రాముల బంగారం, 1262 గ్రాముల వెండిని సీతారాములకు భక్తులు ముడుపుగా చెల్లించారు. వీటితోపాటు స్వామివారికి విదేశీ కరెన్సీ సైతం భారీగానే వచ్చి చేరగా కెనడా 50 డాలర్స్, యూఎస్ 293 డాలర్స్, సింగపూర్ 7 డాలర్స్, పది యూరస్, బ్యాంక్ ఆఫ్ మలేషియా 50, రింగ్ ఇట్స్ నేపాల్ ఐదు, రుపీస్ చైనా 5, యువన్ విదేశీ నగదును భక్తులు హుండీలో సమర్పించుకున్నారు. ఈ మొత్తం నగదును బ్యాంకులో స్వామివారి ఎకౌంట్లో జమ చేసిన అనంతరం ఆలయ ఈవో రమాదేవి మాట్లాడుతూ... గత 42 రోజుల్లో స్వామివారికి గతంతో పోల్చుకుంటే భారీగా ఆదాయం పెరిగిందని అన్నారు. పరీక్షలు నడుస్తున్నప్పటికీ ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ రామయ్యను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తుందని స్పష్టం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జల ప్రసాదంతో పాటు మజ్జిగ కేంద్రాన్ని యాత్రికులకు అందుబాటులో ఉంచామని స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాద అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. వసంత పంచమి నుండి స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను ప్రారంభించామని, నవమి పనులు వడివడిగా కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న శ్రీరామనవమి ఉత్సవాలకు దేశ నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలను సమన్వయం చేస్తూ కలెక్టర్ పర్యవేక్షణలో ఉత్సవ ఏర్పాట్లను నిర్వహిస్తున్నామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్ కుమార్, భవాని, రామకృష్ణ, సీసీ శ్రీనివాసరెడ్డి, తదితర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్

నవ తెలంగాణ-మధిర



నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిమిత్తం మధిర పట్టణం లోని 4 పరీక్షా కేంద్రాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిరిపురం పరీక్షా కేంద్రం నందు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ తెలిపారు. మధిర టౌన్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సీపీఎస్) నందు 180, టీవీఎం ఉన్నత పాఠశాల నందు 230 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 160 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 160 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిరిపురంలో 257 మంది పరీక్ష రాయనున్నారు. మొత్తంగా మధిర మండలం నుంచి 1049 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

అన్ని పరీక్షా కేంద్రాలలో త్రాగునీటి వసతి, ఫర్నిచర్, ఏర్పాట్లు చేస్తూ, వైద్య సిబ్బందిని, పరీక్ష నిర్వహణ సిబ్బందిని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్మెంటల్ ఆఫీసర్స్ గా తోట నరసింహారావు, మురళీమోహన్, డి వెంకటేశ్వర్లు, విజయశ్రీ, సాధు సమాధానం, కొమ్ము శ్రీను, వెంకట్రావమ్మ, స్వప్న, నారాయణ దాస్, వీరయ్య, కస్టోడియన్ ఎస్ కె నాగూర్ వలి, సి సెంటర్ కస్టోడియన్ పోలె సుధాకర్ తదితరులు బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు అందరూ సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి 5 నిముషాల వరకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందని, ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ధరించి రాకూడదని తెలిపారు.



రాష్ట్ర బడ్జెట్‌పై ప్రభుత్వం పున:సమీక్షించాలి

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రాష్ట్ర ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం పున్ణసమీక్షించాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టి, ఎస్సి, బీసీ, మైనారిటీ సంక్షేమానికి నిధులు పెంచాల ఆయన అన్నారు. గురువారం ములకపాడు వైయస్ భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షత జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ....విద్యా, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని కోరారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్లో కేటాయించిన దానికంటే అధిక నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ ప్రజల కలల స్వప్నమైన ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకానికి ఎటువంటి నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని, వెంటనే నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలన్నారు. దీనివలన ఆదివాసి ప్రాంతాలన్నీ సస్యశ్యామలమవుతాయని ఆయన అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోకి ఇప్పుడు బడ్జెట్లో కేటాయించిన నిధులకి పొంతనలేదని ఆయన విమర్శించారు. అసంఘటిత రంగాలైన ఆశా, అంగన్వాడీ వర్కర్లకు వేతనాల పెంపుకు ఎటువంటి ప్రతిపాదన లేవని ఆయన విమర్శించారు. పోడు భూములకు పట్టాలిస్తామన్నారని, అలాగే గిరిజన గూడెం తండాల అభివృద్ధికి 25 లక్షల నిధులు కేటాయింపు చేస్తామన్నారని, దీనికి సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు లేవని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొరసా చిలకమ్మ, శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, కొమరం చంటి, కాక కృష్ణ, సమ్మక్క, పూసం సిల్వ కుమార్, సరియం ప్రసాద్, సోయం పార్వతి, అపకా రంగయ్య రాంబాబు, ఉబ్బ చిన్నారావు, కల్లూరు శ్రీను, పెనుబల్లి ప్రసాద్, కోడి వీరస్వామి, అపక సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం బార్ ఎన్నికల కోలాహలం

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం బార్ అసోసియేషన్‌లో ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. మార్చి 17 నుండి మార్చి వరకు నామినేషన్ల ఘట్టంలో 35 మంది సభ్యులు వివిధ పోస్టులకు నామినేషన్ దాఖలు చేశారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రెటరీ జాయింట్ సెక్రెటరీ, లైబ్రరీ సెక్రెటరీ, ట్రెజరర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ, మహిళా రిప్రజెంటేటివ్‌ల పోస్టులు భర్తీ కానున్నాయి. నేటి వరకు 35. సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 22న విత్ డ్రాస్ అదేరోజు నాలుగు గంటలకు, ఫైనల్ లిస్టు ఐదు గంటలకు బార్ నోటీసు బోర్డుపై పెడతారు. ఈ నెల 27న సభ్యుల భవితవ్యం తేలనున్నది. చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పలువెల గణేష్ బాబు అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్స్ ఎర్రపాటి కృష్ణ, పాల రాజశేఖర్లుగా నిర్వహిస్తారని పలివెల గణేష్ బాబు తెలిపారు.

ముత్యాలమ్మ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు

- పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



మండల పరిధిలోని పార్కెలగండి గ్రామంలో నాభిశిల బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి అమ్మవారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఇదిలా ఉండగా వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు అనేక మంది పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వీర కిషోరం 'భగత్ సింగ్'

- మతోన్మాద శక్తులు వక్రీకరించడం దారుణం
- 'లౌకిక సందేశ్ యాత్ర'ను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఏజే.రమేష్

నవతెలంగాణ-ఇల్లందు



మార్చి 23 వరకు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో వాడ వాడల, గ్రామ గ్రామాన "భగత్ సింగ్ లౌకిక సందేశ్ యాత్ర"ను నిర్వహిస్తున్నమని ఈ యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఏజే.రమేష్ పిలుపు నిచ్చారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో బుగ్గ వాగు దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహం వద్ద విగ్రహానికి పూల మాలవేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భగత్ సింగ్, సుకదేవ్, రాజ్ గురుల వర్ధంతులు మార్చి 23న నిర్వహించి, విప్లవ పోరాట స్ఫూర్తిని, బ్రిటిష్ సామ్రాజ్యం పై దేశ స్వాతంత్ర కోసం నిర్వహించిన పోరాట గాథలను, నేటి ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వం మత సమరస్యాన్ని దెబ్బతీస్తున్న మతోన్మాదనికి వ్యతిరేకంగా ప్రజల్లో లౌకిక భావాన్ని నింపే విధంగా చైతన్యవంతం చేయాలన్నారు. భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజగురులు ఈ దేశ దాస్య శృంకాలాలను తెంచడం కోసం అతి చిన్న వయస్సు లోనే ఉరి కంబాలను ముద్దడుతూ ప్రాణాలు అర్పించ్చారని అన్నారు. జాతీయ ఉద్యమంలో బ్రిటిష్ వారిపై ఎంత కసితో ఉన్నాడో, మతోన్మాదం పై కూడా అంతే కసితో ఉండి మత సామరస్యం కై దేశ ప్రజల ఐక్యతకు కృషి చేసారని అన్నారు. చిన్న నాటి నుండే విప్లవ బావాలని అలవరుచుకొని లెనిన్ రచించిన నవలలు, సాహిత్యాలు చదివాడని ముఖ్యంగా రష్యాన్ సోషలిజంకు ఆకర్షితులు అయ్యారని అసమానతలను రూపుమాపాలంటే కమ్యూనిజం మే అని నమ్మిన విప్లవ వీర కిషోరం భగత్ సింగ్ అని అన్నారు. జైల్లో ఉన్నప్పుడు ఉరి తీసే గంట ముందు కూడా లెనిన్ రచించిన "ఏమి చేయాలి "అనే పుస్తకం చదివి ఉరికంబానికి నవ్వుతు వెళ్లాడని అన్నారు. భగత్ సింగ్ ఒక కమ్యూనిస్ట్‌గా చరిత్రలో నిలిచి పోయాడని అటువంటి భగత్ సింగ్ జీవితాన్ని నేటి మతోన్మాద శక్తులు వక్రీకరించాలని చూస్తున్నారన్నారు. ఆయన మీద మత రంగు పూయడానికి కుట్రలు చేస్తున్నారాని అన్నారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చరిత్రను ప్రజలందరికీ వివరించలనే ఉద్దేశంతో ఇల్లందు మండలంలో భగత్ సింగ్ లౌకిక సందేశ్ యాత్రను నిర్వహిస్తున్నామని అన్నారు. నేటి యువతీ, యువకులు, విద్యార్థులు భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందేశ్ యాత్ర నేటి నుండి మార్చి 23వరకు జరుగుతుందని చివరి రోజున పెద్దాయత్తున ర్యాలీ ఉంటుందని దీనిలో అభ్యుదయ, లౌకిక వాదులందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్ రావు, సుల్తానా, సంధ్య మరియా, మహమూద్, వెంకటమ్మ, సత్యనారాయణ కోరి, వెంకన్న, సంతోష, వెంకన్న, వీరభద్రం, సుజాత, వజ్జ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదిగా దంతాల ఆనంద్

నవతెలంగాణ-ఇల్లందు



మండల లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదిగా స్థానిక సీనియర్ నోటరీ న్యాయవాది దంతాల ఆనందును నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ 199 ప్రకారం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ న్యాయవాదిగా పేద ప్రజలకు సత్వర నాయ సలహాలు, సూచనలు అందించడానికి వీలుంటుంది. గ్రామ, గ్రామాన న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పిస్తుండాలి. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామ, గ్రామాన న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాల పట్ల, కేసులు రాజీపట్ల అవగాహన పెంపొందించాల్సి ఉంటుంది. ఆనంద్ పదవి కాలం రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతుంది. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు అనేక స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తున్న న్యాయవాది ఆనంద్ తన వృత్తిని కొనసాగిస్తూ మండల లీగల్ సర్వీసెస్ సభ్యునిగా ప్రజలకు సత్వర నాయం అందేలా ముందుకు వచ్చినందుకు పలువురు పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా ఆనంద్ తండ్రి గారైన దంతాల బిక్షపతి సింగరేణి సంస్థ నందు కాంట్రాక్టర్‌గా పట్టణంలో పేరు ఉన్న వ్యక్తి. అంతేకాకుండా స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌గా కూడా అనేకమంది పేద ప్రజలకు సహాయ, సహకారాలు అందించి సింగరేణి సంస్థ నందు సుమారు 95 మందికి ఉద్యోగ అవకాశాలు ఇప్పించారు.

మనోధైర్యంతో పరీక్షలు రాయాలి

- కెమిస్ట్రీ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యదర్శి చల్లగుల్ల నాగేశ్వరరావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



నేటి నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఒత్తిడికి లోను కాకుండా నిర్భయంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి చల్లగుల్ల నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు పత్రిక ప్రకటన ద్వారా నాగేశ్వరరావు పలు సూచనలు విద్యార్థులకు చేశారు. సమయపాలన పాటించి నిర్దేశించిన సమయానికి పరీక్ష హాలుకి చేరుకోవాలని పరీక్షల సమయంలో రాత్రి ఎక్కువ సేపు చదువుతూ నిద్రలకుండా గడపటం అంత శ్రేయస్సు కారం కాదని నాగేశ్వరరావు తెలిపారు. పరీక్షల సమయంలో సులభంగా జీర్ణమి ఆహారాన్ని తీసుకోవాలని జంక్ ఫుడ్ల జోలికి విద్యార్థులు అస్సలు వెళ్లకూడదని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. విద్యార్థులు మానసిక ఆందోళన గురి కాకుండా మనోధైర్యంతో పరీక్షలు రాస్తే ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు.



కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం నిర్వహిస్తాం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాట నిర్వహిస్తామని గుర్తింపు సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీ నందు పిట్ మీటింగ్‌లో రాష్ట్ర ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం, టీబీజీకేస్ యూనియన్ సింగరేణి సంస్థ అభివృద్ధి, కొత్త బావుల ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడం వలన సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్ధకంగా ఉందని తెలియజేశారు. రానున్న పది సంవత్సరాలలో ఉన్న బావుల జీవితకాలం ముగిసిపోనుందని సంస్థలో పనిచేస్తున్న కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్ధకం అయ్యే పరిస్థితి నెలకొందని తెలిపారు. కొత్తగూడెంలోని వీకే ఓసీ, ఇల్లందులో జేకే ఓసీలలో ఓబితో పాటు బొగ్గును తీయడానికి ప్రయివేటు వారికి అప్పజెప్పడానికి టెండర్లు పిలిచారని ఏఐటీయూసీగా ఈ టెండర్లను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సింగరేణి ఓసీలలో బొగ్గు తీసే ప్రక్రియ సింగరేణి కార్మికులతో జరగాలని అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండా యూనియన్ ఏఐటీయూసీగా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి సంస్థలో రెండు బొగ్గు బ్లాక్‌లు కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్లు మోడీ ప్రభుత్వం తీసుకొని వచ్చిన ఎన్ఎండిఆర్ బిల్లుకు బీఆర్ఎస్ ఎంపీలు అనుకూలంగా ఓటు వేయడం వలన వేలం పాటలో వాటిని ప్రయివేట్ వారికి అప్పచెప్పారని, వాటిని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశం తెలంగాణలోని అత్యంత పెద్ద ఇండస్ట్రీ అయిన సింగరేణికి కొత్త బొగ్గు బావులు కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని ఏఐటియుసి అగ్రనాయకత్వం కలవడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బకాయిలు రూ.33000 కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం కేసీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులను వ్యక్తిగతంగా కలుసుకొని వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళా కార్మికులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసీహెచ్‌పీ డీజీఎం వి.మదన్ నాయక్ కలుసుకొని కార్మికుల సమస్యలు పరిష్కారం పట్ల చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రాం నర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ జి.పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, గోలి గంగాధర్ రావు, శనిగరపు కుమారస్వామి, ఆడెపు రాజశేఖర్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ దాట్ల సందీప్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ మిట్టపల్లి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఉడత శివకృష్ణ, జనరల్ షిఫ్ట్ ఇంచార్జ్ ఎం.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండ సంతోషంగా పరీక్షలు రాయండి

నవతెలంగాణ-ఇల్లందు

పదవ తరగతి పరీక్షలో ఎటువంటి ఒత్తిడికి గురికాకుండ సంతోషంగా పరీక్షలు రాయాలని ఏటీవో రమణయ్య, జీసీడీఓ అలివేలి మంగతాయా, ఏటీడీఓ రాధమ్మ అన్నారు. మండలంలోని ఏజీహెచ్ఎస్ రొంపేడ్ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో సంభాషించారు. ఈ సంభాషణలో భాగంగా పదవ తరగతి పరీక్షలో ఎటువంటి మెలుకువలు, జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలను క్లుప్తంగా వివరించారు. భయపడకుండా పరీక్షలు రాయాలన్నారు. ఎటువంటి ఒత్తిడికి గురికావద్దని అన్నారు. పాఠశాల హెచ్ఎం పద్మ మాట్లాడారు. డిప్యూటీ వార్డెన్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అందరూ కూడా విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ సబ్జెక్టుల లో 100% ఉత్తీర్ణత సాధిస్తాం అని తెలియపరిచారు.

నవతెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

8

శుక్రవారం | మార్చి 21, 2025 | www.navatelangana.com

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించటం హర్షనీయం

● ఓబీసీ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ



నవతెలంగాణ-కొణిజర్ల

రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి సహెూపేతమైన నిర్ణయమని ఆపార్టీ ఓబీసి మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో బీసీలు అత్యధికంగా ఉన్నప్పటికీ సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకంజలో ఉన్నారని గత పాలకులు ఓట్లు రాజకీయం చేసి బీసీలను మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన చేసి బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు పోరాటం చేస్తున్న అన్ని బీసీ సంఘాల సమిష్టి కృషితో సాధించిన విజయమని బీసీల హక్కుల కోసం కృషి చేస్తున్న వారందరికీ ఇది గర్వకారణమన్నారు. బిల్లు ద్వారా స్థానిక సంస్థలు, విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు అవకాశాలు ఎక్కువగా వస్తాయన్నారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బీసీ రిజర్వేషన్ బిల్లుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ఉప సంఘం చైర్మన్ ఉత్తమ కుమార్ రెడ్డి,వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందరినీ సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకొనిపోతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వివిధ శాఖల మంత్రులు, సహకరించిన ఎమ్మెల్యేలందరికీ మండల ఓబీసీ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రామకృష్ణ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ఈ.రతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గుతండకు చెందిన అజ్మీరా మోహన్ (47) మద్యానికి బానిసయ్యాడు. తరచుగా మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్య రాధ అతడిని మద్యం తాగొద్దని మందలించింది. దాంతో మనస్తాపానికి గురైన మోహన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని తెలిపారు. మృతునికి ఇద్దరు వివాహితులైన కూతుళ్ళు ఉన్నారు.

వృద్ధులు, వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

యశోద పరివర్తన ఫౌండేషన్ సేవ సమితి నిర్వహణలో వృద్ధులు, వికలాంగులకు నిత్యవసర వస్తువులు బియ్యం, కందిపప్పు, కూరగాయలు తదితర నిత్యావసరాలు రాష్ట్ర విశ్రాంత ఉద్యోగులు సంఘం తరుపున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు భూషణ్ రావు మాట్లాడుతూ.. యశోద ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సుబ్బరాజు, హనుమంత రావు, తులసీదాస్, సత్యనారాయణ, మనికుమారి, రాయల రవి, యశోద ఫౌండేషన్ తరపున మేకల లత పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందని మాలలు

● మాల మహానాడు ఆధ్వర్యంలో భారీ నిరసన

నవతెలంగాణ-మణుగూరు

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల అవుతున్నా మాలలు ఆర్థికంగా అభివృద్ధి చెందలేదని, ఇంకా గ్రామీణ ప్రాంతాలలో వివక్షతకు, లైంగిక దాడులకు గురవుతున్నారని మాల మహానాడు మండల అధ్యక్షులు వేరుపులు నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం అంబేద్కర్ సెంటర్ లో భారీ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 అంబేద్కర్ వాదులకు చీకటి రోజు అని, వర్గీకరణ ద్వారా మాలను పూర్తిగా అణిచివేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో బుద్ధి చెబుతాం అన్నారు. ఈ సమావేశంలో మణుగూరు మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బురుగుల సతీష్, వర్కింగ్ అధ్యక్షులు వేల్పుల సురేష్, దాసరి వెంకట్ ఉపాధ్యక్షులు బూరుగుల సంజీవరావు, ముల్క నరేష్, సహాయ కార్యదర్శి వేమూరి రవి, పప్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

కెపాసిటర్లు ఏర్పాటు

నవతెలంగాణ-చంద్రుగొండ

11 కేవీ లైన్లో నష్టాలను తగ్గించి రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వడం కోసం మండల పరిధిలోని 6 ప్రాంతాలలో 600 కేవీఏఆర్ కెపాసిటర్లను వెంకట్యతండ, గానుగపాడు, రేపల్లెవాడ, రవికంపాడు, బెండాలపాడు, సీతాయిగూడెం గ్రామాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ రవికుమార్, ఏఈ నరసింహారావు, సబ్ ఇంజనీర్ నితిన్, ఎస్ఎల్ఐ, ఎల్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందు క్రాస్ రోడ్డులో ఠాను నాయక్ విగ్రహం పెట్టాలి

● రమేష్ రాథోడ్, భద్రు నాయక్

● ఘనంగా ఠాను నాయక్ వర్ధంతి

నవతెలంగాణ-పాల్వంచ

ఇల్లందు క్రాస్ రోడ్డులో ఠాను నాయక్ విగ్రహం పెట్టాలని జాటోత్ ఠాను నాయక్ జంక్షన్ గా నామకరణం చేయాలని గుగులోత్ భద్రు నాయక్, రమేష్ రాథోడ్ కోరారు. గురువారం పట్టణ పరిధిలో మైనింగ్ కాలేజ్ ఎదురుగా జాటోత్ ఠాను నాయక్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఠాను నాయక్ ఫొటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జాటోతు ఠాను నాయక్ తెలంగాణ గిరిజన ఉద్యమ నాయకుడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిష్టు పార్టీకి నాయకత్వం వహించిన యుద్ధ వీరుడుఅనీ రమేష్ రాథోడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మాసోత్ ఉపేందర్, అనిల్ ఇస్లావత్, రామకృష్ణ, మాలోత్ చందు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులుగా నిజాయితీ.. క్రమశిక్షణ.. నిబద్ధతతో పని చేయాలి

కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జీఎం పర్సనల్ కవితా నాయుడు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థలో ఉద్యోగులుగా పనిచేసినంత కాలం నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలని సింగరేణి జీఎం పర్సనల్ ఐఆర్, పిఎం అండ్ వెల్ఫేర్ కవితా నాయుడు అన్నారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కవితా నాయుడు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం పొందటం చాలా అదృష్టమని, నీతి నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో ఎల్లప్పుడు రక్షణ సూత్రాలు పాటిస్తూ, విధులకు గైర్హాజరు కాకుండా సంస్థ అభివృద్ధికి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రములో ఏజీఎం (పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, గుర్తింపు సంఘం (ఏఐటిసయూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్టియూసి) వైస్ ప్రెసిడెంట్ పితాంబర రావు, డివై.పిఎం బి.సుశీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు

● మండల వ్యవసాయ అధికారి బి.రాజేశ్వరి

నవతెలంగాణ-కొత్తగూడెం

వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి రైతులకు సబ్సిడీపై అందజేస్తామని చుంచుపల్లి మండల వ్యవసాయ అధికారి బి.రాజేశ్వరి తెలిపారు. ఈ పథకంలో కేవలం మహిళా రైతులకు మాత్రమే సబ్సిడీలో యంత్ర పరికరాలు అందించడం జరుగుతుందని ఏఓ చెప్పారు. చివరి తేది ఈనెల 21అని తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు-3 యూనిట్లు ఉన్నాయని, సబ్సిడీ రూ.1000లని, పవర్ స్ప్రేయర్లు-3 యూనిట్లు, సబ్సిడీ రూ.9000లు, ట్రాక్టర్ పనిముట్లు-2 యూనిట్లు ఉన్నాయి. సబ్సిడీ రూ. 19,400లు, రోటవేటర్-1 యూనిట్ కలదని, సబ్సిడీ రూ.48,000లని, పవర్ టిల్లర్-1యూనిట్, సబ్సిడీ రూ.1,00,000లని తెలిపారు. యంత్ర పరికరాలను సబ్సిడీపై పొందుటకు ఆసక్తి గల రైతులు అప్లికేషన్ ఫామ్, ఇతర వివరాలు కొరకు చుంచుపల్లి రైతు వేదిక కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

సునీత విలియమ్స్‌కి జై..జైలు



నవతెలంగాణ-కొత్తగూడెం

అంతరిక్షంలో 9 నెలల పాటు ఉండి సురక్షితంగా భూమికి చేరుకున్న సునీత విలియమ్స్‌కి జై..జైలని, మహిళలోకానికి ఆదర్శమని గాంధీపథం కన్వీనర్ చింతలచెరువు గెర్షోం అన్నారు. గురువారం కొత్తగూడెంలోని గిరిజన బాలికల హాస్టల్‌లో సునీత విలియమ్స్ భూమిపైకి చేరుకున్న సందర్భంగా సంబరాలు చేశారు. ఈ సందర్భంగా గెర్షోం మాట్లాడుతూ సునీతా విలియం చదువు నిమిత్తం అమెరికాకు వెళ్లారని, అనంతరం అంతరిక్షంలో 209 రోజులు ఉండి, ధైర్యంగా, పట్టుదలతో ప్రపంచ మహిళాలోకానికి మార్గదర్శకురాలుగా నిలిచారని కీర్తించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు సీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతల చెరువు ఎర్నెస్ట్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

● 741 మందికి 728 మంది హాజరు

● 13 మంది డుమ్మా..

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ నెల 5న ప్రారంభమయిన పరీక్షలు గురువారంతో ముగిసాయి. దీంతో ఈ ఏడాది ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. అశ్వారావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముస్లిం మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల, వీకేడీవీఎస్ రాజు, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో ఈ మూడు కళాశాలతో పాటు దమ్మపేట మండలంలోని మందలపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, దమ్మపేటలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల, అంకంపాలెం గిరిజన సంక్షేమ శాఖ బాలికల కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

ఈ మూడు కేంద్రాల్లో ఆరు కళాశాలలు నుండి

ద్వితీయ సంవత్సరం రసాయనిక శాస్త్రం, కామర్స్, వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 741 మందికి 728 మంది హాజరయ్యారు. 13 మంది పరీక్షలకు డుమ్మా కొట్టారు. ఆయా పరీక్షల కేంద్రాలకు సీఎస్ (చీఫ్ సూపరింటెండెంట్), డీఓ(డిపార్ట్ మెంట్ ఆఫీసర్), కస్టోడియన్ లుగా అల్లు అనిత, జెడ్.ఉషా రత్నం, కే.రవీంద్రబాబు, ఎం.ఝాన్సీ లక్ష్మి, బి.సంగీత, బి.కుమారస్వామి, డి.నరసింహారావు లు విధులు నిర్వహించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఈసీ చైర్మన్,డీఐఈఓ హెచ్.వెంకటేశ్వరరావు మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసారు

కళాశాల	ఎలాట్మెంట్	ప్రెసెంట్	ఆబ్సెంట్
జీజేసీ	307	300	07
టీఎంఆర్	140	137	03
వీకేడీవీఎస్	294	291	03
మొత్తం	741	728	13

రోజువారీ హాజరు వివరాలు

తేదీ	మొత్తం	హాజరు	ఆబ్సెంట్
6/03/25	767	757	10
10/03/25	772	761	11
12/03/25	808	796	12
15/03/25	647	642	05
18/03/25	793	779	14
20/03/25	741	728	13



మర్కోడు జీసీసీని తనిఖీ చేసిన డీటీ

● కేసు నమోదు



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండలంలోని మర్కోడు గ్రామం జీసీసీని ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఇల్లందు సివిల్ సప్లై డీటీ యాకుబ్ పాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో మర్కోడు గ్రామస్తులు జీసీసీ సెల్స్ మెన్ రామకృష్ణ విధులకు సక్రమంగా రావట్లేదని ఫిర్యాదు చేశారన్నారు. అందులో భాగంగా బుధవారం మర్కోడు జీసీసీని తనిఖీ చేయడానికి సేల్స్ మెన్ రామకష్ణ కు ముందస్తుగా సమాచారం ఇచ్చామని, అయినా గాని జీసీసీకి సేల్స్ మెన్ రామకృష్ణ రాలేదన్నారు. దాంతో ఇల్లందు జీసీసీ మేనేజర్ ఎన్.నరసింహారావు, ప్రజల సమక్షంలో జీసీసీ తాళాలు పగులగొట్టి దుకాణం తెరవడం జరిగిందన్నారు. జీసీసీలోని ఈ-పాస్ యంత్రంలోని స్టాక్ రిపోర్టును పరిశీలించామని చెప్పారు. దానిలో సుమారు 41 క్వింటాళ్ల బియ్యం లెక్కలు లేవని నిర్ధారణకు వచ్చామని అన్నారు. డీలర్ 2500 రేషన్ కార్డులకు గాను 800 కార్డులను మాత్రమే ఈ-పాస్ చేస్తున్నారని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలన చేసి, దుకాణాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. 6ఏ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు డీటీ పేర్కొన్నారు. తాత్కాలికంగా రాఘవాపురం గ్రామానికి చెందిన సేల్స్ మెన్ పూనెం లక్ష్మయ్య మర్కోడు జీసీసీ బాధ్యతలు ఇచ్చారు. ఈ తనిఖిలో డీటీ, మేనేజర్ వెంట ఇల్లందు జీసీసీ అకౌంటెంట్ ఎం.భూషయ్య, ఆళ్ళపల్లి జీసీసీ సేల్స్ మెన్ జి.చెన్నయ్య ఉన్నారు.

ఇండ్ల స్థలాల కోసం కదం తొక్కిన విలేకరులు

● మద్దతు తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం జర్నలిస్టులకు కేటాయించిన స్థలం వెంటనే పంపకాలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలోని గంగా బీషన్ బస్తీ రైతు వేదిక సమీపంలో జర్నలిస్టులకు గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని జర్నలిస్టులకు అప్పగించాలని ఇళ్లస్థలాల పోరాట ఉద్యమం ప్రారంభమైంది. గురువారం వర్కింగ్ జర్నలిస్టులు తమ పోరాటాన్ని కొనసాగించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం కేటాయించి స్థలంలో టెంటు వేసుకుని ఆందోళన చేపట్టారు. జర్నలిస్ట్ ఇండ్ల స్థలాల కోసం నిరసన దీక్ష చేస్తున్న జర్నలిస్ట్‌లకు పలువురు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్స్ నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

సంఘీభావం...

జర్నలిస్టుల ఆందోళనకు సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ మద్దతు తెలిపింది. అర్హులైన జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని దీక్షలు చేస్తున్న జర్నలిస్టుల టెంటు వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి పెద్ద బోయిన సతీష్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీయుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు వై.గోపాలరావు. ఏఐయుకెఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బానోతు ధర్మ, టియుసిఐ జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ సంఘీభావం తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పాయం

నవతెలంగాణ-మణుగూరు

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు మణుగూరు మండలానికి చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.11,38,000 లక్షల విలువ గల చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళ మండల అధ్యక్షులు సౌజన్య, మణుగూరు శివాలయం గుడి చైర్మెన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

50 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 9 సీసీ రోడ్లకు శంకుస్థాపన

మణుగూరు మండలం ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ముత్యాలమ్మ నగర్, సంతోష్ నగర్‌లో 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 9 సిసి రోడ్లను ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముత్యాలమ్మ నగర్ లో నూతనంగా నిర్మించిన అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సీడీపీఓ జయలక్ష్మి, ఎంఈఓ నాగజ్యోతి, ఐటీడీఏ డిఈ మధుకర్, ఏఈ ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళ మండల అధ్యక్షులు సౌజన్య, మణుగూరు శివాలయం గుడి చైర్మెన్ కూచిపూడి బాబు పాల్గొన్నారు.



కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు మణుగూరు మండలానికి చెందిన 39 మందికి 39,04524 విలువ గల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యేం పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు.

కుష్ఠువ్యాధిని తరిమికొట్టాలి



జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్

నవతెలంగాణ-కొత్తగూడెం

కుష్టు వ్యాధిని సమాజం నుండి తీసివేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరంలో రెండు సార్లు లెప్రసీ కేసెస్ డిటెక్షన్ కాంపెయిన్‌ను 2017 నుండి దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుంది. దీనిలో భాగంగ ఆశా కార్య కర్తలు మార్చ్ 17 నుండి 30 వరకు 14 రోజులు ప్రతీ ఇంటిని సందర్శించి ఇంటిలో వారందరినీ క్షుణ్ణంగా వారి శరీరాన్ని పరిశీలిస్తున్నారు. శరీరంపై నుండి కింది వరకు శరీరంపై ఏటువంటి మచ్చలున్న పరీక్షించడం జరుగుతుంది. మన జిల్లాలో ఇంటింటి ఎల్ఎసిడిసి సర్వే కోసం 1409 బృందాలు, ఏఎన్ఎం సూపర్వైజర్ స్టాఫ్ 331, పర్యవేక్షణ అధికారులు (డిపిఎంఒ)లు ఆరుగురు, జిల్లాలోని వైద్యాధికారులను ఏర్పాటు చేయడం జరిగింది. ఆశా వర్కర్ల బృందం పట్టణ ప్రాంతంలో అయితే రోజుకి 50 ఇండ్లను, గ్రామీణ ప్రాంతం అయితే 20 నుండి 30 ఇండ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. ఈ సర్వేను మెడికల్ ఆఫీసర్లు సూపర్వైజర్లు ప్రోగ్రాం అధికారులతో పాటు ఏఎన్ఎంలు పర్యవేక్షించనున్నారు. సర్వేలో భాగంగా కుటుంబంలోని ప్రతి ఒక్కరిని పూర్తిగా శరీరాన్ని పరిశీలించి ఎర్రని మచ్చలు, రాగి వర్ణంలో గల స్పర్శ లేని మచ్చలు, నరాల బలహీనత ఉందా..? లేదా...? కాళ్లల్లో చేతులలో తిమ్మిర్లు, బొబ్బలు ఉన్న వారిని కుష్టి వ్యాధి లక్షణాలుగా భావించి దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తున్నారు. జిల్లాలో ఫిబ్రవరి ముగిసే నాటికి మొత్తం కుష్టి వ్యాధి గ్రస్తులుగా మందులు వాడుతున్నటువంటి వ్యక్తుల సంఖ్య 47 ఉన్నాయి. అంగవైకల్యం కలిగిన వారి సంఖ్య (డిఫార్మిటీ కేసెస్) మొత్తం 141 మంది వ్యక్తులు ఉన్నారు. గత ఎల్సిడిసిలో 22-23లో 38 కొత్త కేసులను కనుగొనడం జరిగింది. 2023-24లో 36 కొత్త కేసులను నిర్ధారించి మందులు ఇచ్చామన్నారు. 2024-25లో ఎల్సిడిసి ప్రోగ్రాంలో 25 కొత్త కేసులను కనుగోన్నామన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్నటువంటి ఎల్సిడిసి సర్వేలో 1409 మంది టీమ్స్ పాల్గొని 26,960 గృహాలను సందర్శించి దీనిలో భాగంగా 463503 మందిని పరీక్షించగా వీరిలో 1015 మంది వ్యక్తులను అనుమానిత వ్యక్తులుగా గుర్తించామన్నారు. ఫిజియోథెరపీ భద్రు, పాయం శ్రీనివాస్, డెమో ఫయాజ్, ఆశా వర్కర్లు పాల్గొంటున్నారు.

కొత్తగూడెం బస్ స్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలి



● న్యూడెమోక్రసీ ధర్నా

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బస్టాండ్ ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగూడెం బస్టాండు పాతకాలం నాటిదని, ప్రస్తుతం శిథిలావ్యవస్థకు చేరుకుందని, వర్షం వస్తే మొత్తం కురుస్తుందని, సీలింగ్ సిమెంట్ ఊడి పెచ్చులుగా పడుతుందని, ఫ్లోరింగ్ పగిలిపోయి కూర్చోడానికి వీలు లేకుండా పోయిందని చెప్పారు. ప్రయాణికులు కూర్చోవడానికి బల్లాలు కూడా సరిపోవడం లేదని, ప్రయాణికులు తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా లేదని ఆరోపించారు. వేలాది మంది ప్రతి రోజు ఈ బస్టాండ్ మీదుగా వచ్చి పోతుంటే నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం డిపో మేనేజర్‌కి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకురాలు బూరుగడ్డ వెంకటమ్మ, ఇఫ్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. సంజీవ్, కోశాదీకారి మోత్కూరి మల్లికార్జునరావు, జిల్లా నాయకులు వి.సురేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్యామ్, ప్రణయ్ కుమార్ వివిధ ప్రజా సంఘాల నాయకులు ఏ వెంకన్న, పాల్గొన్నారు.

పొలం వివాదంపై ఇరు వర్గాలు ఘర్షణ

● ఇరువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు

● పెద్ద మనుషులుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులకు దేహశుద్ధి..?

నవతెలంగాణ - బోనకల్

ఈ భూమి తమది అంటే తమదని ఇరువర్గాలు బుధవారం ఘర్షణ పడ్డారు. ఇరు వర్గాల వారు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఒక వర్గానికి పెద్ద మనుషులుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులకు సైతం దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లక్ష్మీపురం రెవిన్యూ పరిధిలో చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన వారికి వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి గత కొన్ని ఏళ్ళ క్రితం పాతర్లపాడు గ్రామానికి చెందిన వారికే విక్రయించారు. ఆయన కొంతకాలం క్రితం మృతి చెందాడు. కొనుగోలు చేసిన వారు ఆ పొలంలో ఇటీవల నుంచి మట్టి తోలకాలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో మృతినికి సంబంధించిన వారు తమకు పాస్ పుస్తకాలు ఉన్నాయని, ఈ పొలం తమదేనంటూ పొలం వద్దకు వెళ్లారు. ఇందులో ఓ సామాజిక వర్గానికి మద్దతుగా బోనకల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్ద మనుషులుగా వెళ్లారు. ఇరు వర్గాల మధ్య వాదోప వాదనలు సాగుతున్నాయి. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఒకరిపై మరొకరు దాడులకు దిగారు. ఒక వర్గానికి పెద్ద మనుషులుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులకు కూడా మరొక వర్గం దేహశుద్ధి చేసినట్టు తెలిసింది. ఒక వర్గానికి చెందిన మహిళలు సుమారు 100 మంది దాకా ఉండగా మరొక వర్గానికి చెందిన మహిళలు 15 నుంచి 20 మంది మాత్రమే ఉన్నట్లు సమాచారం. పెద్ద మనుషులకు మహిళలు దేహశుద్ధి చేసినట్లు గురువారం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ప్రచారం జరగటంతో ఈ సంఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇరు వర్గాలు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను వివరణ కోరగా పాతర్లపాడుకు చెందిన ఇరువర్గాల వారు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని తెలిపారు. ఇరు వర్గాలకు చెందిన వారిలో కొంతమంది స్వల్పంగా గాయపడినట్లు వారిని వైద్య చికిత్స నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు


● పరీక్షలు రాయనున్న 860 మంది విద్యార్థులు

నవతెలంగాణ-దమ్మపేట

మండలంలో శుక్రవారం నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలో టెన్త్ విద్యార్థిని, విద్యార్థులు అధికారులు ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాలలో 860 మంది పరీక్షలు రాయనున్నారు. వీటిలో దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల, అంకంపాలెం గిరిజన గురుకుల బాలికల పాఠశాల, నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మందలపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాలలో పరీక్ష సెంటర్లు కొనసాగనున్నాయి. ఐదు పరీక్షా కేంద్రాల వద్ద 75 మంది సిబ్బందిని నియమిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం గట్టయ్య సెంటర్ రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం రోటరీ సర్వీస్ సెంటర్ లో 60 మంది దివ్యాంగులకు గురువారం ఉచితంగా కృత్రిమ పాదాలను పంపిణీ చేశారు . దీనికి అమెరికాలోనే ఏకం సంస్థ వారు 2,61,000 వేల రూపాయలను సహాయంగా అందించారు. కృత్రిమ పాదాలతో పాటు బూట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవి మల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు, మహేశ్వరి గోల్డ్ అధినేత అరవపల్లి అశోక్ హాజరై మాట్లాడుతూ.. రోటరీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లాది వాసుదేవ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు నల్లమోతు రవీంద్రనాథ్, కార్యదర్శి దొడ్డపనేని సాంబశివరావు, కో ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు, ఏజి భూషణ్ రావు, మేకల బిక్షమయ్య, నాగేశ్వరరావు, సుధాకర్ , ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

23న గ్రామాలలో విస్తృతంగా గ్రామ సభలు

నవతెలంగాణ-టేకులపల్లి

దేశం కోసం ప్రాణాలు అర్పించిన విప్లవకారులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో విస్తృతంగా సభలు, కాగడాల ప్రదర్శనలు నిర్వహించాలని యువతరానికి పివైఎల్ మండల కార్యదర్శి తోటకూరి సతీష్ పిలుపునిచ్చారు. ప్రగతిశీల యువజన సంఘం టేకులపల్లి మండల కమిటీ సమావేశం కోడెం రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టేకులపల్లి మండల కార్యదర్శి తోటకూరి సతీష్ మాట్లాడుతూ పివైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో కాగడాలు, కొవ్వొత్తులతో ప్రదర్శనలు, గ్రూప్, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలన్నారు. ఈనెల 23న భగత్ సింగ్, రాజ్ గురువు, సుఖ దేవ్ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్నామని, యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భూక్య లక్ష్మణ్, పూనేం సమ్మయ్య, జార్జి, రామ, గవాస్కర్, బాబు లాల్, బాలాజీ, రమేష్, కొటేష్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్య మరణం వారి కుటుంబానికి తీరని లోటు

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామారావు పేట గ్రామానికి చెందిన వర్స చైతన్య మృతి వారి కుటుంబానికి తీరని లోటు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. చైతన్య మృతదేహాన్ని గురువారం ఆయన సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆదివాసీ నిరుపేద కుటుంబానికి చెందిన తండ్రి వర్సా చిన్న వీరస్వామి, తల్లి రాధా దంపతుల రెండో కుమారుడు వర్సా చైతన్య దొర బుధవారం ఉదయం బూర్గంపాడు మండలం మణుగూరు క్రాస్ రోడ్ రాంపురం గ్రామంలో ఇసుక లారీ అతి వేగంగా ఢీకొన్న సంఘటనలో చైతన్య అక్కడికి అక్కడే మృతి చెందడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, సంబంధిత లారీ యాజమాన్యం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇసుక లారీలు వలన అనేకమంది ప్రజలు చనిపోతున్నారని, అతివేగంగా వెళ్లడం మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంత చెప్పినా మార్పు రావడంలేదని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సూచించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, సోడి రాంబాబు, మాజీ సర్పంచ్‌లు వరస చిన్నారావు, వరస శివరామకృష్ణ, వరస పెద్ద వీరస్వామి, కారం వెంకటేశ్వర్లు, వీరస్వామి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు లయన్స్ క్లబ్ చేయూత



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోలిపోయిన ఎట్టపాక మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన ధారా వెంకటేశ్వర్లు, కాటూరి నరసమ్మ కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో నక్క వెంకన్న సిద్ధారెడ్డిల సౌజన్యంతో నిత్యావసర వస్తువులను గురువారం అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షులు చిట్టినీడు రామలింగేశ్వర రావు మాట్లాడుతూ... తోటపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై రెండు పూరీలులు పూర్తిగా దగ్ధం అయిపోవడంతో ఆ రెండు కుటుంబాలు నిస్సహాయ స్థితికి చేరుకున్నాయని అన్నారు. సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో ప్రముఖులైన నక్క వెంకన్న సిద్ధారెడ్డిలు వెంటనే స్పందించి రెండు కుటుంబాలకు సరిపోయే నిత్యావసర వస్తువులను అందించడం అభినందనీయమని అన్నారు. ఆపదలో ఉన్న తోటి వారికి సహాయం చేయడమే క్లబ్ ప్రధాన లక్ష్యం అని, దానికి అనుగుణంగానే అవసరం ఉన్న వరకు సహాయ, సహకారాలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొనగా నక్క వెంకన్న సిద్ధారెడ్డి చేతుల మీదుగా బాధితులకు కిట్లను అందించారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి



నవతెలంగాణ-చంద్రుగొండ

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థినీ, విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్షి తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షలు మంచిగా వ్రాయాలని, కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మీ పాఠశాలలకు, మీ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసి మంచి ఫలితాలు సాధించాలి అని మనస్ఫూర్తిగా కోరారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాం

- తహసీల్దార్ అద్దంకి నరేష్



నవతెలంగాణ-పినపాక

పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని తహసీల్దార్ అద్దంకి నరేష్ తెలిపారు. గురువారం పదవ తరగతి పరీక్షలు నిర్వహించే మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఐలాపురంలో గల ఎజీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సూచించారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, వైద్యం, ఫర్నిచర్ సౌకర్యాలు కల్పించాం అని తెలిపారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ గణేష్, సర్వేయర్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ లైజనింగ్ అధికారిగా వీరభద్రరావు నియామకం



నవతెలంగాణ-మణుగూరు

అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీతి, నిజాయితీ, నిబద్ధత సంస్థ, కార్మికుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి క్రమశిక్షణ, పట్టుదల గల అధికారి పి.వీరభద్రరావును మణుగూరు ఏరియా బీసీ లైజనింగ్ అధికారిగా నియమిస్తూ సింగరేణి సీఎండీ బలరాం ఉత్తర్వులు జారీచేయడం అభినందనీయమైన అంశం అని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు తెలిపారు. టీబీజీకేఎస్ నాయకులు ఆయనను శాలువాతో పూల మొక్క అందించి మిఠాయి ద్వారా శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగేల నాగేశ్వర రావు, కళ్యాణ్ కుమార్, గౌడ కుమార స్వామి, నాగరాజు, రేవన్, దుర్గ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌ను సవరించాలి : కేవీపీఎస్



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించిందని, బడ్జెట్‌ను వెంటనే సవరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ మండలంలోని నాయుడుపేట గ్రామంలో గురువారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో 18 శాతం ఉన్న దళితులకు ప్రతి ఏటా అంకెలు పెంచుతూ ఖర్చు మాత్రం తగ్గిస్తున్నారని ఎస్సీ సబ్ ప్లాన్ నిధులపై ప్రత్యేకంగా చర్యలు తీసుకొని ఖర్చు చేయాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్లో 30% కేటాయించాలని ఉన్న, 7.57 శాతానికి పరిమితం చేసి బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. బడ్జెట్ ను సవరించి దళిత,గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరేంపుల ఉప్పలయ్య, పగిడిపల్లి వెంకట్రావు, మండల నాయకులు నూకల బాలరాజు, మిరియాల సారయ్య, వెలుతురు రామనాథం, ఐలపోగు విజయకుమార్, కోలిచలం నాగేశ్వరరావు, మునగాల నాగయ్య, నందిపాటి లక్ష్మయ్య, పడిశాల రాములు, ఎల్.సైదులు, వెలుతురు పుల్లారావు, కొట్టే రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటకు రానున్న మరో పెట్రోల్ బంక్



నవతెలంగాణ-దమ్మపేట

మండల కేంద్రం దమ్మపేటకు మరొక పెట్రోల్ బంక్ రానున్నట్లు తెలుస్తోంది. దమ్మపేట ఆర్‌టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్ బంక్ నిర్మాణంకు అనుమతులు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే బంక్ నిర్మాణంకు ఉపయోగించే ఆయిల్ నిల్వ చేసే ట్యాంక్‌ను బస్టాండ్ ప్రాంగణంలోని బంక్ నిర్మాణం జరిగే ప్రాంతానికి తీసుకురావడం జరిగింది. బంక్ నిర్మాణంకు కావల్సిన ఎన్ఓసీ అనుమతులు కూడా వచ్చాయని ఇందులో భాగంగానే ఆర్‌టీసీ వారు టెండర్‌ల ద్వారా అద్దెకు ఇచ్చిన షాపులను సైతం తొలగించడానికి షాప్ యజమానులకు కూడా తెలిపినట్లు సమాచారం. దమ్మపేటకు మరో పెట్రోల్ బంక్ రానున్న నేపథ్యంలో దమ్మపేట వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో బంక్ ఏర్పాటుతో ఆర్‌టిసికి అదనంగా ఆదాయం రానుంది.

దారి దశ మారేది ఎన్నడో...



తూరుబాక వద్ద డైవర్షన్ రహదారితో నిత్యం ప్రమాదాలు

అధ్వానంగా భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి

- బీటీ రహదారి గుంతలలో మట్టి పోస్తూ 'మమ' అనిపిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల దివ్య క్షేత్రానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి దివ్య క్షేత్రం దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం. ఈ ఆలయం భద్రాచల రామాలయానికి 35 కి.మీ దూరంలో ఉంటుంది. ఈ ఆలయానికి దేశంలోనే వివిధ రాష్ట్రాల నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాల ద్వారా ఇక్కడికి వస్తుంటారు. భద్రాచలం నుండి పర్ణశాల వెళ్లే రహదారి మార్గంలో సుమారు 11 కిమీ ఏపీ పరిధిలో ఉండగా, మరో 24 కి.మీ తెలంగాణ పరిధిలోకి వస్తుంది. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏపీ పరిధిలో ఉన్న రహదారి పనులను పట్టించుకోకపోవడంతో రహదారి మొత్తం గోతులమయంగా తయారైంది. దీంతో వాహనదారులు ఆ రహదారి గుండా రాకపోకలు సాగించ డానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో గుంతలమయంగా తయారైన ఏపీ రహదారుల దుస్థితిని ముఖ్యంగా నిత్యం రాకపోకలు సాగించే తెలంగాణ ప్రజలు ఆనాటి జగన్మోహన్ రెడ్డి పాలనను దుయ్యబట్టారు. ఏపీలో తిరిగి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం గుంతల రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి.



భద్రాచలం నుండి చర్ల వైపు వెళ్లే ప్రధాన రహదారి తూరుబాక మొదలు లక్ష్మీ నగరం వరకు అధ్వానంగా తయారైంది. రహదారి చిత్తడిగా మారడంతో తరచూ వాహన ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు గతంలో అధిక లోడుతో ఇసుక లారీలు తిరగడం వలన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పవచ్చు. పూర్తిగా పాడైపోయిన రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

డైవర్షన్ రహదారితో నిత్యం ప్రమాదాలు

భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి తూరుబాక వద్ద గత కొన్ని నెలల క్రితం కల్వర్టు కుంగిపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రహదారి ఏర్పాటు చేశారు. దీంతోపాటు రహదారికి ఇరువైపులా వాహన రాకపోకలు సాగించే వీలు లేకుండా మట్టి కట్టలు ఏర్పాటు చేశారు. కాగా డైవర్షన్ రహదారి గుండా పోయే వాహనాలు పలుమార్లు ప్రమాదాలకు గురికాగా ఒకరిద్దరు మృత్యువాతకు గురైన సంఘటనలో ఉన్నాయి. కల్వర్టు నిర్మాణం కోసం అంచనాలు పంపించామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నప్పటికీ నేటికీ ఆ పనులు ప్రారంభించలేదని చెప్పవచ్చు.

గుంతలలో మట్టి పోసి మమ అనిపిస్తున్న వైనం

శ్రీరామనవమి సమీపిస్తుండడంతో భద్రాచలం-చర్ల ప్రధాన వెంబడి పలుచోట్ల ఏర్పడిన గుంతలలో ఆర్‌అండ్‌బీ అధికారులు మట్టిపొస్తూ మమ అనిపిస్తున్నారనే చెప్పవచ్చు. రేగుబల్లి వద్ద గుంతలను గ్యాంగ్ మాన్‌లతో మట్టితో పూడ్చుతున్న పనులు నవతెలంగాణ కంటపడ్డాయి. ఎంతో ప్రాముఖ్యత కలిగిన శ్రీరామనవమి సందర్భంగా పర్ణశాలకు వచ్చే వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్‌అండ్‌బి అధికారులు రహదారి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపైన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్
- దళిత వ్యతిరేక బడ్జెట్‌పై కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన



నవతెలంగాణ-ఖమ్మం

బడ్జెట్‌ను వెంటనే సవరించి దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్నెస్పీ క్యాంప్‌లో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో దళితులపైన చూపిన వివక్షకు వ్యతిరేకంగా ప్ల కార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన నిరసన సభలో మనోహర్ మాట్లాడుతూ అసెంబ్లీలో దళితులకు ప్రతి ఏటా బడ్జెట్లో అంకెలు పెంచుతూ ఖర్చులు మాత్రం తుంచుతున్నారని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్ లో నూటికి 30% కూడా ఖర్చు చేయలేదన్నారు. ఖర్చు చేయని నిధులను సబ్ ప్లాన్ చట్టం ప్రకారంగా వచ్చే ఏడాది బడ్జెట్లో ఖర్చు చేయాలని సబ్ ప్లాన్ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. గత ఏడాది క్రిందట చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించిన ప్రభుత్వం ఏటా 750 కోట్ల రూపాయలు కేటాయిస్తామని 12 లక్షల రూపాయలు అంబేద్కర్ అభయహస్తం అమలు చేస్తామన్న మాటకు ఈ బడ్జెట్‌లో నయా పైస కూడా కేటాయించలేదన్నారు. మూడు కార్పొరేషన్లుగా విడగొట్టి దళితుల యొక్క మౌళిక అభివృద్ధికి కృషి చేస్తామన్న మాట నీటి మూటగా మారిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 మాసాలు గడిచినప్పటికీ దళిత అభివృద్ధి శాఖకు ఎందుకు మంత్రిని నియమించలేదో చెప్పాలన్నారు. బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు చర్చల సందర్భంగా దళితుల, గిరిజనుల సబ్ ప్లాన్ నిధులపై ప్రత్యేక చర్చను ఏర్పాటు చేసి ఒక శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బడ్జెట్‌పై పునరాలోచన చేసి దళిత అభివృద్ధి శాఖకు మంత్రిని నియమించాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు సరిపడా నిధులు కేటాయించాలని, అంబేద్కర్ అభయహస్తానికి ఏటా 750 కోట్ల రూపాయలు కేటాయిస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు బోట్ల సాగర్, ఎస్‌కె సైదులు, జె కిరణ్, గుమ్మడి భిక్షం, జె.వెంకన్న బాబు, హిమామ్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

బాణాపురం గడ్డన ఎర్రజెండా బిడ్డలు

- అమరవీరులు గండ్లూరి కిషన్‌రావు, బాజీ హనుమంతుల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన



నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని బాణాపురం గడ్డన పుట్టిన పోరుబిడ్డలు, ఎర్రజెండా ముద్దుబిడ్డలు, సిపిఐ(ఎం) నేతలు, అమరులు గండ్లూరి కిషన్‌రావు, బాజీ హనుమంతులు. దశాబ్దాలుగా సిపిఐ(ఎం) బలోపేతంకు వారు కృషి చేసి ప్రజా సంక్షేమం కోసం పనిచేసి, పేదలకు బాసటగా నిలిచారు. భూస్వామ్య, దోపిడి వర్గాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించి ప్రజలకు వెన్నంటూ ఎర్రజెండా అండగా ఉందని ఎలుగెత్తి చాటారు. గండ్లూరి కిషన్‌రావు, బాజీ హనుమంతుల రణధీరుల విగ్రహావిష్కరణలకు బాణాపురం నడిబొడ్డున గురువారం గండ్లూరి కిషన్‌రావు, బాజీ హనుమంతులా సతీమణులు నర్సుబాయమ్మ, శైలజా సిపిఐ(ఎం) రాష్ట్ర, జిల్లా, మండల నాయకులతో కలిసి విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కామ్రేడ్ గండ్లూరి కిషన్ రావు రెండు దశాబ్దాలన్నర పాటు గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా పనిచేసి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. శత్రువుల దాడుల్లో 1979 ఫిబ్రవరి 9న అమరులయ్యారు. కామ్రేడ్ బాజీ హనుమంతు పార్టీ నాయకులుగా, ఎమ్మెల్యేగా, ఈప్రాంత ప్రజలకు ప్రజా ఉపయోగకర అభివృద్ధికి కృషి చేసి ప్రజా బాంధవుడుగా నిలిచాడు. 1985 సెప్టెంబర్ 9న అమరుడయ్యారు. జీవితాంతం ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమంలో పనిచేసిన ఆణిముత్యాలంటి నాయకులకు విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమని రాజకీయాలకతీతంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర మాజీ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బండి పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి మడపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, సీనియర్ నాయకులు పాల్వాయి పాండురంగరావు, వాసిరెడ్డి వరప్రసాద్, పార్టీ మండల మాజీ కార్యదర్శి కూరపాటి శ్రీనివాసరావు, నాయకులు టీఎస్ కళ్యాణ్, పంద్రకొల రాంబాబు, చింతకాయల రామారావు, మరికంటి వెంకన్న, కందిమల్ల తిరుపతి, వత్సవాయి సైదులు, మరికంటి నరసింహారావు, మేడి రవి, తేజావత్ వెంకటేశ్వర్లు, వడ్డెబోయిన అంజయ్య, చప్పిడి కృష్ణ, తుపాకుల రవి, జంగం వెంకటరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వనం నర్సింగరావు, ఇలవల పుల్లారెడ్డి, వల్లూరి భద్రారెడ్డి, పందిరి అంజయ్య, గజ్జల వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ ఉన్నం పూర్ణచంద్రరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోట్ల బాబు, గుండు సత్యనారాయణ, బాజీ హనుమంతు కుమారుడు బాజీ దామోదర్, గండ్లూరి కిషన్ రావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతుల కల్పన
- ధాన్యం కొనుగోలుకు 344 కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

రబీ మార్కెటింగ్ సీజన్‌లో ఖమ్మం జిల్లాలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి 2024-25 రబీధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత అంచనా ప్రకారం రబీ సీజన్‌కు సంబంధించి లక్షా 85 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 73 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, మొత్తం 2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబోతున్నామని అన్నారు. గత సీజన్ లో ధాన్యం రవాణా అంశంలో ఎక్కడైనా చిన్న, చిన్న ఇబ్బందులు వస్తే వాటిని పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్పాలిన కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ప్రతి సెంటర్ వద్ద ఉన్న గన్నీ బ్యాగుల వివరాలను నోటీసు బోర్డుపై రాయాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హామాలీలు ఉండేలా చూడాలని అన్నారు. సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీం, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

- తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు

నవతెలంగాణ-వైరాటౌన్

పోరాటాల ద్వారానే రైతాంగ, వ్యవసాయరంగ సమస్యల పరిష్కారం అవుతాయని, పోరాటాలు లేకుండా పరిష్కారం కావని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు తెలిపారు. వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కరించకుండా వ్యవసాయరంగం సంక్షోభం వీడదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా 21వ మహాసభ గురువారం వైరాలో కమ్మవారి కళ్యాణ మండపం నందు జరిగింది. మహాసభల ప్రారంభం సూచికగా రైతు సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు బండారుపల్లి ముత్తయ్య ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాన్ని భాగం హేమంతరావు ఆవిష్కరించగా ఫోటో ఎగ్జిబిషన్ రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. దొండపాటి రమేష్, పుచ్చకాయ వెంకటేశ్వర్లు, జక్కుల రామారావు, బానోత్ రవి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ పాలనలో వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. 18 శాతం జిడిపి గల వ్యవసాయం రంగంపై కార్పొరేటర్లు కన్ను పడిందని హేమంతరావు ఆరోపించారు. 766 మంది రైతులు బలిదానం తర్వాత నల్ల చట్టం అమలుపై వెనకడుగు వేసిన మోడీ ఇప్పుడు దొడ్డి దారిలో అమలు చేసే ప్రయత్నాలు చేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి పదిహేను నెలలు గడిచిన ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. సీతారామ ప్రాజెక్టు వ్యయం పెరుగుతుంది తప్ప ప్రాజెక్టు పూర్తి కావడం లేదన్నారు. రైతుల ఆగ్రహానికి గురైన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదు అన్నారు. చైతన్యం కలిగిన తెలంగాణ రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, రైతు సంఘం నాయకులు ఎర్రబాబు, మిడకంటి వెంకటరెడ్డి, జాగర్లమూడి రంజిత్, యామాల గోపాలరావు, ఏపూరి లతాదేవి, సింగ్ నరసింహారావు, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం కోసం చదవాలి

- రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణమూర్తి

నవతెలంగాణ-నేలకొండపల్లి

విద్యార్థులు లక్ష్యం కోసం చదవాలని రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణ మూర్తి అన్నారు. టాస్క్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన టాలీ కోర్స్ శిక్షణా తరగతుల ముగింపు సమావేశం గురువారం ప్రిన్సిపాల్ డా. ఏ.పరంజ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాధాకష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఆయా రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ట్రైనర్ రామకృష్ణ మాట్లాడుతూ 3 రోజుల పాటు టాలీ కోర్స్ నందు విద్యార్థులకు విలువైన సమాచారంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ ను అందించామన్నారు. ఎస్.ఆర్.బి.జి ఎన్.ఆర్ ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ ఇలాంటి కోర్సుల వల్ల ఉపాధి అవకాశాలు పొందడంతో విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం మూడు రోజుల పాటు కోర్సులో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వి. రెడ్డి, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ రమేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ నారాయణస్వామి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జక్కుల



నవతెలంగాణ - బోనకల్

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండల పరిధిలోని గోవిందాపురం గ్రామానికి చెందిన జక్కుల రామారావు ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా జక్కుల మాట్లాడుతూ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తనను ఎన్నిక చేసినందుకుగాను సంతోషాన్ని వ్యక్తం చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు చేసేది ఒక్క ఏఐకేఎస్ మాత్రమేనని అన్నారు. రానున్న రోజుల్లో బోనకల్ మండలంతో పాటు, ఖమ్మం జిల్లాలో ఏఐకేఎస్ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. రామారావు ఎంపిక పట్ల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులతో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఏఐకెఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు పారుపల్లి నరసింహా రావు, కొంగర భాస్కరరావు, ఏలూరి పూర్ణచంద్రరావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్ తదితరులు హర్షం, అభినందనలు తెలిపారు.

విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని తక్షణమే బడ్జెట్ కేటాయింపులకి సవరణ చేసి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు యశ్వంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పీడీఎస్యూ రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో గురువారం జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, వెంకటేష్, సిద్దు, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా సామగ్రిని అందజేసిన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగర పరిధిలోని బల్లేపల్లి ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ పరీక్షా సామాగ్రిని అందజేశారు. గురువారం ఖమ్మం బల్లేపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భాగం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరీక్షా సామాగ్రి అందజేశారు. ఖమ్మం జిల్లా విద్యారంగంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు అందిస్తున్న అందిస్తున్న ఆర్థిక చేయూత మరువలేనిదని, ప్రతి ఒక్కరు ఆచరించాలని ప్రధానోపాధ్యాయులు రమేష్ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీరాజ్యం, రమేష్ బాబు, వై.లక్ష్మి, ఎస్.నిర్మల, బాబూసాహెబ్, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన ఏఎంసీ చైర్మెన్ దోమ

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌బాబు గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన ఛాంబరులో మర్యాద పూర్వకంగా కలిశారు. సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి నూతన భవనం, తనిఖీ కేంద్రాలు మంజూరు చేయాలని మంత్రి తుమ్మలను కోరారు. అలాగే వేంసూరు మండలం కల్లూరుగూడెంలో గోదాము, సీసీ రోడ్లు మంజూరు చేయాలని మంత్రి తుమ్మలను కోరుతూ వినతిపత్రం అందించినట్లు ఏఎంసీ చైర్మెన్ ఆనంద్‌బాబు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టరు మట్టా దయానంద్ విజయకుమార్ ఆదేశాల మేరకు మంత్రిని కలిసి పైన తెలిపిన వాటిని కోరడం జరిగిందని ఆనంద్‌బాబు తెలిపారు.

ఉగాది నుంచైనా కొత్త రేషన్ కార్డులిస్తారా..?

- కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా జరగాలి : సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్
- సీఆర్వో ఆఫీస్ ఎదుట ధర్నా
- ప్రభుత్వ ఆదేశాల మేరకు అందిస్తాం .. : సీఆర్వో



నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం వాయిదాలకే పరిమితమవుతోందని, మళ్లీ ఇప్పుడు ఉగాది నుంచి తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెబుతున్నా.. అప్పటి నుంచైనా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారా..? అని సీపీఐ(ఎం) పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ ప్రశ్నించారు. అర్హులైన పేదలకు వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం సికింద్రాబాద్‌లోని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ కార్యాలయం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందా అని ప్రజానీకం ఎదురు చూస్తోందని అన్నారు. గత ప్రభుత్వం రేషన్ కార్డుల విషయంలో ప్రజలకు చాలా అన్యాయం చేసిందని, బైక్, కారు ఉన్నాయన్న కారణంతో పదేండ్ల కాలంలో రాష్ట్రంలో 4,76,282 రేషన్ కార్డులను, హైదరాబాద్‌లో 1,63,392 రేషన్ కార్డులను తొలగించిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 3,11,025, హైదరాబాద్‌లో 56,066 రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. కొత్తగా ఇచ్చిన రేషన్ కార్డుల కంటే అదనంగా 1,65,257 కార్డులను తొలగించినట్టు వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొత్తగా పెండ్లయిన కుటుంబాలు, పిల్లల పేర్లు నమోదు చేసుకోవాల్సిన కుటుంబాలు, రేషన్ కార్డులు లేని కుటుంబాలు సుమారు 7 లక్షల మంది వరకు ఉన్నారని, వీరంతా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీతో పాటు ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డునే పరిగణలోకి తీసుకుంటున్నారని, అందువల్ల పాత రేషన్ కార్డులో పేరు కట్ అయిన వెంటనే కొత్త రేషన్ కార్డులో పేరు నమోదు చేయాలని కోరారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరగాలన్నారు.

సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు లేక.. ఆర్యోగశ్రీ, ప్రభుత్వ పథకాలు అందక పేదలు అవస్థలు పడుతున్నారన్నారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ.. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా రేషన్‌లో 14 రకాల వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం ఇస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సీఆర్వో జి.ఫణీంద్ర రెడ్డికి ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీఆర్వో స్పందిస్తూ.. రేషన్ కార్డుల దరఖాస్తులు నగరంలో 1,50,000 వచ్చాయని, వాటిని సర్వే చేస్తున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డులు ఇస్తామని, మిగతా అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని వివరించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, కెఎన్.రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, ఎన్.మారన్న, ఎం.అజయ్‌బాబు, ఆర్.అశోక్, జి.నరేష్, నాయకులు పి.విమల, ఆర్.మల్లేష్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- జియోలాజికల్ సర్వే అధికారుల సూచనలతో పనులు
- ఉన్నతాధికారుల సమీక్ష



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారుల సూచనలను పాటిస్తూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. ఆర్మీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా, డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ ఉన్నతాధికారులు, సహాయక బృందాల ఉన్నతాధికారులతో టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యలపై, తీసుకోవాల్సిన భద్రత ప్రమాణాలను విశ్లేషించారు. సహాయక పనులకు ఆటంకంగా ఉన్న ఊట నీటిని అధిక సామర్థ్యం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్టు తెలిపారు. స్టీలును, మట్టిని పూర్తిస్థాయిలో తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. పెద్ద పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్టు తెలిపారు.నీటి ఊటలు, మట్టి ఎక్కువగా ఉండటం వంటి సవాళ్లను అధిగమించేందుకు యంత్రాలు, ప్రత్యేక నిపుణులను రంగంలోకి దించినట్టు వివరించారు. సహాయక చర్యలు ప్రతి రోజూ 5 షిఫ్టులుగా కొనసాగుతున్నాయని, ఉదయం 7 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు, 11 గంటల షిఫ్టుల్లో, ప్రత్యేక సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేయిస్తున్నారని వివరించారు. టన్నెల్ లోపల జరిగే సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 26 రోజులుగా రాత్రి పగలు తేడా లేకుండా 5 షిఫ్టులుగా పనిచేస్తున్నారని తెలిపారు.

వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉండొద్దు

- సందీప్ కుమార్ సుల్తానియా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవిలో ఏ ఒక్క వినియోగదారుడికీ సరఫరా సమస్యలు ఉండొద్దని ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు.వేసవిలో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టు జీహెచ్ఎంసీ పరిధిలో తీసుకున్న చర్యలపై గురువారం హైదరాబాద్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ వార్షిక పెరుగుదల 30 శాతనికి మించి నమోదవుతుందని తెలిపారు. గతేడాది వేసవి అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ట్రాన్స్ కో పరిధిలో బౌరంపేట్, ఆర్సీ పురం, మౌలా-అలీ, బండ్ల గూడా, గచ్చిబౌలి, కైతలాపూర్, బొల్లారం ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీ లను పెంచినట్టు తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ మాట్లాడుతూ, గతేడాది జీహెచ్ఎంసీలో అత్యధిక డిమాండ్ 4,352 మెగావాట్లుగా రికార్డు అయినట్టు తెలిపారు. ఈ వేసవిలో 5,000 మెగా వాట్లకుపైగా ఉంటుందని చెప్పారు. ఈ డిమాండ్‌ను తగినట్టు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రాన్స్ కో జేఎండీ సి.శ్రీనివాస రావు, డైరెక్టర్ జగత్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు నంద కుమార్, సాయి బాబా, డాక్టర్ నర్సింహులు, సుధా మాధురి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తరాదిలో ఉపాధి ఉంటే దక్షిణాదికి వలసలెందుకు?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూపీ, బీహార్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి ఉత్తరాదిలో రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి అద్భుతంగా ఉంటే అక్కడ నుంచి దక్షిణాది రాష్ట్రాల్లోని చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు వలసలెందుకు పెరుగుతున్నాయని బీజేపీ నేతలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధి వాళ్లు సాధించినట్టా? మేం సాధించినట్టా అని అడిగారు. తెలంగాణలో నిరుద్యోగం 6.1 శాతానికి తగ్గిందనీ, నిత్యావసరాల ధరల పెరుగుదల అతి తక్కువగా 1.3 శాతం నమోదైందని కేంద్రమే చెబుతున్నదని వివరించారు. కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా..విమర్శలొస్తున్నా పారదర్శకమైన పాలన అందించడం, తెలంగాణను దేశానికే మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మరోమారు స్పష్టం చేశారు. సీఎం పదవి చేపట్టినప్పటి కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందనీ, జీవితంలో తొలి అవకాశం ద్వారా వచ్చే అనుభూతి కలకాలం నిలిచిపోతుందని గుర్తు చేసుకున్నారు. గరం..నరం..బేషరం అనే నానుడికి భిన్నంగా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి రిటైర్డ్ అయ్యే వరకూ స్వభావాన్ని మార్చుకోవద్దని కొత్తగా ఉద్యోగబాధ్యతలు చేపడుతున్న వారికి సూచించారు. తాను జెడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏదైతే స్వభావంతో ఉన్నానో సీఎం అయినప్పటికీ దాన్నే కొనసాగిస్తున్నానని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల్లో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన 922 మందికి నియామక పత్రాలను మంత్రి సీతక్కతో కలిసి సీఎం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణాలు చేపట్టే వారికి సులువుగా, పారదర్శకంగా అనుమతులిచ్చేలా రూపొందించిన బిల్డ్‌నౌ పోర్టల్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అనుమతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు శంకర్, కాలెయాదయ్య, ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్, మాజీ ఎంపీ వేణుగోపాలచారీ, తదితరులు పాల్గొన్నారు.



కాలగర్భంలో పదేండ్ల విలువైన సమయం

ప్రతి వ్యక్తి జీవితంలో పదేండ్ల సమయం ఎంతో విలువైనదనీ, గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల పదేండ్లు కాలగర్భంలో కలిసిపోయాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌క్యాలెండర్‌తో పాటు కారుణ్య నియామకాలను క్రమం తప్పకుండా చేపట్టాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. గత ప్రభుత్వ వైఫల్యం, బాధ్యతారాహిత్యం వల్లనే 20 నుంచి 25 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు గందరగోళంగా మారాయని వాపోయారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని ప్రాధాన్యతగా తీసుకుని ఏడాదిలోనే 57,924 మందికి కొత్త ఉద్యోగాలిచ్చిందని చెప్పారు. గత ప్రభుత్వ నోటిఫికేషన్లకు నియామక పత్రాలు అందజేస్తున్నామని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. మీరేసిన నోటిఫికేషన్లు అయితే సక్రమంగా పరీక్షలు ఎందుకు నిర్వహించలేదు? పేపర్ల లీక్‌లను ఎందుకు అరికట్టలేదు? కోర్టు కేసులను ఎందుకు పరిష్కరించలేదు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. నీళ్లు, నిధులు, నియామకాల ఆధారంగానే తెలంగాణ ఉద్యమం నడిచింది కదా.. పదేండ్లలో ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయలేదని నిలదీశారు. ఆ ఉద్యోగాలను భర్తీ చేసుకుంటే తమకు ఈ అవకాశం వచ్చి ఉండేది కాదన్నారు. విధినిర్వహణలోని ఉద్యోగి చనిపోతే ఆ కుటుంబం ఎంత బాధపడుతుందో తెల్వదా? అసలు వారికి కారుణ్య నియామకాలంటే అర్థం తెలుసా? అని ప్రశ్నించారు. తన కూతురు ఎంపీగా ఓడిపోతే ఎమ్మెల్సీగా, బంధువు ఓడిపోతే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా కారుణ్య నియామకాల కింద పదవులు ఇచ్చుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం అలా చేయడం లేదన్నారు. ఉమ్మడి ఏపీ చరిత్రలోగానీ, గుజరాత్ చరిత్రలోగానీ ఒక్క ఏడాదిలో 59 వేల ఉద్యోగాల భర్తీ ఏనాడైనా చేపట్టారా? అని ప్రశ్నించారు. పారదర్శకంగా, ఒక క్రమ పద్ధతిలో పరీక్షలు నిర్వహణ, ఉద్యోగాల నియామకాలు చేపడుతూ ముందుకెళ్తున్నామన్నారు. నోటిఫికేషన్‌లన్నింటినీ ఒకేసారి విడుదల చేయొద్దని గతంలో ఎప్పుడైనా ఆందోళనలు జరిగాయా? అని అడిగారు. ఒకేసారి 563 గ్రూపు వన్ పోస్టులను ఎన్నడూ భర్తీ చేయలేదన్నారు. 30 నుంచి 40 రోజుల్లో గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3 అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేస్తామన్నారు. తన కుటుంబ సభ్యులుగా భావించి వారి కండ్లలో ఆనందం చూడాలని ఎల్‌బీస్టేడియం, రవీంద్రభారతి వేదికలుగా కుటుంబ సభ్యుల సమక్షంలో నియామక పత్రాలు అందజేస్తున్నామన్నారు.

సోషల్‌మీడియా వేదిక విష ప్రచారం..

'మీకు ఉద్యోగాలు ఇచ్చినందుకు నాపై కోపం ఉందా? 20,617 కోట్లతో రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసినందుకు రైతులు నాపై కోపంగా ఉన్నారా? ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు ఆడబిడ్డలు నా మీద కోపంగా ఉన్నారా? 1000 బస్సులకు ఓనర్లను చేసినందుకు..వెయ్యి మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు పెట్టుకునే అవకాశం కల్పించినందుకు మహిళా సంఘాలు కోపంగా ఉన్నాయా? డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు పిల్లలు నా మీద కోపంగా ఉన్నారా? 57 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించినందుకు కోపంగా ఉన్నారా? ఇన్ని చేసిన తనపై ప్రజలు ఎందుకు కోపంగా ఉంటారు. కావాలనీ బీఆర్ఎస్ వాళ్లు సోషల్‌మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నిజం గడపదాటకముందే అబద్ధం ప్రపంచం మొత్తాన్ని చుట్టివస్తున్నట్టు వారి తప్పుడు ప్రచారం ఎక్కువవుతున్నది. పదేండ్లలో పోగేసుకున్న నల్లధనాన్ని పెట్టుబడిగా, ఇంధనంగా మార్చుకుని విషప్రచారం చేస్తున్నారు. ఇది ఎల్లకాలం నడువదు. ఇలాగే అబద్ధాలు చెప్పుకుంటూ పోతే ప్రజలు మిమ్మల్ని పట్టించుకోవడం మానేస్తారు' అంటూ బీఆర్ఎస్‌నుద్దేశించి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

గడీల్లో పెరగలేదు..నల్లమల అడవుల్లో పెరిగా

తాను గడీల్లో పెరగలేదనీ, నల్లమల బిడ్డగా పేదలు, చెంచుల మధ్య పెరిగానని సీఎం చెప్పారు. తనకు పాలనపై పట్టులేదని బీఆర్ఎస్ వాళ్లు చేస్తున్న ప్రచారాన్ని కొట్టిపడేశారు. ఎన్నడూ సచివాలయానికి రాకుండా ఫాంహౌజ్‌లో ఉండేవాళ్లకు పాలన మీద పట్టు ఉన్నట్టా? అని ప్రశ్నించారు. తాము ప్రతిరోజూ సచివాలయానికి వస్తున్నామనీ, రాష్ట్ర అభివృద్ధి కోసం తాను, తన క్యాబినెట్ 18 గంటల కష్టపడి పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరసనలు, ధర్నాచౌక్‌లో ఆందోళనలు జరిగితే పట్టులేనట్టా అని నిలదీశారు. అది పాలనపై పట్టు లేనట్టు కాదనీ, తమ సమస్యలను చెప్పుకునే హక్కును, స్వేచ్ఛను ఉద్యోగులకు, కార్మికులకు, ప్రజలకు ఇచ్చామని తెలిపారు. గతంలో కోదండరామ్ ఇంటికెళ్లి తలుపులను బద్దలు కొట్టినట్టుగానే..ఒక్కసారి పోలీసులను ఆదేశిస్తే కేటీఆర్‌ను తీసుకొచ్చి దంచుతరన్నారు. ఆ విధానానికి తమ ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. తమ ప్రభుత్వం మానవత్వంతో రాజ విజ్ఞతను పాటిస్తున్నదని చెప్పారు. దీనిని బట్టే ఎవరు ఎలాంటి వాళ్లనేదాన్ని ప్రజలు విశ్లేషించుకోవాలని కోరారు. త్వరలో వైటీడీఏ బోర్డు కమిటీని వేయబోతున్నట్టు ప్రకటించారు.

గత పాలకులు కమీషన్ల కోసం 11 శాతం వడ్డీకి అప్పు

ఒక వ్యక్తి, ఒక కుటుంబం కమీషన్ల కోసం చేసిన అప్పు నేడు తెలంగాణ ప్రజలకు భారంగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వలేక గత ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 57 ఏండ్ల నుంచి 61 ఏండ్లకు పెంచిందని విమర్శించారు. ఇప్పుడు రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ రూ.8 వేల కోట్ల మేర పేరుకుపోయాయని చెప్పారు. తమ ప్రభుత్వం ప్రతినెలా రెండు, మూడుదొందల కోట్ల రూపాయలను సర్దుబాటు చేస్తున్నదనీ, అత్యవసరం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి క్లియర్ చేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు ఇస్తే చాలా బ్యాంకులు నాలుగు నుంచి ఐదు శాతం వడ్డీకి రుణాలిస్తుంటే గత ప్రభుత్వం కమీషన్ల కోసం 11 శాతం వరకు వడ్డీ కింద అప్పులు చేసిందని ఎత్తిచూపారు. డీపీఆర్ ఇస్తే దొంగతనం బయటపడుతుందని కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 10.50 శాతం వడ్డీ కింద అప్పు తెచ్చిందని వివరించారు. ఢిల్లీ చుట్టూ 32 సార్లు తిరిగి దాన్ని ఐదారు శాతానికి రీస్ట్రోర్‌మెంట్ చేయించేందుకు తిప్పలు పడుతున్నామన్నారు. గత పాలకులు చేసిన నిర్వాహకాన్ని చూసి ఇప్పుడెవ్వడూ మనల్ని నమ్మట్లేదనీ, అప్పు పుట్టట్లేదని చెప్పారు. చేసిన నిర్వాహకాలను ఇంకెన్నాళ్లు దాచిపెట్టాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ.1,53,000 వేల కోట్లను కట్టామనీ, అవే డబ్బులుంటే దరఖాస్తు చేసుకున్నవారందరికీ ఆ డబ్బులతో ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యేవనీ, రెండు లక్షలకుపైగా ఉన్న రుణమాఫీ కూడా పూర్తయ్యేదని చెప్పారు.

ఇసుకపై రూ. ఏడు వేల కోట్ల దోపిడీ

గత ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియా ఏడువేల కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడిందని సీఎం ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టారని అధికారుల సమీక్షలో తేలిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణదారులు వాడిన సీకు, సిమెంట్ వినియోగం లెక్కలు తీయిస్తే..1.25 మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమ పద్ధతిలో తరలుతుందని బయటపడిందన్నారు. అందుకే నగరంలో శాండ్ బజారులను ఏర్పాటు చేపించామనీ, అక్కడ నుంచి నిర్మాణదారులకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. టన్నుకు సన్న ఇసుకకు రూ.1800, దొడ్డు ఇసుకకు రూ.1600 ధర నిర్వహించామని తెలిపారు. ఆయన మంది డెలివరీ పథకం తీసుకొస్తే..తాను ఇసుక డెలివరీ పథకం తీసుకొచ్చానని చలోక్తులు విసిరారు. కొన్ని కొత్త పనులు చేసేటప్పుడు ఇబ్బందులు, విమర్శలు వస్తాయనీ, దీన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని విన్నవించారు.

గ్లోబల్ ల్యాండ్ మార్క్‌గా హైదరాబాద్

తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహిస్తే తప్పేంటని సీఎం ప్రశ్నించారు. దానిపై అవగాహన లేని వారే విమర్శిస్తున్నారని దెప్పిపొడిచారు. ఆ పోటీలకు 120 దేశాల నుంచి ప్రతినిధులు వస్తారనీ, ప్రపంచ నలుమూలల నుంచి 3 వేల మంది న్యూస్‌ఛానళ్ల, పేపర్ల జర్నలిస్టులు వస్తారని తెలిపారు. దీని ద్వారా గ్లోబల్‌లో హైదరాబాద్ ల్యాండ్ మార్క్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ 72 సార్లు ఆ పోటీలు జరగ్గా..భారతదేశంలో ముంబయి నగరంలో ఒక్కసారే జరిగాయనీ, రెండోసారి హైదరాబాద్‌లో జరుగబోతున్నాయని గుర్తుచేశారు. ఆ పోటీల ద్వారా నెలపాటు హోటల్, ఫుడ్, ట్రాన్స్‌పోర్టు రంగాలకు వందల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మెక్‌డొనాల్డ్ కంపెనీ హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆఫీసు పెట్టడానికి ముందుకొచ్చిందని చెప్పారు. అమెజాన్ కంపెనీ కూడా తన కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నదన్నారు.

అన్నీ అడ్డుకునే ప్రయత్నం

మేము చేయలేదు కాబట్టి వారిని చేయనియ్యం అన్నట్టుగా తాము చేస్తున్న ప్రతి దాన్నీ అడ్డుకునే ప్రయత్నాన్ని బీఆర్ఎస్ వాళ్లు చేస్తున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబం కేంద్రంగా నిర్ణయాలు జరిగితే తమ ప్రభుత్వంలో ప్రజలు, విద్యార్థులు, రైతుల కోణంలో నిర్ణయాలు జరుగుతున్నాయని వివరించారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచొద్దని మేము చెప్పామా? అని ప్రశ్నించారు. హాస్టళ్లలోని పేదల పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం 40 శాతం డైట్‌చార్జీలను, చిన్నచిన్న అవసరాలను తీర్చేందుకు కాస్మోటిక్ చార్జీలను 200 శాతానికి పెంచి గ్రీన్ ఛానల్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సొంత భవనాలున్నాయా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం 58 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో గ్రీన్‌ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో ఏటా 1.10 లక్షల ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారనీ, వారిలో సరైన స్కిల్స్ లేకపోవడం వల్ల కేవలం 10 వేల మందికే ఉద్యోగాలు దక్కుతున్నాయనీ, మిగతా వారంతా నిరుద్యోగులుగా మారుతున్నారని వివరించారు. వారిలో స్కిల్స్ పెంచేందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలని ట్యాంకెక్కిన దళితులు



- ఆర్డీవో, ఏసీపీ బుజ్జగింపు.. బెదిరింపు..
- ససేమిరా అనడంతో నిర్మాణ పనుల నిలిపివేత

నవతెలంగాణ-నర్సంపేట

వరంగల్ జిల్లా నర్సంపేటలోని సర్వే నెంబర్-121లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణ పనులను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల తీరును నిరసిస్తూ గురువారం దళితులు ఆత్మహత్యాయత్నం చేసుకుంటామంటూ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన ఘటన ఉత్కంఠ రేకెత్తించింది. పట్టణంలోని మోడల్ హైస్కూల్ ఆవరణలోని భూపోరాట కమిటీ నాయకులు మంద ప్రకాష్, వేల్పుగొండ రాజు, పలువురు మహిళలు ఓహెచ్ఆర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసుకుంటామని బెదిరించారు. సమాచారం తెలుసుకున్న ఆర్డీవో పి.ఉమారాణి, తహసీల్దార్ రాజేష్, ఏసీపీ కిరణ్‌కుమార్, పలువురు ఎస్ఐలు అక్కడకు చేరుకొని వారిని కిందికి దించే ప్రయత్నం చేశారు. అక్రమ నిర్మాణ పనులను తొలగించే వరకూ ట్యాంకు దిగేదిలేదని, పరిష్కరించకుంటే పెట్రోల్ మీద పోసుకోవాల్సి వస్తుందని భీష్మించుకుకూర్చున్నారు. ఆందోళనకారులకు మద్దతుగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల రమేష్ అధికారులను నిలదీశారు. ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని కోరితే ఎస్ఐ అరుణ్‌కుమార్ దళిత నాయకులను బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో చివరకు మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులను పిలిపించారు. వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆర్డీవో ఆదేశించారు. ప్రభుత్వ స్థలం వద్దకు చేరుకున్న అధికారులు జేసీపీతో పిల్లర్ నిర్మాణ పనులను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. నిర్మాణం చేస్తున్న వ్యక్తులు, వారికి మద్దతుగా కాంగ్రెస్ మండలాధ్యక్షులు భానోతు లక్ష్మణ్ నాయక్ అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వివాదానికి దిగారు. నిర్మాణం చేయడానికి ఎలాంటి అనుమతులూ లేవని, ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేయడం చట్ట ప్రకారం నేరమని తహసీల్దార్ రాజేష్, టౌన్ ప్లానింగ్ అధికారి వీరస్వామి చెప్పినా వారు వినిపించుకోలేదు. చివరకు కూల్చేయకతప్పదని హెచ్చరించడంతో నిర్మాణం కూల్చకండి తామే తీసేసుకుంటామని చెప్పారు. నిర్మాణ పనులు చేపడితే కూల్చక తప్పదని తహసీల్దార్ హెచ్చరించారు. అనంతరం ట్యాంకు వద్దకు ఎస్ఐ రవికుమార్ చేరుకొని పనులను నిలిపివేశామని, కిందికి దిగమని చెప్పడంతో ఎట్టకేలకు దళితులను కిందకు దింపారు.

పనుల సామగ్రిని పూర్తిగా తొలగించాలి : భూపోరాట కమిటీ

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని భూపోరాట కమిటీ నాయకులు మంద ప్రకాష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని అనేక దఫాలుగా ఫిర్యాదులు చేసినా మున్సిపల్, రెవిన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. కేవలం పిల్లర్‌లను పక్కకు నెట్టి చేతులు దులుపుకుంటే చాలదని పూర్తి స్థాయిలో కూల్చాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ బయటకు రావాలంటూ కాంగ్రెస్ పోరుబాట

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర
- సిద్దిపేట కలెక్టరేట్ నుంచి గవర్నర్ కార్యాలయం వరకు నడక



నవతెలంగాణ-గజ్వేల్

అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్.. పాల్గొనాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఓట్లు వేసి మూడుసార్లు గెలిపించామని, ఇందులో రెండుసార్లు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఉండటంతో తాము పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి 15 నెలలు గడుస్తున్నా అసెంబ్లీకి వెళ్లకపోవడం, ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఎమ్మెల్యే అందుబాటులో ఉండకపోవడంతో గవర్నర్‌కు తమ బాధను చెప్పుకునేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పాదయాత్ర చేపట్టారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ నుంచి గవర్నర్ కార్యాలయం వరకు రాజీవ్ రహదారి మీదుగా సోమవారం గవర్నర్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందించనున్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్.. ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలవగా, 2014, 2018లో సీఎంగా ఉన్న సమయంలో రెండు మూడుసార్లు మాత్రమే పర్యటించినట్టు చెప్పారు. శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు మాత్రమే వచ్చిన కేసీఆర్.. మూడోసారి గెలిచిన తర్వాత మొత్తానికే ముఖం చాటేసినట్టు ఆరోపించారు. నియోజకవర్గంలో నెలకొన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ క్షేత్రం నుంచి బయటకు రావాలని అన్నారు. వ్యవసాయ క్షేత్రం నుంచి బయటకు వస్తారా, శాసనసభకు రాజీనామా చేస్తారో కేసీఆర్ తేల్చువాలని డిమాండ్ చేస్తూ గవర్నర్ వద్దకు పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలకాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు యాత్రలో పాల్గొన్నారు.

దండకారణ్యం రక్తసిక్తం

(మొదటిపేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నారు. గంగలూరు నుంచి సుమారు 30 కిలోమీటర్లు కాలినడకన వెళ్లిన సైనికులు ఘటనా స్థలం నుంచి తిరిగి రావడానికి నానా అవస్థలు పడ్డారని ఐజీ తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఐఎన్ఎస్ఏఎస్ 303, 315 బోర్, 12 బోర్, బర్మార్ మొదలైన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను తీసుకొస్తున్న జవాన్లకు డీఐజీ కమలోచన్ కస్యప్, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదురెళ్లి అభినందనలు తెలిపారు. అంద్రి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో డీఆర్జీ బలగాలకు చెందిన జవాను మృతి చెందినట్టు ఎస్పీ తెలిపారు. ఎదురుకాల్పుల్లో డీఆర్జీ, ఎస్టీఎఫ్, మహిళా కమాండోలు పాల్గొన్నట్టు వివరించారు.

హిడ్మా కోసం గాలింపు

రాబోయే రోజుల్లో మావోయిస్టులపై పెద్ద ఎత్తున దాడులు జరిపేందుకు కేంద్రం తన బలగాలను రంగంలోకి దింపింది. మావోయిస్టు కమాండర్ హిడ్మా కోసం భద్రతా దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. హిడ్మాను వెతకడానికి 125కు పైగా గ్రామాల సాంకేతిక మ్యాపింగ్ జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న దాదాపు 125 గ్రామాల థర్మల్ ఇమేజింగ్‌ను భద్రతా దళాలు సిద్ధం చేసుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

మావోయిస్టులు దేశానికి ఒక పెద్ద సమస్య, ఈ సమస్యను పెకిలించడానికి అటు కేంద్రంలోని బీజేపీ, ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు వివిధ వ్యూహాల కింద పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా గత మూడు నెలల వ్యవధిలో భద్రతా దళాలు 77 మంది మావోయిస్టులను హతమార్చాయి.

హోంమంత్రి హర్షం

మావోయిస్టులపై జరిగిన ఈ దాడి పట్ల హోంమంత్రి అమిత్ షా సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మార్చి 31 లోపు నక్సల్ ఉగ్రవాదం అంతమవుతుందని ప్రకటించారు. 'మావోయిస్టు రహిత భారతదేశం ప్రచారం' దిశలో ఈ రోజు మన సైనికులు మరో పెద్ద విజయాన్ని సాధించారని ఆయన ఎక్స్‌లో రాశారు. మోడీ ప్రభుత్వం మావోయిస్టులపై క్రూరమైన వైఖరితో ముందుకు సాగుతోంది. లొంగిపోయిన వారికి అండగా నిలుస్తామని, లొంగని వారిని వదిలే ప్రసక్తేలేదంటూ కేంద్రం సంకేతాలిస్తోంది.

మావోయిస్టులను కట్టడి చేస్తే..

మావోయిస్టులను కట్టడి చేసినట్టయితే...కీలకమైన అటవీ సంపదను దోచుకోవచ్చని కేంద్రం ప్లాన్ చేస్తున్నదని పర్యావరణ వేత్తలు, గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం పర్యావరణానికి విఘాతం కలిగేలా పలు చట్టాలకు తూట్లు పొడుస్తోంది. కార్పొరేట్లకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్న మోడీ సర్కార్ మావోయిస్టుల ఏరివేతను శీఘ్రం చేసిందన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్..

(మొదటిపేజీ తరువాయి)

శర్మ అనే వ్యక్తి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎఫ్ఐఆర్ నెంబర్ 393/2025 కింద కేసులు సెక్షన్లు 318 (4) 112, 49 బీఎన్ఎస్ 3,3(ఏ) 4, టీఎస్ జీఏ, 66-డీ ఐటీఏ2000-2008 సెక్షన్ల కింద పలువురు సినీ ప్రముఖులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదైన వారిలో సినీ ప్రముఖులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాశ్‌రాజ్, నిధి అగర్వాల్, యాంకర్ శ్యామలతోపాటు మరికొందరి పేర్లు ఉన్నాయి. తదుపరి విచారణ అనంతరం వివరాలను వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

పనీర్‌తో ప్రయోజనాలు...



మనం వాడే ప్రతీ ఆహార పదార్థానికీ రకరకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. ఎంతో టేస్టీగా ఉండే పనీరు మన ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మన రెగ్యులర్ డైట్‌లో చేర్చుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో తెలుసుకుందాం.

ఎక్కువ మందికి సోకుతున్న రొమ్ము కాన్సర్ నుంచి మనల్ని కాపాడుతుంది. పాల ఉత్పత్తి అయిన పనీర్‌లో ఉండే కాల్షియం, విటమిన్ డి క్యాన్సర్ బారిన పడకుండా కాపడతాయి. బాడీలోని వివిధ రకాల ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. కండరాలు, నాడుల పనితీరు నిర్వహిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

ఇది మన గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు. రక్తంలోని షుగర్ లెవెల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ఇందులో ఉండే జింక్ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికీ, జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది.

పనీరులో కాల్షియం మోతాదు కూడా ఎక్కువే. ఇది పిల్లలు, పెద్దల్లో ఎముకలు పటిష్టంగా ఉండేలా చేస్తుంది. గర్భవతులకు అత్యుత్తమైన ఆహారమని చెప్పొచ్చు.

పనీర్‌లో ఎక్కువగా ఉండే ప్రోటీన్‌లు శాఖాహారులకు శక్తినిస్తాయి. ఇందులోని ఫాస్పరస్, ఫాస్ఫేట్‌లు జీర్ణక్రియను మెరుగుపరచి... మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసి, వాటిని వెలికి తీయడానికి సహాయపడతాయి.

పనీర్‌లో ఉండే వే ప్రోటీన్.. ఎంతో ఆరోగ్యవంతమైనది. ప్లేయర్లు, ఎక్సర్‌సైజ్‌లు చేసేవారికి ఇది మేలు చేస్తుంది. ఇది చాలా నెమ్మదిగా జీర్ణం అవుతూ, నెమ్మదిగా శక్తిని ఇస్తుంది. అందువల్ల అథ్లెటిక్స్, బాడీ బిల్డర్‌లు, స్ప్రింటర్‌లు, ఆటలు ఆడేవారికి ఇది ఎంతో మేలైన ప్రోటీన్.

రేచీకటిని నిరోధిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఆకలి లేకపోవడాన్ని నిరోధిస్తుంది. అలాగే ప్రొస్టేట్ రుగ్మతలను పోగొట్టి, వివిధ రకాల అంటువ్యాధులకు విరుద్ధంగా పోరాడుతుంది. సెలీనియం ఎక్కువగా ఉండే పనీరును తినడం వల్ల... మన శరీరంలోకి విష వ్యర్థాలు రాకుండా ఉంటాయి. అలాగే రకరకాల వ్యాధుల నుంచీ తప్పించుకోవచ్చు.

ఇందులో పొటాషియం కూడా ఉంటుంది. ఇది బాడీలో ద్రవ నియంత్రణ పదార్థంగా పని చేస్తుంది. రెగ్యులర్‌గా పనీరు తింటే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఆ కండ్లు వెన్నెల వాకిళ్లు. ఎలాంటి భావాన్నైనా చిటికెలో వ్యక్తపరుస్తాయి. అంతటి సుందర, సుమధుర నయనాలు ఆమెవి. అందం, అభినయం, నాట్యం ఈ మూడు ఆమె సొంతం. గొప్ప నాట్య కళాకారిణిగా కళకు సేవలు అందిస్తూ.. సినిమాల్లో నటించినా ఎక్కడ తన హుందాతనాన్ని కోల్పోలేదు. ప్రతి నర్తకి నటి కాకపోవచ్చు. ప్రతి నటి నర్తకి కాకపోవచ్చు. కానీ ఈమె మాత్రం ముందు బాలనటిగా, ఆ తర్వాత నర్తకిగా, ఆపై అనేక భాషా చిత్రాల్లో నటించారు. క్లాసికల్ డ్యాన్సర్‌గా లెక్కలేనన్ని ప్రదర్శనలు ఇచ్చారు. తన నటనతో ప్రేక్షకుల మనసులను దోచుకొని 2006లో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఏడాది పద్మభూషణ్ కూడా అందుకున్నారు. ఆమే ప్రముఖ నటి, కళాకారిణి శోభన. ఈ రోజు ఆమె పుట్టినరోజు సందర్భంగా మానవిలో ఆమె పరిచయం...



అభినయ తారక

1970, మార్చి 21న శోభన జన్మించారు. బాలనటిగా 1972లోనే కెమెరా ముందుకు వచ్చారు. అమ్మ ప్రేమ ఆమె తొలి చిత్రం. పెద్దయిన తర్వాత ఆమె హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం ఏప్రిల్ 18. ఇది ఒక మలయాళ చిత్రం. ఆ చిత్రంలో తన సహజమైన నటనతో పక్కింటి అమ్మాయిలా కనిపించడం ఆమెకు ప్లస్ అయ్యింది. ఆ తర్వాత ఆమెకు వరుసగా అనేక సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. అతి తక్కువ సమయంలోనే తీరిక లేనంతగా షూటింగ్‌లలో బిజీ అయిపోయారు.

తెలుగు పరిశ్రమలో...

శోభన సుమారు 230 సినిమాల్లో నటించారు. తెలుగులోనూ అగ్ర హీరోలు అందరితో తెర పంచుకున్నారు. భక్త ధ్రువ మార్కండేయ చిత్రంతో ఆమె తెలుగు పరిశ్రమంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత నాగార్జునతో కలిసి విక్రమ్ సినిమాలో నటించారు. అలాగే హెచ్చరిక, అభినందన, రుద్రవీణ, రౌడీ అల్లుడు, అల్లుడుగారు, అసాధ్యుడు, రక్షణలో నటించి తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. చంద్రముఖి(రజనీకాంత్) చిత్రానికి మూలమైన మలయాళ చిత్రం 'మణిచిత్రతాఝు'లో అద్భుతంగా నటించి ఉత్తమ నటిగా జాతీయ స్థాయిలో నిలిచారు.

కళకే అంకితం

శోభనకు నాట్యం అంటే ప్రాణం. నటన కంటే ఆమె నాట్యానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. 1994లో కళార్పణ అనే సంస్థను ఆమె ప్రారంభించారు. ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం భరతనాట్యంలో శిక్షణ, భారతదేశమంతటా నృత్యవార్షికోత్సవాలు నిర్వహించడం.

అదే విధంగా పలువురు పేద విద్యార్థులకు ఉచితంగా నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. నేటి తరానికి చెందిన ఎందరో కళాకారిణులు ఈమె వద్ద నటనలోనూ, నాట్యంలోనూ శిక్షణ తీసుకుంటున్నారు. ఈమె సేవలకు గాను 2006లో అబ్దుల్ కలాం చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును సైతం అందుకున్నారు. ఎంతో ఇష్టపడి నేర్చుకున్న శాస్త్రీయ నృత్యమే ఆమెకు సర్వస్వం. ఆమె మనసంతా, తనువంతా భరతనాట్యమే. ప్రస్తుతం ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ తన మనసుకు నచ్చిన నాట్యాన్ని తన జీవితానికి మరింత దగ్గర చేసుకున్నారు. శోభనను భారతదేశ అభినయ తారకగా చెప్పుకోవచ్చు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

శోభన నటి, నర్తకి, కొరియోగ్రాఫర్. తాను ప్రదర్శించే నృత్య ప్రదర్శనలకు ఆవిడే కర్త, కర్మ, క్రియ. అంటే స్క్రిప్ట్ రైటర్, క్రియేటర్, కంపోజర్. రంగస్థలం రూపకర్త కూడా. అన్ని విభాగాలలో ఆవిష్కరించే కళను ప్రేమిస్తూ, ఆరాధిస్తూ, అర్పిస్తూ దేశ విదేశాల్లో తన నాట్య ప్రదర్శనలు ఇస్తూ తన జీవితమంతా కళామతల్లి సేవకు అంకితం చేశారు. శోభన చెన్నైలోని చిదంబరం అకాడమీలో చిత్ర విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. ఆమె మలేషియా రాజు, రాణి ముందు తన నృత్య నైపుణ్యాన్ని ప్రదర్శించారు. శోభనను చాలా మంది వంపులు తిరిగిన భారతీయ శిల్పాల అందంతో పోలుస్తారు.





పాఠశాలలు స్థాపించి

సినీ పరిశ్రమకు ఆమె చేసిన సేవలతో పాటు చెన్నైలో శాస్త్రీయ భరతనాట్య నృత్యం కోసం ప్రధాన పాఠశాలలు స్థాపించారు. అలాగే భారతదేశం అంతటా వార్షిక ఉత్సవాలను ప్రారంభించారు. ప్రముఖ నర్తకీ మణులు, నటీమణులు అయినా లలిత, పద్మిని, రాగిణీలు ఈమెకు మేనత్తలవుతారు. వీరందరూ భారతీయ శాస్త్రీయ నృత్య నైపుణ్యానికి ప్రసిద్ధి చెందినవారు. శోభన సినిమాలో నటించిన ఎక్కడ హుందాతనాన్ని కోల్పోలేదు. సంప్రదాయ చీరకట్టులో మెరిసిన, మోడ్రన్ డ్రెస్‌లో మాయ చేసినా ఆమెకు ఆమే సాటి. శోభన వినయశీలి అని ఆమె ఆత్మీయులు తెగ మెచ్చుకుంటారు. తన అందం, అభినయంతో సినిమాలకు గ్లామర్ అద్దారు. క్లిష్టమైన సన్నివేశాల్లో అభినయాన్ని జోడించారు. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన శోభన ప్రతిభకు గుర్తింపుగా అనేక సాంస్కృతిక సంస్థలు ఎన్నో అవార్డులు, రివార్డులు, పురస్కారాలతో గౌరవించాయి. కేవలం సినిమా, నాట్యంలోనే కాకుండా పలు టీవీ షోలలో ఆమె న్యాయమూర్తిగా వ్యవహరించారు.



ఆమెకు ఆమే సాటి

అభినందన చిత్రంలో ఆమె నటన అద్భుతం. ప్రేమించిన వ్యక్తిని పెండ్లి చేసుకోలేక, చనిపోయిన తన అక్క పిల్లల కోసం, తండ్రి కోరిక కాదనలేక అక్క భర్తను వివాహంచేసుకుని, ప్రేమించిన వ్యక్తిని మర్చిపోలేక, ఇటు భర్తకు దగ్గర కాలేక ఆమె పడిన మానసిక వేదన వర్ణనాతీతం. అద్భుతమైన నటనతో తక్కువ డైలాగులతో, కేవలం హవ భావాలతోనే తనలోని సంఘర్షణను నటన ద్వారా వ్యక్తపరచడంలో ఆమెకు ఆమె సాటి అనిపించుకున్నారు. ఇలా ఆమె ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల మనసులో అజరామరంగా నిలిచిపోయాయి. ఆమె మరెన్నో పురస్కారాలు అందుకోవాలని, తన నాట్య క్షేత్రం ద్వారా ఎందరో కళాకారులను తీర్చి దిద్దాలని ఆకాంక్షిస్తూ...

- పాలపర్తి సంధ్యారాణి

ఇండ్లు లేని నిరుపేదలు 30 లక్షల మంది

(మొదటిపేజీ తరువాయి)

అమలుకు నోచుకోలేదని అన్నారు. బీసీ సంక్షేమానికి రూ. 11,400 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 7.6 శాతం మాత్రమే నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ అమలుకు కృషి చేయాలన్నారు. ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో కోత విధించారన్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం, స్థానిక సమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ నెల మొత్తం సర్వేలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గుర్తించిన సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్, మండ్ల రాజు, జిఎస్ గోపి, ఏ.లక్ష్మి, నాయకులు ఆర్ఎన్ రమేష్, ఎస్.రాజు, పరమేశ్వర చారి, బి.వెంకటేష్, జి.వెంకటయ్య, వెంకట్, రాములు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం, ఠాను నాయక్‌కు నివాళులు

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకులు మల్లు స్వరాజ్యం, ఠానునాయక్ వర్ధంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు జాన్‌వెస్లీ పూలమాలలేసి నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం, ఠాను నాయక్ ఆశయ సాధన కోసం దున్నేవానికి భూమి పంచేవరకు పోరాటాలు చేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు.

మూతపడుతున్న ఎంఎస్ఎంఈలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి జితన్ రామ్ మఝీ లోక్‌సభకు ఇచ్చిన వివరాల ప్రకారం గత పది సంవత్సరాలలో యాభై వేల చిన్న చిన్న వ్యాపారాలు మూతపడడంతో మూడు లక్షల మంది రోడ్డున పడ్డారు. పోర్టల్‌లో రిజిస్టరైన పది లక్షల ఎంఎస్ఎంఈలలో 49,342 మూతపడ్డాయని, ఫలితంగా 3,17,641 మంది ఉద్యోగాలు కోల్పోయారని మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కంపెనీ యాజమాన్యంలో మార్పులు, అవసరం లేని సర్టిఫికెట్లు, డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు వంటి పలు కారణాల వల్ల చిన్న పరిశ్రమలను మూసివేస్తున్నారని మంత్రి తెలిపారు.

అంగన్‌వాడీ, ఆశాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్స్యూరెన్స్, వీఆర్ఎస్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలను చేశారని పేర్కొన్నారు. వారి సమస్యలు పరిష్కరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సందర్భాల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ అవి అపరిష్కృతంగానే ఉన్నాయని తెలిపారు. వారి న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రయివేటీకరణతోపాటు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని విమర్శించారు. పీఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలోని 28 జిల్లాల్లోని 56 కేంద్రాల్లో ప్రారంభించిందనీ, మొబైల్ అంగన్‌వాడీల పేరుతో కొత్త విధానాన్ని తెస్తున్నదని వివరించారు. దీంతో పేదలు అంగన్‌వాడీ కేంద్రం అందిస్తున్న సేవలకు దూరమవుతారని తెలిపారు. ఫలితంగా ఐసీడీఎస్ బలహీనపడి మూతపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పీఎంశ్రీ పథకంతోపాటు, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రాష్ట్రంలో పూర్తిగా రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. వారికి రావాల్సిన 10 నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలతోపాటు, టార్గెట్ రద్దు లాంటి అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారని జాన్‌వెస్లీ తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి, పరిష్కారానికి ఐఏఎస్ అధికారితో కమిటీ వేసి, ఆ ప్రతిపాదనల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు వేతనాలను పెంచుతామనీ, ఉద్యోగ భద్రత కల్పిస్తామనీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చిందని తెలిపారు. కానీ వారి సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సెలవులు, ఏఎన్సీ, పీఎన్సీ తదితర టార్గెట్ల రద్దు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు, అన్ని ఆస్పత్రుల్లో ఆశాలకు విశ్రాంతి గదుల ఏర్పాటు, పారితోషికాల్లో సగం పెన్షన్ తదితర న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

భారత్ సుంకాలు తగ్గిస్తుందనుకుంటున్నా

(మొదటిపేజీ తరువాయి)

వాణిజ్య సుంకాలను న్యూ ఢిల్లీ తగ్గిస్తుందని విశ్వసిస్తున్నట్టు చెప్పారు.తాజాగా ఆయన బ్రెయిట్‌బార్ట్ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడుతూ.. 'నాకు భారత్‌తో మంచి సంబంధం ఉంది. కానీ ఏకైక సమస్య ఏంటంటే.. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. భారత్ టారిఫ్‌లను గణనీయంగా తగ్గించే అవకాశం ఉన్నట్టు నేను నమ్ముతున్నాను. కానీ, ఏప్రిల్ 2 నుంచి వారెంత విధిస్తే.. మేమూ అంతే వసూలు చేస్తాం' అని ట్రంప్ అన్నారు.

అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు : భారత్

కాగా, అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు ఆ దేశానికి భారత్ ఎలాంటి హామీ ఇవ్వలేదని కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ బార్త్వాల్ పార్లమెంటరీ ప్యానెల్‌కు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. 'టారిఫ్‌లను తగ్గించడానికి భారత్ అంగీకరించింది' అంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయన పార్లమెంటరీ కమిటీకి వివరణ ఇచ్చారు. సుంకాల విషయంపై ఇరు దేశాల మధ్య ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని, ఆ దేశానికి ఎలాంటి హామీ ఇవ్వలేదని ఆయన తెలిపారు.

గాజాపై భూతల దాడులు

దేర్ అల్ బాలాహ్ : కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యలోనే తూట్లు పొడిచి విచక్షణారహితంగా దాడులు చేపట్టిన ఇజ్రాయిల్ మిలటరీ గురువారం నుంచి గాజాపై భూతల దాడులను తిరిగి ప్రారంభించింది. ఉత్తర ప్రాంతమైన బెయిట్ లాహియా ఏరియాలో దాడులు జరుగుతున్నాయి. బందీలను వెనక్కి పంపడానికి, అధికారం నుంచి హమాస్‌ను తొలగించడానికి పాలస్తీనియన్లకు ఇదే చివరి హెచ్చరిక అని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ గాజావాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న వీడియోను విడుదల చేశారు. "అమెరికా అధ్యక్షుని సలహాను గమనంలోకి తీసుకోండి, బందీలను అప్పగించండి, హమాస్‌ను అధికారం నుండి తొలగించండి, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వెళ్ళే అవకాశంతో సహా మీకు ఇతరత్రా మార్గాలు కూడా తెరుచుకుంటాయి." అని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలా వుండగా, గురువారం తెల్లవారుజాము నుంచి జరిగిన దాడుల్లో 85మంది మరణించారు. 133మంది గాయపడ్డారుని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఖాన్ యూనిస్ సమీపంలో జరిగిన బాంబు దాడుల్లో పది మంది మరణించారని పాలస్తీనా సహాయక బృందాలు వెల్లడించాయి. గత మూడు రోజుల దాడుల్లో మొత్తంగా 200మంది వరకు చిన్నారులు మరణించారని మొత్తంగా 506మంది ప్రాణాలు కోల్పోయారని ఆ వర్గాలు తెలిపాయి. జనవరి మధ్య నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో నెలకొన్న నిశ్శబ్ద వాతావరణం ఒక్కసారిగా ఈ దాడులతో చెదిరిపోయింది. దీంతో పాలస్తీనియన్ల ఆశలు కల్లలయ్యాయి. సెంట్రల్, దక్షిణ గాజా ప్రాంతాల్లో భద్రతా వలయాన్ని విస్తరించేందుకు, ఉత్తర, దక్షిణ గాజాల మధ్య పాక్షిక బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు తాము భూతల ఆపరేషన్లు తిరిగి ప్రారంభిస్తామని బుధవారమే ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కాపాడాలని అంతర్జాతీయ సమాజం ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఇజ్రాయిల్ వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో మళ్ళీ అమానుష దాడులకు గురవడం తప్ప పాలస్తీనియన్లకు మరో మార్గం లేకపోయింది. కాగా, ఇప్పటికీ తాము చర్చలకు సిద్ధంగానే వున్నామని హమాస్ ప్రకటిస్తోంది. దాడులను ఆపేందుకు అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకోవాలని కోరుతోంది. మార్చి మొదటివారంలో మొదటి దశ ముగిసిన తర్వాత కాల్పుల విరమణ విషయంలో ఎలా ముందుకు వెళ్ళాలనే అంశంపై చర్చలు స్తంభించిపోయాయి. కాల్పుల విరమణ మూడు దశలను అమలు చేయడానికి మరింతగా కృషి జరగాల్సి వుందని ఖతార్, ఈజిప్టులు పేర్కొన్నాయి.

యెమెన్ క్షిపణి దాడులు

గురువారం తెల్లవారు జామున యెమెన్ క్షిపణి దాడి జరపడంతో ఇజ్రాయిల్‌లో పలు చోట్ల సైరన్లు మోగాయి. ఆ వెంటనే జెరూసలేంలో అనేక చోట్ల పేలుళ్ళ శబ్దాలు వినిపించాయి. అయితే ఎవరూ గాయపడినట్టు వార్తలందలేదు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుప్పకూలిన నేపథ్యంలో తాము క్షిపణి దాడులను పునరుద్ధరిస్తున్నామని ఈ వారంలో యెమెన్ హౌతి గ్రూపు ప్రకటించింది.

బీఆర్‌ఎస్ ఓటమికి అసూయ, ద్వేషమే కారణం..

రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ సీఎం

బడ్జెట్ అంతా బోగస్..ఆరు గ్యారంటీలు గోవిందా..

కాంగ్రెస్‌తో కరువు వచ్చింది

ఢిల్లీకి రాష్ట్రం డబ్బుల మూటలు

ఏప్రిల్ 27న వరంగల్ సభను విజయవంతం చేయాలి

సూర్యాపేటలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-సూర్యాపేట

తమ పార్టీలో నేతల మధ్య అసూయ, ద్వేషంతోపాటు కాంగ్రెస్ చెప్పిన హామీల ఆశ వల్ల బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, రేవంత్‌రెడ్డి జాక్‌పాట్‌లో రాష్ట్రానికి సీఎం అయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. యూట్యూబర్లను అడ్డం పెట్టుకుని సీఎం అయిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అదే యూట్యూబర్లను బట్టలూడదీసి కొడతానని అంటున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నేతల్ని సోషల్ మీడియాలో ఎంతగా తిట్టారో అందరికీ తెలుసని, ఇప్పుడు తన వరకు వచ్చే సరికి యూట్యూబర్లపై కేసులు పెడుతున్నారని, బెదిరిస్తున్నారని అన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే నవ్వాలో ఏడ్వాలో తెలియని పరిస్థితి ఉందన్నారు.

రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదని కేటీఆర్ విమర్శించారు. రుణమాఫీ పథకం అమలు కోసం రూ.49,500 కోట్లు కావాలని నిర్ణయించి.. మూడో రోజు అది రూ.40 వేల కోట్లకు చేరిందని విమర్శించారు. క్యాబినెట్‌లో రుణమాఫీకి రూ.31 వేల కోట్లు మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అనంతరం కేవలం రూ.26,500 కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పిందని తెలిపారు. ఇందులో రూ.20 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్టు స్వయంగా ఆర్థిక మంత్రి ప్రకటించారని, ఇలాంటప్పుడు రైతులందరికీ రుణమాఫీ చేసినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రేవంత్ అనేటోడు వికృతమెంటాల్టీ కలిగిన వాడని, పర్సంటేజ్‌లు తప్ప వేరే ధ్యాస లేదని ఆరోపించారు. బడ్జెట్ అంతా బోగస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు.. గోవిందా.. అని ఎద్దేవా చేశారు. తెలంగాణ డబ్బులన్నీ ఢిల్లీకి తీసుకెళ్లి రాహుల్ గాంధీ ఖాతాల్లో వేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సొమ్ముతో ఢిల్లీకి కప్పం కడుతున్నారని, కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చిందని ఎద్దేవా చేశారు. ఎస్సారెస్పీ కింద కాళేశ్వరం ద్వారా పొలాలను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని, ప్రస్తుత సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నా వేస్ట్ అని, ఆయన వల్ల ఏం కాదని జిల్లాలో నీళ్ల ఇవ్వలేని ఉత్తమంత్రిగా మిగిలారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌పై కోపంతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో కృష్ణా నీటిని 36శాతం వినియోగిస్తే.. ఇప్పుడు 24 శాతం కూడా వాడలేదన్నారు. బడే బాయ్ చోట బాయ్ ఇద్దరూ ఒక్కటే అని, రేవంత్‌ను బీజేపీ కాపాడుతుందని చెప్పారు. వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల వేడుకలకు భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

వచ్చే ఏడాది పాదయాత్ర : కేటీఆర్

అనంతరం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాల పర్యటనలు ప్రారంభించానని, వచ్చే ఏడాది తాను పాదయాత్ర చేస్తానని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కరరావు, రామావత్ రవీంద్ర కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉభయ సభలకు తమిళ ఎంపీల టీషర్టుల సెగ

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. టీ షర్టులను తీసివేసి వారు సభకు వస్తే వివిధ పార్టీల నాయకులతో చర్చించాల్సిన కొన్ని విషయాలున్నాయన్నారు. ఛైర్మెన్ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో టీ-షర్టులు తొలగించే ప్రసక్తే లేదని డీఎంకే ఎంపీలు స్పష్టం చేశారు. వాయిదా అనంతరం మధ్యాహ్నం సభ ప్రారంభమైనపుడు టీ-షర్టు అంశంపై వాదనలు చోటుచేసుకున్నాయి. అనంతరం డిప్యూటీ స్పీకర్ సభను శుక్రవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కనిమొళి నేతృత్వంలోని డీఎంకే ఎంపీలు పార్లమెంటు వెలుపల డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా నిరసన తెలిపారు. తమిళనాడు న్యాయమైన డీలిమిటేషన్‌కు పట్టుబడుతోందని, కేంద్రం అవలంభించాలన్న విధానం వల్ల దాదాపు 7 రాష్ట్రాలు ప్రభావితమవుతాయని వారు తెలిపారు. కేంద్రం నుంచి ఈ అంశంపై స్పష్టత రాలేదని, న్యాయమైన డీలిమిటేషన్ వచ్చే వరకు నిరసనను కొనసాగిస్తుంటామని డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ స్పష్టం చేశారు.


కెప్టెన్ల సమావేశం అనంతరం ఐపీఎల్ 2025 ట్రోఫీతో పది జట్ల సారథులు

ఇక ఉమ్మి వాడొచ్చు!

- ఐపీఎల్‌లో ఉమ్మిపై నిషేధం ఎత్తివేత
- రెండో ఇన్నింగ్స్‌లో రెండు కొత్త బంతులు

2025 ఇండియన్ ప్రీమియర్ లీగ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 హంగామా శనివారం నుంచి షురూ కానుండగా.. సరికొత్త నిబంధనలు లీగ్ బరిలో నిలిచిన బౌలర్లలో జోష్ తీసుకొచ్చింది. పేసర్లు రివర్స్ స్వింగ్ రాబట్టేందుకు అడ్డుగా ఉన్న ఉమ్మి వాడకంపై నిషేధాన్ని ఐపీఎల్ నిర్వాహకులు ఎత్తివేశారు. మంచు ప్రభావంలో లక్ష్యాలను కాపాడుకునే బౌలింగ్ జట్లకు సైతం భారీ ఉపశమనం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు ఇక నుంచి రెండు కొత్త బంతులు అందించనున్నారు. ఐపీఎల్, పది జట్ల కెప్టెన్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.

నవతెలంగాణ-ముంబయి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ సరికొత్త నిబంధనలతో ముందుకొస్తుంది. నెట్టింట చర్చనీయాంశంగా మారిన ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను కొనసాగిస్తూనే.. ధనాధన్ సమరంలో బౌలర్లకు సైతం ఊతం అందించేందుకు కీలక మార్పులు చేశారు. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఐపీఎల్ పది జట్ల కెప్టెన్లతో టెక్నికల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంతిపై మెరుపు పోగొట్టేందుకు 'ఉమ్మి' వాడకంపై కొనసాగుతున్న నిషేధాన్ని ఏకగ్రీవంగా ఎత్తివేశారు. మంచు ప్రభావం ఎక్కువగా కనిపించే నైట్ మ్యాచుల్లో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు రెండు కొత్త బంతులు అందించనున్నారు. తొలి పది ఓవర్లు, చివరి పది ఓవర్లు కొత్త బంతితో బౌలర్లు దాడి చేసేందుకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ మేరకు భారత క్రికెట్ బోర్డు వర్గాలు తెలుపగా.. ఫ్రాంచైజీలకు అధికారికంగా సమాచారం అందించనున్నారు.

రివర్స్ స్వింగ్‌కు చాన్స్!

కరోనా మహమ్మారి సమయంలో ఆటగాళ్ల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని బంతిపై ఉమ్మి వాడకాన్ని ఐసీసీ నిషేధించింది. కోవిడ్-19 ప్రభావం ముగిసినా.. 2022 ఐసీసీ సమావేశంలో ఉమ్మిపై శాశ్వత నిషేధం కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఉమ్మి వాడకంపై ఆంక్షలతో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో బౌలర్లకు రివర్స్ స్వింగ్ అసాధ్యంగా మారిందని పేసర్లు గళమెత్తారు. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ విజయానంతరం భారత పేసర్ మహ్మద్ షమి ఉమ్మి వాడకంపై నిషేధం తొలగించాలని ఐసీసీని కోరాడు. ఇతర దేశాలకు చెందిన పేస్ బౌలర్లు సైతం షమికి మద్దతుగా నిలిచారు. ఉమ్మి వాడకంతో వన్డేల్లో రివర్స్ స్వింగ్‌కు అవకాశం ఉన్నప్పటికీ.. టీ20ల్లో ఆ ప్రభావం స్వల్పమేనని చెప్పవచ్చు. నాణ్యమైన ప్రపంచ శ్రేణి పేసర్లు మాత్రమే తక్కువ సమయంలో బ్యాటర్లను ఇరకాటంలో పడేయగల రివర్స్ స్వింగ్ మాయజాలం ప్రదర్శించగలరు.

టాస్ ప్రాధాన్యత లేనట్టే!

ఐపీఎల్ 2025లో అమలు చేయనున్న మరో కీలక నిబంధన రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు రెండు కొత్త బంతులు అందుబాటులో ఉంచటం. ఐపీఎల్ మ్యాచ్‌లకు మంచు ప్రభావం ఎక్కువ. కొన్ని స్టేడియాల్లో టాస్‌తోనే ఫలితాన్ని అంచనా వేయవచ్చు. ఇరు జట్లకు సమాన అవకాశాలు కల్పించేందుకు రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు రెండు కొత్త బంతులు ఇవ్వనున్నారు. 1-10 ఓవర్లకు, 11-20 ఓవర్లకు కొత్త బంతులను అందుబాటులో ఉంచుతారు. దీంతో మంచు ప్రభావంతో బంతి మెత్తబడి బౌలర్లకు పట్టుచిక్కదనే సమస్య ఉత్పన్నం కాబోదు. ఈ నిబంధన మధ్యాహ్నం జరిగే మ్యాచులకు వర్తించదు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే మ్యాచులకు గతంలో మాదిరిగానే ఒక్క బంతినే ఇస్తారు.

కెప్టెన్లకు ఉపశమనం

స్లో ఓవర్ రేట్ అంశంలో కెప్టెన్ల మెడపై కత్తి తొలగింది. ఐపీఎల్‌లో స్లో ఓవర్ రేట్‌కు మ్యాచ్ ఫీజులో కోతతో పాటు మ్యాచ్ నిషేధం సైతం విధిస్తున్నారు. ఈ రూల్ కారణంగానే ముంబయి ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్య దూరమయ్యాడు. ప్రస్తుత మ్యాచ్ నిషేధం రూల్ స్థానంలో ఐసీసీ తరహా డీ మెరిట్ పాయింట్ల పద్దతిని ప్రవేశపెట్టారు. స్లో ఓవర్ రేట్‌తో పాటు క్రమశిక్షణ ఉల్లంఘనలకు సైతం డీ మెరిట్ పాయింట్లు ఇస్తారు. డీ మెరిట్ పాయింట్ల కాల వ్యవధి మూడేండ్ల పాటు ఉంటుంది. లెవల్ 1 పొరపాట్లకు మ్యాచ్ ఫీజులో 25 నుంచి 75 శాతం జరిమానా సహా డీ మెరిట్ పాయింట్లు విధిస్తారు. లెవల్ 2 అఫెన్స్‌కు వంద శాతం జరిమానాతో పాటు నాలుగు డీ మెరిట్ పాయింట్లు వేస్తారు. దీనికి తోడు హైట్ నో బాల్‌కు సైతం డీఆర్ఎస్ సమీక్షను తీసుకునే వెసులుబాటు కల్పించారు.



ఐఓసీ అధ్యక్ష పీఠంపై ఆఫ్రికా మహిళ

ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కిర్‌స్టీ లీ కోవెంట్రీ సెవార్డ్

కోస్టా నవారినో (గ్రీస్) : అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్ష పీఠంపై తొలిసారి ఓ మహిళ కూర్చోనుంది. జింబాబ్వే క్రీడా శాఖ మంత్రి, ఒలింపిక్ స్విమ్మర్ కిర్‌స్టీ లీ కోవెంట్రీ (41) 134 ఐఓసీ చరిత్రలో తొలి ఆఫ్రికా, తొలి మహిళా ప్రెసిడెంట్ కానుంది. గ్రీసులోని కోస్టా నవారినోలో జరుగుతున్న ఐఓసీ సెషన్లో అధ్యక్ష పదవి కోసం ఏడుగురు పోటీపడగా.. రహస్య బ్యాలెట్ విధానంలో జరిగిన ఎన్నికలో కిర్‌స్టీ ఎన్నికయ్యారు. ఐఓసీలో 109 మంది ఓటర్లు ఉండగా.. 97 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి రౌండ్లో 47 ఓట్లు సాధించిన కిర్‌స్టీ స్పష్టమైన మెజారిటీతో ఐఓసీ పదో ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఐఓసీ ప్రస్తుత ప్రెసిడెంట్ థామస్ బాచ్ 12 ఏండ్ల తర్వాత పదవి నుంచి తప్పుకోనున్నాడు. జూన్ 23న ఒలింపిక్ డే సందర్భంగా కొత్త అధ్యక్షురాలు పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. థామస్ బాచ్ గౌరవ అధ్యక్షులుగా కొనసాగనున్నారు.

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీలో కిర్‌స్టీ ప్రస్థానం 2012లో మొదలైంది. తొలుత ఐఓసీ అథ్లెట్స్ కమిషన్‌కు ఎన్నికైన కిర్‌స్టీ.. ఐఓసీ సభ్యురాలిగా ఎనిమిదేండ్లు పని చేశారు. 2023లో ఐఓసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నికయ్యారు. 2024 సెప్టెంబర్‌లో అధ్యక్ష రేసులో మరో ఆరుగురితో కలిసి బరిలో నిలిచారు. అథ్లెట్‌గా కిర్‌స్టీ ఆఫ్రికా నుంచి అత్యంత విజయవంతమైన స్విమ్మర్. 2000-2016 సమయంలో ఐదు ఒలింపిక్స్‌లో పోటీపడిన కిర్‌స్టీ ఈత కొలనులో ఏడు పతకాలు సాధించింది.

లాస్‌ఏంజిల్స్‌లో బాక్సింగ్

వరల్డ్ బాక్సింగ్‌కు ఐఓసీ గుర్తింపు

న్యూఢిల్లీ : ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌పై కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నూతనంగా ఏర్పడిన వరల్డ్ బాక్సింగ్ (డబ్ల్యూబీ) సంఘానికి గుర్తింపు ఇస్తూ సోమవారం నిర్ణయం తీసుకోగా... 2028 లాస్ ఏంజిల్స్‌లో బాక్సింగ్ క్రీడ ఉంటుందని అధికారికంగా సమాచారం అందించింది. రియో ఒలింపిక్స్ తర్వాత ప్రపంచ బాక్సింగ్ సమాఖ్యతో విభేదాలు రావటంతో టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్ మ్యాచులను స్వయంగా ఐఓసీ నిర్వహించింది. తాజాగా థామస్ బాచ్ అధ్యక్షతన జరిగిన ఐఓసీ సెషన్లో 2028 ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు చేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఉప ముఖ్యమంత్రికి శాట్ చైర్మెన్ సత్కారం

క్రీడలకు భారీ కేటాయింపులపై భట్టికి శివసేనారెడ్డి ధన్యవాదాలు



హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు భారీ కేటాయింపులు చేయటం పట్ల తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మెన్ కే. శివసేనా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో క్రీడలకు రూ.134.8 కోట్లు మాత్రమే కేటాయించగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం క్రీడా రంగానికి రూ.465 కోట్లు కేటాయింపులు చేయటం చరిత్రాత్మకమని శివసేనారెడ్డి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం కలిసిన శివసేనారెడ్డి క్రీడా సమాజం తరపున శాలువాతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. పదేండ్లలో కుంటుపడిన క్రీడారంగాన్ని చక్కదిద్ది, దేశంలోనే తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దటంతో పాటు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సిద్ధం చేయాలని ఈ సందర్భంగా శివసేనతో భట్టి విక్రమార్క అన్నారు. తొలి ఏడాదే రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు అంచెల్లో సీఎం కప్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన శాట్ యంత్రాంగాన్ని డిప్యూటీ ముఖ్యమంత్రి అభినందించారు. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే ఈ సారి క్రీడలకు రూ.100 కోట్లు అదనంగా కేటాయింపులు చేసిన సంగతి తెలిసిందే.

24 నుంచి ఏవైసీఏ, టీడీసీఏ క్రికెట్ టోర్నీ

ట్రోఫీ, జెర్సీలు ఆవిష్కరించిన డీజీపీ జితేందర్



హైదరాబాద్ : ఈ నెల 24 నుంచి అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమి (ఏవైసీఏ), తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ రూరల్) అండర్-17 క్రికెట్ టోర్నమెంట్ ఆరంభం కానుంది. ఏవైసీఏ జట్టుతో టీడీసీఏ రూరల్ వారియర్స్, రూరల్ రైజర్స్, రూరల్ పాంథర్స్ జట్లు రౌండ్ రాబిన్ పద్దతిలో పోటీపడనున్నాయి. 50 ఓవర్ల ఫార్మాట్‌లో జరుగనున్న ఈ టోర్నమెంట్ ట్రోఫీలు, జెర్సీలను తెలంగాణ డిజీపి జితేందర్ గురువారం ఆవిష్కరించారు. 'తెలంగాణ రూరల్ క్రికెటర్లకు అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం అందించేందుకు అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీతో టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయం. గ్రామీణ క్రికెటర్లు సత్తా, సామర్థ్యం నిరూపించుకునేందుకు ఈ టోర్నమెంట్ ఓ మంచి వేదిక. క్షేత్రస్థాయిలో క్రికెట్ అభివద్ధికి పాటుపడుతున్న టీడీసీఏకు అభినందనలు' అని ట్రోఫీ ఆవిష్కరణ సందర్భంగా డిజీపి జితేందర్ అన్నారు. కార్యక్రమంలో టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ ప్రెసిడెంట్ అరుణ్ కొలిపాక, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చైర్మెన్ రామిరెడ్డి, టీడీసీఏ కన్వీనర్లు ఉస్మాన్ అలీ, సయ్యద్ నవాజ్ షా, సుధీర్ రెడ్డి, మనీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయల్స్ కెప్టెన్‌గా పరాగ్

గాయం నుంచి కోలుకోని సంజు శాంసన్

ధర్మశాల : ఐపీఎల్ తొలి సీజన్ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ తొలి మూడు మ్యాచులకు దూరం అయ్యాడు. చేతి వేలి గాయానికి గురైన సంజు శాంసన్‌కు గత నెలలో శస్త్రచికిత్స జరిగింది. బెంగళూర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్ ముగించుకుని సోమవారమే రాయల్స్ శిబిరంలో చేరాడు. దీంతో రియాన్ పరాగ్ తొలి మూడు మ్యాచులకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని ఆ ఫ్రాంచైజీ వెల్లడించింది. వేలి గాయంతో వికెట్ కీపింగ్ శాంసన్‌కు కష్టంగా మారనుంది. ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా తుది జట్టులో నిలువనుండగా.. సంజు శాంసన్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటర్‌గా మెరిసే అవకాశాలు ఉన్నాయి. కెరీర్‌లో తొలిసారి కెప్టెన్సీ వహించనున్న రియాన్.. ఐపీఎల్‌లో సారథ్య పగ్గాలు అందుకున్న ఐదో పిన్న వయస్కుడిగా నిలువనున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరుగనుంది.

నవచిత్రం

'ప్రేమ వెల్లువ..'తో పాటల సందడి షురూ


శ్రీనిధి శెట్టి, నాని

'హిట్' సిరీస్‌లో భాగంగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'హిట్ : ది థర్డ్ కేస్'. నాని, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'ప్రేమ వెల్లువ..'
ఈనెల 24న విడుదల కానుంది. ఈ రొమాంటిక్ ట్రాక్ నాని, శ్రీనిధి శెట్టి మధ్య బ్యూటీఫుల్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేయనుంది. ఇది అభిమానులకు సినిమా ఇంటెన్స్, క్రైమ్ థ్రిల్లర్ నెరేటివ్‌కి రిఫ్రెషింగ్‌ని అందిస్తుంది. అలాగే ఈ ఫస్ట్ సింగిల్ బ్యూటీఫుల్ మెలోడీగా ఉండనుంది. మిక్కీజెమేయర్ కంపోజిషన్ శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేయనుంది. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రం అత్యంత విజయవంతమైన 'హిట్' ఫ్రాంచైజీలో మూడవ భాగం. టీజర్, పోస్టర్‌లు సినిమాపై భారీ బజ్‌ని క్రియేట్ చేశాయి. వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ సినిమా మే 1న విడుదల కానుంది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కళాకారులను, సాంకేతిక నిపుణులను తద్వారా చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తూ గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేసే కార్యక్రమాన్ని తలపెట్టిన ముఖ్యమంత్రి రేవంతిరెడ్డికి తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. 2024 ఏడాదిగాను ఉత్తమ చలన చిత్రాలకు, ఉత్తమ కళాకారులు, సాంకేతిక నిపుణులకు తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని ప్రముఖులు, గొప్ప వ్యక్తుల (1) ఎన్టీఆర్ జాతీయ చలనచిత్ర అవార్డు (2) పైడి జైరాజ్ చలనచిత్ర అవార్డు (3) బి.ఎన్. రెడ్డి చలనచిత్ర అవార్డు (4) నాగి రెడ్డి మరియు చక్రపాణి చలనచిత్ర అవార్డు (5) కాంతారావు చలనచిత్ర అవార్డు (6) రఘుపతి వెంకయ్య చలనచిత్ర అవార్డు... పేర్ల మీద 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'ను ప్రదానం చేయటం అభినందనీయం.
ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, టిఎఫ్‌డీసి చైర్మన్ వి.వెంకటరమణ రెడ్డి (దిల్రాజు)కి తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం చలనచిత్ర అవార్డులను పునరుద్ధరించడం పట్ల తెలుగు చలనచిత్ర పరిశ్రమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఇది తెలంగాణలో చలనచిత్ర నిర్మాణాన్ని మరింతగా ప్రోత్సహిస్తుంది అని టీఎఫ్‌పీసీ కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ అన్నారు.

రాజమండ్రి షెడ్యూల్ పూర్తి



రామ్ పోతినేని కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమాను నిర్మిస్తోంది.
'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' విజయం తర్వాత మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది.
రాజమండ్రిలో సెకండ్ షెడ్యూల్ ముగించుకుని చిత్ర బృందం హైదరాబాద్ వచ్చింది.
రాజమండ్రిలో 34 రోజుల పాటు నాన్ స్టాప్‌గా డే అండ్ నైట్ షూటింగ్ చేశారు. ఈ షెడ్యూల్‌లో రెండు పాటలతో పాటు ఒక యాక్షన్ సీక్వెన్స్, ఇంకా ఇంపార్టెంట్ టాకీ సీన్స్ చిత్రీకరణ చేశారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని అందమైన లొకేషన్లను, అంతే అందంగా క్యాప్చర్ చేశామని చిత్ర బృందం తెలిపింది.
రాజమండ్రిలో జరిగిన చిత్రీకరణలో హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సహా రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ తదితర తారాగణం మీద చిత్రీకరించారు. ఈనెల 28వ తేదీ నుంచి హైదరాబాద్ షెడ్యూల్ మొదలవుతుందని నిర్మాతలు తెలిపారు.

'సింగిల్' రిలీజ్ డేట్ ఫిక్స్


శ్రీ విష్ణు, కేతిక శర్మ

హీరో శ్రీ విష్ణు ఈ వేసవిలో తన మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'సింగిల్'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు.
గీతా ఆర్ట్స్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు.
మేకర్స్ అధికారికంగా ప్రకటించినట్లుగా మే 9న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. రిలీజ్ పోస్టర్ మూవీ హ్యూమర్ నేచర్‌ని సూచిస్తుంది. శ్రీ విష్ణు పాత్రను పగటిపూట కేర్ ఫ్రీ ఫ్రెండ్‌గా, నైట్ రొమాంటిక్ పర్సన్‌గా.. ఇలా రెండు డిఫరెంట్ వేరియేషన్స్‌లో ప్రజెంట్ చేస్తోంది. శ్రీ విష్ణు సరసన కేతిక శర్మ, ఇవాన హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ అలరించే వినోదాత్మక చిత్రంగా ఉండనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ సినిమాలో ఓ మ్యాజిక్ ఉంది: మోహన్ లాల్



మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమార్ కాంబోలో తెరకెక్కిన భారీ చిత్రం 'ఎల్ 2 ఎంపురాన్'.
ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్లపై ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించారు. మురళీ గోపి కథ అందించారు. ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 27న మలయాళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను ఐమ్యాక్స్ ఫార్మేట్‌లో విడుదల చేశారు.
ఈ సందర్భంగా మోహన్ లాల్ మాట్లాడుతూ, 'ఈ సినిమా జర్నీ మరచిపోలేని అనుభవం. ఇలాంటి పాన్ ఇండియా సినిమాను రూపొందించటానికి మా ప్రయాణం ఏడేళ్లుగా కొనసాగుతోంది. ఇలాంటి భారీ చిత్రాన్ని గొప్పగా తెరకెక్కించార పృథ్వీరాజ్. దీన్ని సినిమా అని చెప్పటం కంటే మా చెమట, రక్తం అని చెప్పొచ్చు. ఇదొక ట్రయాలజీ మూవీ. అందులో ఇప్పటికే లూసిఫర్ సినిమా వచ్చింది. ఈనెల 27న ఈ సినిమా రానుంది. మరో సినిమాను రూపొందించాల్సి ఉంది. మలయాళ సినీ ఇండస్ట్రీ నుంచి వస్తోన్న తొలి ఐమ్యాక్స్ ఫార్మేట్ మూవీ ఇది. సినిమాకు వస్తోన్న రెస్పాన్స్ చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. ఈ మూవీలో మ్యాజిక్ ఉంది. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా సినిమాను చూడటానికి ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాను ఆడియెన్స్‌తో కలిసి చూడాలనుకుంటున్నాను' అని అన్నారు.


వైష్ణవి చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

ప్రేక్షకుల్ని నవ్వించే 'జాక్'

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్ - కొంచెం క్రాక్'. వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'కిస్..' అంటూ సాగే రొమాంటిక్ సాంగ్‌ను మేకర్స్ గురువారం రోజు విడుదల చేశారు.
ఈ సందర్భంగా నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ, 'సిద్ధు యూత్‌లోనే కాదు.. అన్నీ ఏజ్‌ల వారికి స్టార్ బాయ్‌గా మారారు. ఈ సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు. గ్యారంటీగా మంచి సినిమా అవుతుందని భావిస్తున్నాను' అని అన్నారు.
'ఇంత మంచి పాటను రాసిన సనారెకి థాంక్స్. యూత్‌కి కనెక్ట్ అయ్యేలా పాట రాశారు. ఇంత మంచి ట్యూన్ ను అందించిన సురేష్ గారికి. మీకు సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని హీరోయిన్ వైష్ణవి చైతన్య చెప్పారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ, 'ఓ పనిని ఇలానే ఎందుకు చేయాలి.. మరోలా నేను చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటి వాడిని చూస్తే మనం క్రాక్ అంటుంటాం. అందుకనే ఈ టైటిల్ పెట్టాం. అందర్నీ నవ్విస్తూనే రెస్పాన్సిబుల్‌తో ఉండే పాత్రలో కనిపిస్తా' అని తెలిపారు.



అమ్మాయిలు జాగ్రత్త పడతారు

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కొత్త సినిమా 'శారీ'. సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించారు. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు గిరి కృష్ణ కమల్ రూపొందించారు. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రవిశంకర్ వర్మ నిర్మించారు.
ఈ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషలలో పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ,' సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పర్సనల్ విషయాలు షేర్ చేసుకోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సినిమా నేపథ్యమిదే. నేను ఈ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆరాధ్య చీరకట్టులో చేసిన ఒక రీల్ చూసి ఆమెను కాస్ట్ చేశాం. ఆమె చేసిన పర్‌ఫార్మెన్స్ సూపర్బ్‌గా అనిపించింది. సత్య ట్రెండ్ యాక్టర్. తను బాగా నటించాడు. 'శారీ' సినిమాలో మెసేజ్ ఉంటుందని చెప్పను. కానీ ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్తపడతారు' అని అన్నారు.


ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి

బ్యూటీఫుల్ మెలోడీగా 'మొదటి చినుకు..'

హీరో ప్రదీప్ మాచిరాజు మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ వేసవి కానుకగా ఏప్రిల్ 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.
డైరెక్టర్స్ ద్వయం నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రాన్ని మాంక్స్, మంకీస్ బ్యానర్ నిర్మిస్తోంది. దీపికా పిల్లి కథానాయికగా నటిస్తోంది.
గురువారం మేకర్స్ థర్డ్ సింగిల్ 'మొదటి చినుకు..' సాంగ్‌ను రిలీజ్ చేశారు. రధన్ స్వరపరిచిన ఈ రొమాంటిక్ మెలోడీ అద్భుతమైన గ్రామీణ నేపథ్యంలో తొలి ప్రేమలోని అమాయకత్వ మ్యాజిక్‌ని అందంగా చిత్రీకరిస్తుంది. చంద్రబోస్ రాసిన సాహిత్యం అద్భుతంగా ఉంది. సిద్ శ్రీరామ్ తన మెస్మరైజింగ్ వోకల్స్‌తో ట్రాక్‌ని నెక్ట్ లెవల్‌కి తీసుకెళ్ళారు. ప్రదీప్, దీపికల కెమిస్ట్రీ, ఆన్-స్క్రీన్ ప్రేమకథ అద్భుతంగా ప్రజెంట్ చేసింది. కొరియోగ్రాఫర్ విశ్వ రఘు వారి ప్రేమకథను బ్యూటీఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ చిత్రీకరించారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886